ఆదివారం
20 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 301

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



ధోతి ప్యాంట్లు.. కొత్త క్రేజ్ 8

కన్నయ్యపై చార్జిషీట్
తిరస్కరించిన కోర్టు



- న్యాయశాఖ ఆమోదం ఢిల్లీ పోలీసులు పొందకపోవడంపై ఆగ్రహం

ఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ఆమోదం లేకుండానే జెఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నాయకుడు కన్నయ్యకుమార్‌పై ఛార్జిషీట్ దాఖలు చేయడంపై ఢిల్లీ కోర్టు పోలీసులను తప్పుపట్టింది. 'న్యాయ శాఖ విభాగం నుంచి మీరు ఎలాంటి ఆమోదం పొందలేదు. అలా ఎందుకు ఛార్జిషీట్ దాఖలు చేశారని' పోలీసులను న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై ఢిల్లీ పోలీసులు బదులిస్తూ మరో 10రోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటామని పేర్కొన్నారు. కన్నయ్య కుమార్ 2016 ఫిబ్రవరిలో జేఎన్‌యూలో దేశ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారంటూ ఢిల్లీ పోలీసులు సోమవారం 1,200 పేజీలతో కూడిన ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఇందులో ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య, జమ్ము, కశ్మీర్కు చెందిన ఆక్యుబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రాయీ రసూల్, బషీర్ భట్, బషరత్ల పేర్లు ఈ ఛార్జిషీట్లో పొందుపరిచారు. పార్లమెంట్ దాడి చేసిన కేసులో అఫ్జల్‌గురుకు విధించిన ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమాలు చేపట్టారనేది వీరిపై ఉన్న ప్రధాన అభియోగం. గతంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. అధికార బీజేపీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి.

తెలంగాణ సర్కార్ పథకాలు
దేశానికే ఆదర్శం

- రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కృషి
- మార్చి నాటికి భగీరథ పూర్తి
- విద్యుత్ వినియోగం అభివృద్ధికి సూచిక
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ నరసింహన్



విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అన్నిరంగాలలో దేశంలోనే ఆదర్శప్రాయంగా తీర్చి దిద్దటమే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ స్పష్టం చేశారు. ఈ సంవత్సరం మార్చి నాటికి మిషన్ భగీరథ పథకం పూర్తి అవుతుందని ఆయన తెలియచేశారు. రెండోసారి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారిగా ఉభయసభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారం అయిందని గవర్నర్ నరసింహన్ అన్నారు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు నరసింహన్ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వం ముందుకుసాగుతోందని, విద్యుత్ కోతలను అధిగమించి ప్రభుత్వం తొలి విజయం సాధించిందని ఆయన చెప్పారు. పారిశ్రామిక, ఐటీ రంగంలో పారదర్శక విధానాలు అమలవుతున్నాయని, వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని గవర్నర్ వివరించారు.జీఎస్టీ వసూళ్లలోనూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఇటీవలే సీతారామ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు సాధించడం సంతోషదాయకమని, మిషన్ కాకతీయ ద్వారా సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరిగాయని గవర్నర్ వివరించారు.

విద్యుత్ వినియోగం పెరగడం అభివృద్ధికి సూచిక

"ఒకప్పుడు విద్యుత్ కోతతో రాష్ట్రంలో ఉద్ధృతంగా ధర్నాలు జరిగేవి. 42 నెలల్లోనే 800 మెగావాట్ల సామర్థ్యంతో కేటీపీఎస్ ప్రాజెక్టు పూర్తి చేశాం. సౌరవిద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ నేడు దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. విద్యుత్ వినియోగం లోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. పెరుగుతున్న విద్యుత్ వినియోగం. అభివృద్ధికి సూచికగా నిలుస్తుంది" అని గవర్నర్ వివరించారు.

దేశానికే ఆదర్శంగా 'రైతుబంధు'

"రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం ప్రవేశ పెట్టడం సంతోషదాయకం. ఈ పథకాన్ని దేశంలోని ఆర్థిక వేత్తలు, వ్యవసాయ వేత్తలు ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇప్పుడు దేశంలోని చాలా రాష్ట్రాలు రైతుబంధుని అమలు చేసే దిశగా సాగుతున్నాయి. రూపాయి ఖర్చు లేకుండా రైతులకు కొత్త పాసు పుస్తకాలు అందించాం. రైతు సమస్యలపై చర్చల కోసం రైతు వేదికలను ఏర్పాటు చేస్తున్నాం. చిన్నాభిన్నమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోంది. ధ్వంసమైన కులవృత్తులు మళ్లీ జీవనం పోసుకుంటున్నాయి.అని గవర్నర్ అన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ అవసరాల కోసం చేనేత కార్మికుల నుంచి భారీ ఎత్తున వస్త్రాలు కొనుగోలు చేస్తున్నాం. వరంగల్లో టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. గద్వాలలో కూడా టెక్స్‌టైల్ హబ్ నిర్మించే యోచనలో ఉన్నాం.అని వివరించారు.

సంక్షేమ పథకాల వల్లే రెండోసారి ఆదరించారు

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల కలలను సాకారం చేశాం. కంటి వెలుగు ద్వారా ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నాం. పరిపాలన, శాంతిభద్రతల విషయంలో ఎన్నో (తరువాయి 4లో)

రైతు సంక్షేమానికి అవసరమైన
చర్యలు చేపట్టాలి

- దేశ వ్యాప్తంగా రైతుబంధు పథకం అమలుకావాలి
- అన్నాహజారే

విజయక్రాంతి, హైదరాబాద్: దేశంలో రైతు సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే సూచించారు. సరియైన ప్రణాళిక, వ్యవసాయం అభివృద్ధికి నీరు, మార్కెటింగ్ వసతి కల్పించినప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. హైదరా బాద్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటైన అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సదస్సులో హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ, ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాజారే ప్రసంగిస్తూ రాష్ట్రంలో అమలు జరుగుతున్న రైతుబంధు పథకం దేశవ్యాప్తంగా అమలు కావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. రైతు సంక్షేమానికి ఉద్దేశించిన విశ్వనాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని హజారే విమర్శించారు. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంపై దృష్టి సారించాలని, రైతుబంధు పథకంతో పాటు రైతులకు మేలు చేసే అనేక పథకాలను అమలు చేయాలని ఆయన సూచించారు. జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలు కె. కవిత మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధికి యువత ఉత్సాహంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో ఉద్భవిస్తున్న కొన్ని సమస్యలకైనా ఈ అంతర్జాతీయ సదస్సు ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణ అనే అంశంపై చర్చ జరిగింది.



పంతం నెగ్గించుకున్న
రాజాసింగ్



- స్పీకర్ సమక్షంలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం

విజయక్రాంతి, హైదరాబాద్: బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తన పంతం నెగ్గించుకున్నారు. కొత్త స్పీకర్ సమక్షంలో శనివారం ఉదయం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ నూతన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తన కార్యాలయంలో రాజాసింగ్ చేత ప్రమాణం చేయించారు. హిందూ ధర్మం పట్ల వ్యతిరేకంగా ఉండే ఎంఐఎం పార్టీకి చెందిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ సమక్షంలో తాను ప్రమాణం చేయనని గతంలోనే ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికి రాజాసింగ్ సహా మరో నలుగురు ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. దీంతో శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో రాజాసింగ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌ను చేసినందుకు ఆలోచించాలన్నారు. బంగారు తెలంగాణ కావాలంటే అందరి నీ కలుపుకొని వెళ్లాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని రాజాసింగ్ అన్నారు.

మోదీ సర్కార్‌కు
రోజులు దగ్గరపడ్డాయి..



- యునైటెడ్ ఇండియా ర్యాలీలో విపక్షాల సమరశంఖం
- రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బీజేపీ: చంద్రబాబు
- దేశాన్ని మోదీ ఐదేళ్లలో ముక్కలు చేశారు: కేజ్రీవాల్
- విపక్షాల్లో మోదీని మించిన నేతలున్నారు: మమతా బెనర్జీ

విజయక్రాంతి, కోల్‌కతా: ప్రధాని మోదీ సర్కార్‌పై విపక్షాల ఐక్యవేదిక సమరశంఖం పూరించింది. పశ్చిమ్ బంగ రాజధాని కోల్‌కతా వేదికగా ప్రధాని మోదీ ప్రభుత్వం ఏకపక్ష విధానాలపై విపక్షాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మద్దతు తెలపగా.. వివిధ ప్రాంతీయ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్(ఎస్పీ), డీఎంకే చీఫ్ స్టాలిన్, బీజేపీ మాజీ మంత్రి అరుణ్ శౌరి, బీజేపీ మాజీ నేత యశ్వంత్ సిన్హా, బీజేపీ రెబల్ నేత శతృఘ్న సిన్హా, లోక్‌తంత్ర్ జనతాదళ్ చీఫ్ శరద్ యాదవ్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు,ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా, ఫరూఖ్ అబ్దుల్లా తదితరులు 'యునైటెడ్ ఇండియా బ్రిగేడ్' ర్యాలీలో భాగస్వాములయ్యారు. వీరితో పాటుగా పటేల్ హక్కుల నేత హార్దిక్ పటేల్, జిగ్నేష్ మేవానీ వంటి యువ నేతలు కూడా సభ వేదికపై మోదీకి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించారు.

విపక్షాల ఐక్యతను దేశ ప్రజలు కోరుకుంటున్నారు: మమతా బెనర్జీ

దేశ ప్రజలు కోరుకున్నందునే విపక్షాలంతా ఒకటయ్యాయని టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. (తరువాయి 4లో)

ఆ కూటమి
దేశానికే వ్యతిరేకం..

- ప్రజా హృదయాలను గెలవలేని ర్యాలీలా..?
- విపక్షాల ఐక్యర్యాలీపై ప్రధాని మోదీ ధ్వజం

సిల్వసా: పశ్చిమ బంగ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్కతా బ్రిగేడ్ మైదానంలో నిర్వహించిన విపక్షాల ఐక్య ర్యాలీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. గుజరాత్లోని సిల్వసాలో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలన్నీ తమను తాము కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుంటే, తాను మాత్రం దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఇదే తనకు, విపక్ష పార్టీలకు ఉన్న తేడా అన్నారు. విపక్షాలు ఇలాంటి ర్యాలీలతో వార్తల్లోకెక్కొచ్చు గానీ ప్రజల హృదయాలను మాత్రం గెలవలేరన్నారు.

'మహా కూటమి నాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్నది కాదు. దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్నది. విపక్షాలన్నీ కలిసి ఏకతాటిపైకి రాకముందే వారంతా ఎన్నికల్లో సీట్ల గురించి చర్చలు జరుపుతున్నారు' అని విరుచుకుపడ్డారు. పశ్చిమ్ బంగ రాష్ట్ర అసెంబ్లీకి భాజపా నుంచి ఒక్క ఎమ్మెల్యేనే ఉండటం వల్ల అన్ని పార్టీలు అక్కడ సమావేశమయ్యాయని మోదీ ఎద్దేవా చేశారు. 'ఒక్క ఎమ్మెల్యే ఉన్న పార్టీనే బంగాల్ ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ ఒక్కడి నుంచి కాపాడుకోవడానికి 'రక్షించడం, రక్షించండి' అని కేకలు వేస్తున్నారు' అని విమర్శించారు. సభ అనంతరం ప్రధాని సిల్వసాలో ఓ మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు.



దిమాక్ ఖరాబ్



ఆర్డినెన్స్ ద్వారానే.. తక్షణం రామాలయ నిర్మాణం

- రామాలయంతోనే దేశ పురోగతి సాధ్యం
- 2025లోపు నిర్మాణం పూర్తి కావాలి
- కేంద్రం వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలి
- ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీ భయ్యాజీ జోషి డిమాండ్



ప్రయాగరాజ్: అయోధ్యలో రామమందిర నిర్మాణంతోనే దేశ పురోగతి సాధ్యమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) జనరల్ సెక్రటరీ భయ్యాజీ జోషి అభిప్రాయపడ్డారు. 2025లోపు ఆలయ నిర్మాణం పూర్తి కావాలని ఆయన ఆకాక్షించారు. ట్రిపుల్ తలాక్ అంశంపై ఆర్డినెన్స్ తీసుకొచ్చినట్లుగానే కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు వచ్చి మందిర నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రామజన్మభూమి, బాబ్రీ మసీదు స్థల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చాకే ప్రభుత్వం తరుపున ఒక నిర్ణయం తీసుకోగలమని ప్రధాని మోదీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో సంఘ్ పరివార్ ఆయనపై గుర్రుగా ఉంది. సార్వత్రిక ఎన్నికల్లోపే అయోధ్యలో రామాలయ నిర్మాణంపై ఆర్డినెన్స్ తేవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేతోపాటు పలు హిందూ సంస్థలు కేంద్రంలోని (తరువాయి 4లో)

ప్రాంతీయ పార్టీలతో కలిసి..
యూపీఏ 3 ఏర్పాటు చేస్తాం

- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్



న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాక పోతే యూపీఏ3ని ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ అన్నారు. తమతో కలిసి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, వాటి మద్దతుతో కేంద్రంలో యూపీఏ3ని ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. శనివారం ఓ సమావేశంలో మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్ల మోదీపాలనలో దేశ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అచ్చేదిన్ అంటూ ప్రజలను మోసం చేసిన మోదీకి మరోసారి అధికారం ఎందుకివ్వాలని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా విపక్ష పార్టీలు మోదీకి వ్యతిరేకంగా కలిసి పోరాడుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ కంటే ఎక్కువ స్థానాలనే కాంగ్రెస్ గెలుచుకుంటుందని శశిథరూర్ ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ 282 స్థానాల్లో విజయం సాధించిందని, ఈసారి 160 కంటే ఎక్కువ వచ్చే అవకాశం లేదని శశిథరూర్ జోస్యం చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హంగ్ ఏర్పడే అవకాశం ఉందని బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఇది వరకే ప్రకటించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః



శ్రీ వికంబి నామ సంవత్సరం	సూర్యోదయం : ఉ. 06:49	కరణం	: వనిజ 14:19 విష్టి 24:34
ఉత్తరాయణం	సూర్యాస్తమయం : సా. 06:04	రాహుకాలం	: సా. 04:37, 06:00
హేమంత ఋతువు	పక్షము : శుక్ల పక్షం	యమగండం	: మ. 12:27, 01:50
పుష్య మాసం	తిథి : చతుర్దశి 14:19 తదుపరి పౌర్ణమి	వర్జ్యం	: సా. 06:45, 08:10
	నక్షత్రం : ఆరుద్ర 08:07	అమృతకాలం	: ఉ. 03:15, తె. 04:40
	యోగం : వైధృతి 14:43		

సూక్తి సుధ

మనసును ఎప్పుడు నిర్బంధించకూడదు. అలాగని వదిలేయకూడదు. అవి సాధనను ఆటంకపరుస్తాయి.

-స్వామి దయానంద సరస్వతి



శిరఃస్థితా దేవి

త్రిగుణాత్మక స్వరూపిణి



ఆదిత్యాది తేజస్సులకు ఆధారమైన ఓ తల్లీ! సూర్యుని ప్రకాశం వంటి కీర్తిప్రతిష్టలను మాకు అనుగ్రహింతువుగాక! నిత్యమైన, సత్యమైన పసుపు కుంకుమలనిచ్చి సర్వసౌభాగ్యదాయక చక్రంలో నిన్ను అర్చించే యోగ్యతను, భాగ్యాన్ని మాకు ప్రసాదించి దీవింతువుగాక!

'శిరఃస్థితా చంద్రనిభా, ఫాలస్తేంద్రా ధనుఃప్రభ హృదయస్థా, రవిప్రఖ్యా త్రికోణాంతర దీపిక''

'శిరఃస్థితా': బ్రహ్మరంధ్రంలో గురుస్వరూపంతో స్థిరంగా ఉండే దేవత. గురుపాదుకా రూపంలో అంతర్గతంగా ఉన్నది. సహస్రార కర్ణికలో స్థితమై ఉన్నది. కనుక, ధ్యానం చేస్తూ మానసికంగా శిరఃస్థితాదేవిని అర్చించుకోవాలి. ఉపాసకులు బ్రహ్మరంధ్రం దగ్గర గురువును స్మరించి, ఇష్టదేవతను భావించి సాధన చేయడం ఆనవాయితీ. అందుకే అమ్మవారిని 'శిరఃస్థిత'గా పిలుస్తారు. శిరస్సు మీద భక్తిగా పెట్టుకోవలసింది, శిరోధార్యం అని అర్థం. అమ్మవారి పాదాలను నిరంతరం స్మరిస్తూ వేదస్వరూపిణిగా చెప్పిన భావాలను, విషయాలను పాటిస్తేనని గౌరవించడం. ఈ భావనతోనే రామాయణంలో భరతుడు శ్రీరాముని పాదుకలను ఆ స్వామికి ప్రతీకగా తలమీద పెట్టుకున్నాడు. మనకు అత్యంత భక్తిగౌరవాలుండే గురువుల, మహానుభావుల పాదుకలను వారికి ప్రతిరూపంగా భావించి మన శిరస్సున ధరించడమన్నది వారి అనుగ్రహంకోసం నడవడం వంటిదే. శ్రీమద్రామాయణంలో పాదుకా పట్టాభిషేకమైనా, గురుపరంపరలో ఆచార్యుల పాదుకలైనా... ఇవి అమ్మవారికి ప్రతిరూపంగా ఉన్నవే!

బైందవాసనంగా అమ్మవారు శ్రీచక్రంలో బిందురూపిణి. ఈ బిందువు సహస్రార చక్రంలో ఉండే ఉపాసకుల శిరస్థానాన్ని సూచిస్తుంది. కనుక ప్రతి ఉపాసకునికి అమ్మవారే 'శిరఃస్థిత' ఉపాసనా క్రమంలో అన్ని చక్రాలనూ దాటి సహస్రారం దాకా వెళ్ళిన శక్తి సంపన్నులకు ఇక్కడ అమ్మవారే స్థిరంగా కనిపిస్తుంది. ఆ స్థితిలో ఉన్న ఉపాసకుడు 'స్వయం శ్రీదేవి దేవత' అన్నట్టు సాక్షాత్ శివుడే అవుతాడు. ఈ స్థితిలో శివుని నెత్తిపైన చంద్రున్ని చూసి అమ్మవారని భ్రమించడం, లేదా శివుడి నెత్తిమీద ఉన్న అమ్మవారిని చూసి చంద్రుడని భ్రమించడం జరుగుతుంది.

సాయంకాల ధ్యానంలో అమ్మవారిని శిరఃస్థితాగా భావించాలి. అందుకే మన పెళ్ళిమంత్రాల్లో కూడా 'మూర్ధానం ప్రత్యారారోహ' (వధువుని వరుని నెత్తిమీదకు ఎక్కమని) అంటారు. అంటే మనసు చంద్రుని సూచించేది. కాబట్టి ఆత్మస్వరూపమైన సూర్యుని ప్రతిరూపమైన వరుని నెత్తిపైకి వధువును ఎక్కమని చెప్పడమే దీని అర్థం. దీని అంతరార్థమేమిటంటే మనస్సు చంద్రుడైతే ఆత్మ సూర్యుడు. కనుక వధువు తన మనస్సుని, సూర్యుడైన వరుని ఆత్మను పొందడం అన్నమాట. మన స్నును ప్రజ్ఞ స్వరూ పంగా నిరంతరం మన ఆలోచనలను దైవ సాన్నిధ్యం వైపు మళ్ళించడమన్న మాట. ఆ శక్తిని 'శిరఃస్థితా' అమ్మవారు ప్రసాదిస్తుంది.



-సి. విజయలక్ష్మి రాజు





శ్రీ తుంబురేశ్వరస్వామి ఆలయం

మన ఊరు-మనగుడి



(ఆదివారం తరువాయి)

ఇంక తుంబురేశ్వరాలయానికొస్తే.. కొండమీద నాలుగు స్తంభాల చిన్న మండపం, మధ్యలో పెద్ద శివలింగం. కొండ తేలికగానే ఎక్కవచ్చు. ఆ శివ లింగ మున్న మండపాన్ని తోరణం అంటారు. ఆ శివలింగానికి వెనకగా కొంచెం దిగితే కనబడింది చిన్న ఆలయం. అందరి కళ్ళు పడకుండా దాచి పెట్టినట్టుంది. కొండ దిగువున గుడి, దాని ముందు 'గోలకి మఠం' (అక్కడ బోర్డేమీ లేదు. దీని గురించి, శ్రీ పాల్ చెప్పిన వివరం), దాని పక్కనే పెద్ద చెరువు, ఆ చెరువు మధ్యలో వేలుపుగొండ. ఆ వేలుపుగొండ మీద మహవీరుడి విగ్రహం, ఇంకా వెతికితే వేరే విగ్రహాలు వుండవచ్చు. మరి ఈ సీను హైదరాబాదులోని హుస్సేన్‌సాగర్, టాంక్ బండ్, నెక్లెస్ రోడ్డులతో పోటీ పడదా! ప్రభుత్వం తలచుకుంటే!

ఇన్నాళ్ళకి ఆ ఆలయం చేరుకున్నాం. మళ్ళీ అనుమానం. అదే అవునా కాదా అని. మా అనుమానం నివృత్తి చేస్తూ శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయం పైన ఆలయం పేరు ఎప్పుడో పెయింటుతో రాసి ఉంది. ఆలయం చిన్నదే. కానీ ఉన్న కొన్ని శిల్పాలు చాలా బాగున్నాయి.. వరంగల్ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయ శిల్పాలకు దీటుగా వున్నాయి.

అన్నట్టు ఈ ఆలయ నిర్మాత కూడా కాకతీయ రాజే. మొదటి ప్రతాప రుద్రుడు (ఈయనికే రుద్రదేవుడనే పేరు కూడా వుంది. హన్మకొండలో వెయ్యి స్తంభాల ఆలయ నిర్మాత కూడా ఈయనే) జహీరాబాద్, బీదర్, నగనూర్ మండలం మీదుగా విజయం సాధించి తిరిగి వస్తూ, ఆ గుర్తుగా ఈ దేవాలయం నిర్మించారు. తర్వాత మెదక్‌లోని కోటని నిర్మించారు. ఆలయ నిర్మాణం, శిల్పాలు నల్లరాతితో ఉన్నాయి. రాయి ఈ ప్రాంతంలో దొరికేదానిలాగా లేదు. మరి ఎక్కడనుంచి తెచ్చారో. ఆలయం గురించి కానీ, వేలుపుగొండ గురించిగానీ, ఆ ఊరు సర్పంచ్ శ్రీ పాల్‌గారు చెప్పిన విశేషాలు ఇవి. నల్లరాతితో నిర్మించిన ఆలయం. శిల్పాలు అద్భుతంగా నల్లరాతిలో చెక్కబడి, జీవకళ ఉట్టి పడుతూ ఉన్నాయి. ఆలయం బయట గోడలకి వున్న శిల్పాలలో మొదటి శిల్పం ఒక నాగినిది (శరీరం మీద నాగుపాము అల్లుకుని వున్నది). రెండవది ఒక పురుషుని శిల్పం. తలపాగా, చేతిలో ఆయుధం, పాదరక్షలు, గంభీర ముద్ర. తర్వాత మళ్ళీ ఒక అద్భుత సౌందర్యరాశి. ఆమె పక్కన ఒక గవాక్షంలాంటి దానిలో ఒక స్త్రీ మూర్తి, ఎవిమిది చేతులు, వాటిలో త్రిశూలం, ఢమరుకం, ఖడ్గం, అభయ హస్తం వగైరాలతో, మెడలో సర్పం, పులిని దండ వేలాడుతున్నది. ఈ విగ్రహంలో కొన్ని భాగాలు ధ్వంసమయ్యాయి. బహుశా కాళీమాత అయి ఉంటుంది. ఆలయం వెనుక భాగంలో ఇద్దరు స్త్రీ మూర్తులు నృత్య భంగిమలో, మధ్య గవాక్షంలాంటి దానిలో సరస్వతీదేవి కింద హంస, కుడి చేతిలో జపమాల, ఎడమ చేతిలో తాళపత్ర గ్రంథాలతో, తర్వాత మరో ఇద్దరు స్త్రీ మూర్తులు. అందులో ఒక స్త్రీ అద్దంలో తన సౌందర్యాన్ని చూసుకుంటూ అజంతా శిల్పాన్ని గుర్తు తెస్తుంది. పక్కనే ఇంకా స్త్రీ మూర్తులు, వారిలో ఒకరు తన బిడ్డని ఎత్తుకుని నుంచుంటే, ఇంకొక స్త్రీని కోతి లాగుతూ వుంటుంది (రామప్ప గుళ్ళో శిల్పం మళ్ళీ గుర్తొస్తుంది). మధ్యలో మహిషాసుర మర్దని అత్యద్భుత శిల్పం. 8 చేతులు, వాటిలో ఖడ్గం, పాశం, గద, కత్తి, బాణం, వగైరా ఆయుధాలు, మహిషాసురుణ్ణి సంహరిస్తున్న జగజ్జనని, మహిషాన్ని గాయపరుస్తున్న అమ్మవారి వాహనం పులి. తర్వాత ఇద్దరు పురుషులు ఒకరు దిగంబరులు, ఇంకొకరు విల్లంబుధారులు.

ఆలయం ఎదురుగా వస్తే ఆలయానికి మూడు ద్వారాలున్నాయి. మధ్యలో పెద్దది, అటూ ఇటూ చిన్నవి. బయట శిల్పాలు పూర్ణ కుంభం, 5 పడగల నాగేంద్రుడు, సగం సర్పం, సగం దేవతా మూర్తి వగైరా శిల్పాలు నల్లటి రాతిలో చెక్కబడి అత్యంత ఆకర్షణీయంగా వున్నాయి. ప్రవేశ ద్వారానికి ఎడమ వైపు నల్ల రాయి పుష్పం ఆకారంలో చెక్కబడింది. మధ్యలో లింగం, దాని మీద కూడా ఆకులు వగైరా డిజైన్ చెక్కబడింది. బయటి ప్రాకారానికి 7, 8 దాగిని శిల్పాలున్నాయి. ఆలయం ముందు భాగం అంతా రకరకాల శిల్పాలు చెక్కబడి వున్నాయి.

లోపలికి ప్రవేశిస్తే ఆది పురాతన మండపం. స్తంభాలు రెండు రకాలుగా (రంగు రంగులవి కొన్ని, నల్లరాతితో చెక్కబడ్డవి కొన్ని) రెండుసార్లు నిర్మింపబడింది అనిపించేటట్టు ఉన్నాయి. గర్భగుడి ప్రవేశ మార్గం అత్యద్భుత శిల్ప కళకి నిదర్శనం. ఇరు పక్కల ద్వార పాలకులతో పాటు ఇతర స్త్రీ పురుషుల విగ్రహాలు, పైన కొన్ని సంగీత వాయిద్యాలతో వున్న మూర్తులు, ఏ శిల్పం చేతిలో ప్రాణం పోసుకున్నాయోగానీ, నేటికీ తమ కళలను కోల్పోకుండా అలాగే ఉన్నాయి.

గర్భ గుడిలో అడుగు పెడితే తెల్లటి శివలింగం, ఎదురుగా చిన్న నంది, వెనక గోడ మీద చిత్రించిన తుంబురుడి చిత్రం, స్వామికి కుడి పక్క పార్వతీదేవి, గోడ మీద నిలిచిన దేవతా మూర్తి ఒక్కతాను ఐదు తలల సర్పం చుట్టుకుని తలపై ఛత్రం పడుతున్నట్లు, స్వామికి ఎడమ చేతి వైపు వెనుక దంపతులు, పక్కన ఇంకొక స్వామి శిల్పం (ఎవరో తెలియలేదు), మరొక పక్క ఆంజనేయస్వామి.

మార్గం: వేలుపుగొండ, సంగారెడ్డి తాలూకా, మెదక్ జిల్లా. పెద్ద శంకరంపేట వార్నింగ్ రోడ్డులో దాదాపు 10 కి.మీ.ల దూరంలో వున్నది. వేలుపుగొండ (టేక్‌మల్ మండలం) అని అడగండి. లేకపోతే ఎల్లుపేటనుంచి కొంచెం ముందుకు వెళ్ళాలి.

-పి.యస్.యమ్. లక్ష్మి

శ్రేష్ఠమైన వారు ఎవరు?

చాణక్యం



శ్లో|| బాహువీర్యం బలం రాజ్ఞో బ్రాహ్మణో బ్రహ్మవిద్బలీ| రూప యౌవన మాధుర్యం స్త్రీణాం బలముత్తమమ్||

రాజునకు భుజబలమే బలం. వేదమును, ఈశ్వరుని తెలుసుకున్న బ్రాహ్మణుడే బలం కలవాడు. సౌందర్యం, యవ్వనం, మధురమైన మాటలు తెలిసిన స్త్రీలకు శ్రేష్ఠమైన బలం ఉంటుందని చాణక్యనీతి శాస్త్రంలో తెలియచేస్తున్నారు. ఇంకా భారతంలో ఇలా ఉంది. 'క్షతియో బాహువీర్యస్తు' అంటే క్షత్రియులకు బలపరాక్రమాలు వారి భుజాల్లో ఉంటుందంటున్నారు. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు ఒకానొక సందర్భంలో ఆరాసంధునితో తెలియచేస్తున్నాడు. అలాగే బ్రాహ్మణులకు బలం వారి మాటల్లో ఉంటుందంటున్నారు. ఎందుకంటే వారు వేదపారాయణం చేసి వాటి సారాన్ని ఇతరులకు తెలియచేయడాన్ని వారి చేత ఆమృతం తాగించినట్లుంటుందని చాణక్యుల వారు తెలియచేస్తున్నారు. ఇంక స్త్రీకి బలం ఆమె రూపంలోనూ, యవ్వనంలోనూ, మధుర సంభాషణంలోనూ ఉంటుందంటున్నారు. ఇంకా చాణక్యుల వారు స్త్రీ గురించి చాణక్య సారగ్రంథంలో ఇలా తెలియచేస్తున్నారు.

శ్లో|| యస్య భార్యా సురూపాచ భర్తారమనుగామినీ|| నిత్యం మధురవ క్త్రీ చ సా శ్రియో న్యశ్రియః శ్రియః||

దీని తాత్పర్యమేమంటే రూపవతి అయిన భార్య కలవాడు, అనుకూలంగా ప్రవర్తించు భార్య కలవాడు, మధురంగా మాట్లాడే భార్య కలవాడు అదృష్టవంతుడంటున్నారు. ఇతని వద్ద ధనం లేకపోయినా భార్య అనుకూలత వల్ల మిక్కిలి ధనవంతుడంటున్నారు. సాధారణంగా ధనం ఉన్నవాడు ధనవంతుడు కాదంటున్నారు. అంటే పై లక్షణాలున్న ఉన్న వాడు మాత్రమే ధనవంతుడని, మిక్కిలి అదృష్టవంతుడని చాణక్యుల వారు తెలియచేస్తున్నారు. అన్ని గుణాలు కలిగిన స్త్రీని భార్యగా పొందటం ఆ పురుషుడు చేసుకున్న పుణ్యఫలమేనని అంటున్నారు.

- **యామిజాల సుబ్రహ్మణ్యం**

పురాణ క్విజ్

తెలిసినవేంటో తెల్సుకోండి! తెలియనివన్నీ తెలుసుకోండి..

1. అక్రూరుడు ఎవరి కుమారుడు?
2. విభీషణుడి పెద్ద కూతురి పేరు?
3. ప్రహస్తుని కొడుకు పేరు?
4. సీతారాములకి చూపమన్న ఆభరణం పేరు?
5. జంబుమాలిని వధించినవాడు?
6. గంధమాదన పర్వతం వద్ద భీముని అడ్డుకున్న వాడు ఎవరు?
7. జటాసురుని సంహరించినవాడు?
8. భీమునికి రామకథను చెప్పినవాడు?
9. యక్ష రాక్షసులకు రాజు ఎవరు?
10. సత్వగుణం గల దేవుడు?

జవాబులు

1. శ్వఫల్కుడు 2. త్రిజట 3. జంబుమాలి 4. చూడామణి 5. హనుమంతుడు 6. హనుమంతుడు 7. భీముడు 8. హనుమంతుడు 9. కుబేరుడు 10. విష్ణువు

గ్రహం అనుగ్రహం

మేషం



ఈ వారం మీకున్న ఆస్తుల విలువ పెరిగే అవకాశం. ఆదాయ వ్యయాలు సమానం. కుటుంబంలో సుఖసంతోషాలుంటాయి. సంతాన ప్రాప్తి కలుగుతుంది. భూ, గృహాది విషయాలందు శుభాలందుకుంటారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగ, రియల్ ఎస్టేట్ రంగాలలో అనుకూల ఫలితాలుంటాయి. పనులలో సమిష్టితో విజయాలు సాధిస్తారు. వివాహాది విషయాలు గోష్ఠిక మంచిది.

పరిహారం: మహాలక్ష్మి అమ్మవారి దర్శనం చేసుకోండి

వృషభం



ఆర్థిక లావాదేవీలయందు గుర్తింపు లభిస్తుంది. బంధువుల నుండి ఆశించిన సహాయ సహకారాలు అందుకుంటారు. మౌనం పాటిస్తూ పనులు పూర్తి చేయండి. స్థాన చలనాలున్నాయి. ఆస్తి విషయాలు, వివాహాది కార్యాలందు మెళకువలు పాటించాలి. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలందు సంతృప్తి. ఉద్యోగులకు మంచి ప్రయోజనాలు కలుగుతాయి. దంపతులు ఏకాభిప్రాయంతో ఉంటారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కలిసివస్తాయి.

పరిహారం: రామాలయం దర్శించండి

మిథునం



ఆర్థిక వ్యవహారాలు శుభకరంగా వుంటాయి. ఆలోచనకు అనుగుణంగా పనులు పూర్తి చేయండి. మిత్రుల సాయం ఉపకరిస్తుంది. విమర్శలకు దీటుగా స్పందించండి. విద్య, ఉద్యోగ రంగాలు ఆనందాన్నిస్తాయి. వ్యాపార, వ్యవహారాలు వాతావరణానికి వ్యతిరేకంగా ఉండకుండా చూసుకోవాలి. పెట్టుబడులు రాబడినిస్తాయి. శుభవార్తలు వింటారు. ఒక శుభకార్యానికి హాజరు కావాలనే ఆలోచన బలీయమవుతుంది.

పరిహారం: ఐశ్వర్య లక్ష్మిని పూజించండి


కర్కాటక



ఆర్థిక వృద్ధి కలుగుతుంది. లక్ష్యాలను నెరవేర్చుకుంటారు. వ్యక్తిగత, ఉద్యోగ జీవనంలో నిర్లక్ష్యం పనికిరాదు. కృషితో అన్ని పనులు ఫలప్రదం అవుతాయి. మీరకున్న సహాయం సమయానికి అందకపోవచ్చు. అప్పుల రాక సంతోషాన్ని పెంచుతుంది. అన్ని విషయాల పట్ల శ్రద్ధ అవసరం. ముఖ్యమైన పత్రాల్లో అప్రమత్తత మేలు. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలలో తృప్తి. ప్రయాణాలందు ఆందోళనలు వద్దు. స్పెక్యులేషన్ రంగాల వారికి మిశ్రమ ఫలితాలుంటాయి.

పరిహారం: లక్ష్మీగణపతి దేవాలయంలో స్వామికి అర్చన చేయించండి.

సింహం



డబ్బు సమయానికి అనుకోకుండా అందుతుంది. పరిస్థితులు అనుకూలిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఆర్థిక వ్యవహారాలతో ముడిపడి ఉంటాయి. ముఖ్యమైన పత్రాలు అందుకుంటారు. ఆకాపిరా దృక్పథంతో ఉద్యోగ ప్రయత్నాలు సాధించుకోండి. భయాందోళనలు దగ్గరకు రానీయకండి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాల్లో అనుకూలం. వారం మధ్యలో ధనం సమయానికి అందక ఇబ్బందులెదుర్కొంటారు. మీ శ్రీమతి సలహాను తేలికగా కొట్టిపేయకండి.


పరిహారం: ఆంజనేయ స్వామిని తమలపాకులతో అర్చించండి.

కన్య




ఆదాయం, వ్యయం రెండూ సమానంగా ఉండే అవకాశం ఉంది. మీ స్వశక్తి వలన సంపాదించుకున్న అవకాశాలను ఏ మాత్రం కూడా వదులుకోవద్దు. శక్తికి మించిన పనులు చేపట్టవద్దు. పెట్టుబడులకు అనుకూల సమయం. పనుల్లో అనుకూలత కలుగుతుంది. పాదుపు మార్గాలు ఫలిస్తాయి. మదుపు చేసేటప్పుడు ఆలోచించండి. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు. వృత్తి, వ్యాపార, ఉద్యోగ, రియల్ ఎస్టేట్ రంగాలు శ్రమానుకూలంగా ఉంటాయి.

పరిహారం: శివాలయంలో రుద్రాభిషేకం చేయండి.



-దాయసోలు మల్లికార్జున శర్మ 99890 77388

తుల



ఆర్థిక లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. అనుకున్న కార్యాలు పూర్తి చేసుకోగలుగుతారు. ఆత్మీయులను కలుసుకుంటారు. ఇతరులకు మీ ఆర్థిక వివరాలు తెలపకండి. విలువైన వస్తువులతో ప్రయాణాలందు మెళకువలు పాటించాలి. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలు సహజంగా ఉంటాయి. పిల్లల ద్వారా శుభవార్తలు వింటారు. కుటుంబ సభ్యుల సలహాలు మేలు. స్పెక్యులేషన్ రంగాల వారికి ఈ వారం మిశ్రమంగా ఉంటుంది.

పరిహారం: విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణ చేయండి.


వృశ్చికం



ఆర్థిక స్థితి గతులు ప్రోత్సాహకరంగా వుంటాయి. ఉద్యోగ, వ్యవహారాల్లో అదనపు బాధ్యతలు స్వీకరించవలసి వస్తుంది. పనులు చాకచక్యంగా పూర్తి చేస్తారు. ఒప్పందాలన్నిటిలో మెళకువలు వహించాలి. స్వల్పంగా ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. పెద్దల సలహాలు ఉపకరిస్తాయి. పంతాలకు పోవొద్దు. అన్యంటా విలువలు పెరుగుతాయి. అనవసర మాటలు గురించి ఆలోచించవద్దు. మీర్తైన పద్ధతిలో రాజీపడండి. అనుకూలం ఏదో ఒక సమస్యతో సతమతమవుతారు.

పరిహారం: గణపతికి ఉండ్రాళ్ళు నివేదన చేయండి.


ధనుస్సు



ఆర్థిక ప్రగతి గోచరిస్తుంది. ఋణబాధలు తొలగుతాయి. ప్రణాళికలు ఉపయోగపడతాయి. ఇతరుల నైపుణ్యాన్ని పెంచగలుగుతారు. పరిచయాలు ఉపకరిస్తాయి. శుభవర్తమానాలు అందుతాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగ, వైద్య రంగాలు సంతృప్తినిస్తాయి. పెట్టుబడులకు మంచి సమయం. విద్యార్థులు అనుకున్నది అందుకుంటారు. బాధ్యతతో పనులు పర్యవేక్షించుకోవాలి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. స్థిరాస్తి కొనుగోలు దిశగా ఆలోచిస్తుంటాయి.

పరిహారం: వెంకటేశ్వర స్వామికి తులసిని సమర్పణ చేయండి.


మకర



ఆర్థిక వ్యవహారాల్లో పట్టు సాధిస్తారు. ధనలాభాలు ఉంటాయి. పొదుపు పథకాలు అనుకూలిస్తాయి. నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు వెళ్ళారు. ముఖ్య విషయాల్లో పట్టుదల మంచిది. పనులు అనుకూలిస్తాయి. సంతోషకరమైన వార్తలు వింటారు. కుటుంబ సభ్యుల విద్య, ఆరోగ్య విషయాలు బాగుంటాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలు లాభ మార్గాన ఉంటాయి. అనుకున్న మార్పులు, చేర్పులుంటాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి మిశ్రమ ఫలితాలుంటాయి.

పరిహారం: నృసింహ స్వామిని దర్శనం చేయండి.


కుంభ



ఆర్థిక వ్యవహారాలు ఆశ్చర్యాన్ని కల్గిస్తాయి. కొత్త విషయాలను తెలుసుకుంటారు. అవకాశాలు కలిసి వస్తాయి. దంపతులు సఖ్యతతో ఉండాలి. కొన్ని పనులు మెల్లగా పూర్తవుతాయి. ఆరోగ్యం జాగ్రత్త. విద్య, వైద్య, వృత్తి, వ్యాపార రంగాలు సంతోషాన్నిస్తాయి. నిరుద్యోగులకు శ్రమానుకూలంగా ఉద్యోగాలు వస్తాయి. జీవిత భాగస్వామి సలహాలు ఉపకరిస్తాయి. చేపట్టిన పనులు అనుకున్నంత చురుకుగా సాగవు. గత కొంత కాలంగా వేధిస్తున్న సమస్యలకు తెరపడుతుంది.

పరిహారం: శివునికి తెలుపు రంగు పుష్పాలతో అర్చన చేయండి


మీనం



ఆదాయ వ్యయాలు తృప్తినిస్తాయి. అనుకున్న పనులు నిదానంగా పూర్తవుతాయి. మిత్రులు సాయపడతారు. కుటుంబంలో ముఖ్య కార్యాలందు మీ సలహాలు మేలవుతాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలు ఆనందదాయకం. అనుకోని ధనం అందేట్టుంది. మీ ప్రయత్నాలతో వ్యవహార ఒప్పందాలు స్థిరీకరణ ఏర్పడుతుంది. స్పెక్యులేషన్ ఫలవంతం అవుతాయి. స్త్రీలు అన్నింటా ముందుంటారు. శుభాలను పొందుతారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి మీ పనులు త్వరితగతిన పూర్తి చేస్తారు.

పరిహారం: దుర్గ సప్తశ్లోకి పారాయణ చేసుకోండి.





గంగిగోవు పాలు గంటెడైనను చాలు!
కడివెడైన నేమి ఖరముపాలు?
భక్తిగల్గు కూడు పట్టెడైనను జాలు
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం: ఓ వేమా! మంచి ఆవు పాలు గరిటెడైననూ చాలును. తాగుటకు శ్రేష్ఠముగా ఉండును. గాడిద పాలు కడవతో ఇచ్చినను ప్రయోజనం ఉండదు. ప్రేమతో పెట్టెడు భోజనం పిడికెడైనను మంచిది. ప్రేమ లేని భోజనం పొట్ట నిండా పెట్టినను వ్యర్థమగును అని వేమన చెప్పుచున్నాడు.

మాటల మూటలు

వికాసమే విజయం


- సరైన పదం ఎంతో ప్రభావాన్ని చూపుతుంది కానీ సరైన సమయంలో వచ్చే నిశ్శబ్ధానికి సమానమైన శక్తి ఏ పదానికీ ఉండదు.
- మనం ఎంత తక్కువగా మాట్లాడితే, అంత ఎక్కువగా మన మాటల్ని వినాలని ఇతరులకు అనిపిస్తుంది, ఎంత మౌనంగా ఉంటే అంత ఎక్కువగానూ మనం వినగలం. అయితే మాట్లాడడానికి ఏమీ లేనప్పుడు.. మౌనంగా ఉండటం మాత్రం చాలా కష్టం!
- మనసులో ఉన్న విషయాన్ని చెప్పడానికి ఎక్కువ మాటలు కావాలని అనిపిస్తుందా? అయితే దాని గురించి మరింత లోతుగా మనం ఆలోచించాల్సిందే!
- సంభాషణను ఎక్కడ మొదలు పెట్టాలో, ఎక్కడ ఆపాలో మొదట మనం తెలుసుకోవాలి.. ఆ మొదలు, ముగింపు వీలైనంత దగ్గరగా ఉండాలి. ఇవి చేయగలిగితే మనం సంభాషణా చతురులం అయినట్లే!

నేను గల గలా మాట్లాడుతున్నప్పుడు, అందరూ నన్ను నోరు మూసుకోమంటారు. నేను మౌనంగా ఉంటేనేమో.. సమస్య ఏమిటి? అని అడుగుతారు.

– స్వామి పార్థసఖానంద

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం-11



శ్లోకం:

ఘటో వా మృత్పిండో ప్యణురపి చ ధూమోగ్ని రచలః
పటో వా తంతుర్వా పరిహరతి కిం ఘోరశమనమ్ |
వృథా కంఠ క్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమ సౌఖ్యం వ్రజ సుధీః ||6||

భావం:

ఓ మనసా! కుండలు చేయుటకు మట్టి సాధనం. దానికి పరమాణువులు కారణం. కొండమీద పొగ కనబడుతున్నది. కావున నిప్పు అక్కడ ఉంది. బట్టలు దారాల వల్ల కలుగును. ఈ మొదలగు తర్క శాస్త్ర వాక్యాలలో ఒక్కటి కూడా మృత్యువుకు అడ్డుపడునది కాదు. ఇవి పిడివేసి వల్లించి కంఠక్షోభను ఏల కలిగించుకొనెదవు? వాదించి ఊరకనే కంఠశోషను పొందుతావు? వద్దు శివుని పాదపద్మాలను సేవించి, శివభజన చేసి సుఖాన్ని, మోక్షాన్ని పొందు.

వివరణ

వివిధ జ్ఞానాలతో ఎన్నో రకాలుగా మనం విజ్ఞులమైనా, అవసానకాలం ఆసన్నమైతే, ఆ శాస్త్రజ్ఞానం నిరుపయోగమే! మృత్యుంజయుని బారి నుండి, అది మనల్ని రక్షించలేదు.వ్యాకరణ వేత్తకు, అన్ని రకాల సంధి సూత్రాలు, కంఠతః వచ్చినా, ఏ సూత్రమడిగినా, తడుము కోకుండా వెంటనే సరిగ్గా చెప్పగలిగినా ఆ సమాధానాలు, ఆ విజ్ఞానం యముడిని మభ్యపెట్టి ఆయన కర్తవ్యాన్ని మరుగుపరచలేవు. ఆయన మనస్సును మార్చలేవు.

అనర్గళంగా శ్రుతుల్ని (వేదాలను), స్మృతుల్ని వినిపించినా ప్రయోజనం వుండదు. శిల్పనాట్య సంగీతాదుల వల్ల కూడా అంతే! తర్క శాస్త్ర పదాలు పలికి వల్లెవేసినంత మాత్రాన కంఠానికి వ్యథ, శ్రమ తప్ప కాలుడిని, కాల నిర్ణయాన్ని మార్చలేవు. కలకాలం జీవింప చెయ్యలేవు. ఇంతకన్నా ఆ పరమశివుని పాద పద్మాలను ఆశ్రయించి, ఆరాధించి, పరమ ప్రశాంత సౌఖ్యాన్ని, శాశ్వతానందాన్ని పొందటం మేలు కదా! అంటున్నారు శంకరులు.(మార్కండేయుని కథ లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకుంటే ఈ శంకరుల సలహాకు అర్థం తెలుస్తుంది).

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా॥ శ్రీరామ్, హైదరాబాద్

పుష్ప విలాసం

లేతపచ్చరంగు పూతనించె నిచట
మందసమ్ము వోలె మాని చెంత
పసిడి దాచినట్లు పరిఢవిల్లెను పూలు
సూర్యకాంతి సోక సోలునేమో..!



– డా॥ బాలు శర్మ పన్నాల

విశ్వామిత్రుని రాజ్యాహంకార భంగం

గౌతమ మహర్షిల కుమారుడైన శతానందుడు విశ్వామిత్రుడి జీవిత వృత్తాంతాన్ని శ్రీరామచంద్రునికి వినిపిస్తాడు.

వంశ వృత్తాంతం

బ్రహ్మ కుమారుడు కుశుడు. ఆయన పుత్రుడు కుశనాభుడు. ఆయనకు నూరుగురు కుమార్తెలు. ఆ నూరుగురు కుమార్తెలను బ్రహ్మదత్తుడికి ఇచ్చి వివాహం చేస్తాడు. ఆ తరువాత కుశనాభుడికి పుత్రసంతానం లేకపోవడం వల్ల పుత్రకామేష్టి యాగం చేస్తాడు. తండ్రి అయిన కుశ మహారాజు ప్రత్యక్షమై, అత్యంత పరాక్రమం కలిగి కీర్తిని ఇవ్వగల పుత్రుడుగా గాధి జన్మిస్తాడు అని వరమిస్తాడు. ఆ విధంగా కుశనాభుడికి జన్మించిన గాధి కుమారుడే విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడు కుశవంశంలో జన్మించాడు కాబట్టి కౌశికుడు అనే పేరు కూడా ఉంది.

వశిష్ఠుని విందు

విశ్వామిత్రుడు చాలా కాలం రాజ్యం చేశాడు. ఒకరోజు ఒక అక్షౌహిణి సైన్యంతో వేటకై వెళ్ళి, అలసి, వశిష్ఠ మహర్షి ఆశ్రమానికి చేరుకొంటాడు. కుశల ప్రశ్నలు, అర్ఘ్యపాద్యాదులు అయ్యాక, విశ్వామిత్రుడు సెలవు తీసుకోబోగా, వశిష్ఠ మహర్షి తన ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరతాడు. అప్పుడు విశ్వామిత్రుడు 'మీ దర్శనం వల్ల, అర్ఘపాద్యాదుల వల్ల ఇప్పటికే సంతుష్టుడనయ్యాను. కాబట్టి సెలవు ఇప్పించవలసింది' అని అంటాడు. కానీ వశిష్ఠుడు ఆతిథ్యం తీసుకోమని బలవంతపెట్టడంతో, విశ్వామిత్రుడు అంగీకరిస్తాడు. వశిష్ఠుడు తన హోమధేనువు, కామధేనువు సంతతికి చెందినదీ అయిన 'శబళ' అనే గోవును పిలిచి మహారాజుకు, ఆయన సైన్యానికి వారివారి ఇచ్ఛానుసారం పదార్థాలు తయారు చేసి, విందు చెయ్యమంటాడు. వశిష్ఠుని ఆజ్ఞ మేరకు శబల సైనికుల ఇష్టాలను గ్రహించి, ఆ మేరకు వారికి నచ్చిన పదార్థాలు సృష్టించి, అతిథి సత్కారాలు చేస్తుంది.

శబళను కోరడం.. వశిష్ఠుడు నిరాకరించడం

అప్పుడు విశ్వామిత్రుడు.. నేను నీకు మెడలో బంగారు తాడులున్న పద్నాలుగు వేల ఏనుగులనిఇస్తాను, ఎనిమిది వందల బంగారు రథాలని ఇస్తాను, ఆ ఒక్కో రథానికి స్వర్ణాభరణాలతో అలంకరింపబడ్డ నాలుగు గుర్రాలు ఉంటాయి, అలాగే గొప్ప గొప్ప జాతులకి చెందిన పదకొండు వేల గుర్రాలు ఇస్తాను, ఒక కోటి గోవుల్ని ఇస్తాను, బంగారం, వెండి ఎంత కావాలో నువ్వే అడుగు, నేను ఇచ్చేస్తాను అన్నాడు. ఇవన్నీ విన్న వశిష్ఠ మహర్షి, నేను ఇంక ఏమి మాట్లాడను అన్నారు.

ఆగ్రహించిన విశ్వామిత్రుడు, ఈయన ఇవ్వడమేంటి నేను పుచ్చుకోవడమేంటి, అడిగినకొద్ది బెట్టు చేస్తున్నాడు, ఈ రత్నం నాకు చెందినది అని ఆ శబళ మెడలో తాడు కట్టి, సైనికులకిచ్చి తీసుకెళ్ళమన్నాడు. వాళ్ళు దాన్ని ఈడ్చుకెళుతుంటె ఆ శబళ ఏడ్చింది. ఇంత జరుగుతున్నా వశిష్ఠుడు మాత్రం అలానే నిశబ్దంగా ఉన్నారు. అప్పుడా శబళ.. ఇంతకీ నన్ను వశిష్ఠుడు వదిలేశాడ, లేకపోతే విశ్వామిత్రుడు తీసుకెళుతున్నాడ, వశిష్ఠుడు నన్ను ఇవ్వను అంటె విశ్వామిత్రుడు నన్ను తీసుకెళ్ళగలడా, వశిష్ఠుడు నన్ను వదిలేశాడంటే నేను ఏదో పాపం కాని, పొరపాటు కాని చేసి ఉండాలి, ఒక వేళ నేను ఏదన్నా పాపం చేసి ఉంటే వశిష్ఠుడికి క్షమార్పణ చెప్తాను, ఆయన బ్రహ్మర్షి కనుక నన్ను తప్పకుండా క్షమిస్తారు అని తాడు విడిపించుకొని వశిష్ఠుడి దెగ్గరికి పరుగుతీసి వెళ్ళింది.

అప్పుడు వశిష్ఠుడు..

న త్వాం త్యజామి శబలే న అపి మే అపకృతం త్వయా |
ఏష త్వాం నయతే రాజా బలాత్ మత్తః మహాబలః ||



శబళా! నేను నిన్ను విడిచిపెట్టలేదు. విశ్వామిత్రుడే నిన్ను బలాత్కారంగా తీసుకెళుతున్నాడు. ఆయన ఈ భూమికి ప్రభువు, కాని నేడు తప్పు త్రోవలో వెళుతున్నాడు, అతను దోషం చేస్తే, ఆ దోషం అతనిని కాలుస్తుంది. నిన్ను ఈడ్చుకెళ్ళి దోషం చేశాడు, ఇక ఆయన అపరాధమే ఆయనని కాలుస్తుందని చెప్పాడు.

అయితే నన్ను నేను రక్షించుకోనా అని శబళ అడుగగా, తప్పకుండా రక్షించుకో అని వశిష్ఠుడు చెప్పాడు. అప్పుడా శబళ గట్టిగా అంబా అని అరిచి శూలాయుధధరులైన పహ్లావులు కొంతమందిని సృష్టించింది. వాళ్ళు విశ్వామిత్రుడి సైన్యాన్ని నాశనం చెయ్యడం మొదలుపెట్టారు. ఇది గమనించిన విశ్వామిత్రుడు కత్తి పట్టుకొని యుద్ధరంగంలోకి వెళ్ళి చాలామంది పహ్లావులని సంహరించాడు. ఆ శబళ పహ్లావులతో పాటుయవనులని సృష్టించింది, వాళ్ళందరూ కలిసి విశ్వామిత్రుడి సైన్యాన్ని తుడిచెయ్యడం ప్రారంభించారు. అప్పుడా శబళ వశిష్ఠుడితో........చూశార! ఆయన నాకు ఎదురుతిరిగాడు, ఇప్పుడు ఓటమి అంచులలో ఉన్నాడు అని అన్నది. అయితే నువ్వు ఇక యదేచ్ఛగా సైన్యాన్ని సృష్టించు అని వశిష్ఠుడు అన్నాడు.


అప్పుడా శబళ సూర్యుడి ప్రకాశంతో సమానమైన కాంభోజ వంశీయులని, తన పొదుగు నుండి కొన్ని వేల పహ్లావులని, యోని నుండి యవనులని, గోమయం పడే స్థానం నుంచి శకులు, రోమకుపాల నుండిహారీతులు కిరాతకులని సృష్టించింది. వీరందరూ కలిసి ఆ విశ్వామిత్రుడి సైన్యాన్ని సమూలంగా తుడిచిపెట్టారు. రథం నుండి కిందకి దిగి తన

ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

సైన్యాన్ని చూసిన విశ్వామిత్రుడు నిస్తేజుడయ్యాడు. ఇది కదా శబళ గొప్పతనం అనుకొని తన 100 కుమారుల వైపు చూశాడు. తమ తండ్రిని బాధపెట్టిన వశిష్ఠుడిని చంపెయ్యాలని అందరూ కత్తులు పట్టుకొని ఆయన మీదకి పరుగుతీసారు. కూర్చుని ఉన్న వశిష్ఠుడు తన మీదకి వస్తున్న ఆ నూరుగురు పిల్లల్ని చూసి గట్టిగా 'ఆ......' అని హుంకారం చేశారు, ఆ నూరుగురు పిల్లలు భస్మరాసులై కిందపడిపోయారు. ఇది చూసిన విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు.ఇది కదా బ్రహ్మర్షి యొక్క గొప్పతనం అంటె, ఆయన 'ఆ....' అంటె వందమంది బూడిదైపోయారు, ఆ ఆవు తలుచుకుంటె గొప్ప సైన్యాన్ని, అమోఘమైన భోజనాన్ని సృష్టించింది. రాచరికం కన్నా తపఃశక్తి చాలా గొప్పది, ఈ వశిష్ఠుడిని నాశనం చెయ్యాలంటే నాకున్న శక్తి సరిపోదు. కావున నాకు ధనుర్వేదంలోని సమస్తఅస్త్రశస్త్రాలు తెలియాలి అనుకొని ఒక కుమారుడిని సింహాసనం మీద కూర్చోబెట్టి, రాజ్యపాలన చెయ్యమని చెప్పి తాను తపస్సు చేసుకోడానికి హిమాలయ పర్వతాలకి వెళ్ళాడు.

సేకరణ: నరేందర్ చింతం



భగవన్నామస్మరణతో భవసాగరాన్ని దాటవచ్చు


– పరమహంస గూఢార్థ కథలు

(భక్తురాలైన గొల్లపడుచు– బ్రాహ్మణుడు)

ఒక గొల్లపడుచు ఏటికి అవతలి ఒడ్డున ఉన్న బ్రాహ్మణుడికి వాడుకగా పాలు అమ్ముతూ ఉండేది. నావ రాకపోకలు సరిగా లేకపోవడం వల్ల ఆమె ప్రతిరోజూ సకాలంలో పాలు అందించలేకపోయేది. ఒక రోజు ఆ బ్రాహ్మణుడు చీవాట్లు పెట్టేసరికి, పాపం, ఆ దీనురాలు, బాబూ! నేనేం చెయ్యను? ఇంటి దగ్గర నుండి ఉదయమే బయలుదేరుతాను. కాని ఏటి ఒడ్డున పడవవాడి కోసం ఒకసారి, ఏరు దాటేవాళ్ళందరూ వచ్చి చేరడానికి ఒకసారి, ఇలా వేచి ఉండవలిసి వస్తోంది. అని చెప్పింది.



అప్పుడు ఆ బ్రాహ్మణుడు, వెర్రిదానా! భగవన్నామ స్మరణచేసి సంసారసాగరాన్నే దాటవచ్చు గదా, నీవు ఏటిని దాటి రాలేవా? అన్నాడు. అమాయకురలైన ఆ గొల్లపడుచు ఏరు దాటడానికి ఇంత సులభమైన ఉపాయం ఉందని విని చాలా ఆనందించింది. ఆ మరునాటి నుంచి క్రమం తప్పకుండా తెల్లవారుతూనే బ్రాహ్మణుడికి పాలు అందించడం మొదలు పెట్టింది ఒకరోజు ఆయన నువ్వు ఈ మధ్య చాలా పొద్దున్నే వస్తున్నావు. ఎలా రాగలుగుతున్నావు? అని అడిగాడు ఆమె బాబూ! మీరు చెప్పినట్లుగా దేవుని పేరు తలచుకుంటూ ఏరు దాటి వస్తున్నాను. నాకు నావతో అవసరం తీరిపోయింది! అని సమాధానమిచ్చింది. బ్రాహ్మణుడు ఆ మాటలు నమ్మలేక, నువ్వు ఏరు ఎలా దాటుతున్నావో నాకు చూపిస్తావా? అని అడిగాడు. ఆమె ఓ! చూపిస్తా నాతో రండి! అని బ్రాహ్మణుణ్ణి తనతో ఏటికి తీసుకొనిపోయి భగవన్నామన్ని స్మరిస్తూ, నేలమీద నడచింత తేలికగా నీటిమీద నడచి పోసాగింది. కొంత సేపటికి వెలక్కు తిరిగి చూచింది. ఆ బ్రాహ్మణుడు కూడా నీటి మీద నడుద్దామని ప్రయత్నిస్తూ, ఒకపక్క దేవుని పేరు స్మరిస్తూనే మరొక పక్క తడిసిపోతుందేమోనన్న అనుమానంతో తన పంచెను పైకేత్తి పట్టుకుంటున్నాడు. ఆ బ్రాహ్మణుడి దురవస్థను గమనించి ఆ గొల్లపడుచు, అదేమిటి బాబూ! నోటితో దేవుని పేరు పలుకుతున్నారు. చేతితో బట్ట పట్టుకుంటున్నారు? మీరు పూర్తిగా దేవుణ్ణి నమ్మినట్లు కనపడడం లేదే? అన్నది. సంపూర్ణమైన ఆత్మార్పణ, భగవంతుని యందు స్థిరమైన నమ్మకం– ఇవే అద్భుతమైన కార్యాలన్నింటికీ మూలం.



శతపథ బ్రాహ్మణ్య హృదయ స్పందన

ఆరోగ్య ప్రతిభ



'విలియమ్ హార్వే' (క్రీ.శ 1628) అనే బ్రిటిష్ శాస్త్రవేత్త రక్తప్రసరణ, హృదయం పని చేయటానికి అవసరం అని కనుగొన్నాడు. కాని అతడు హృదయం వద్ద రక్తం ఎట్లు చేరునో నిరూపింపలేకపోయాడు. 1669వ సంవత్సరం 'మార్సిలో మాల్ఫిగి' –రక్తప్రసరణ ప్రక్రియ హృదయానికి చేరుట వివరించాడు.

కానీ, భారతీయ ప్రాచీన శాస్త్రవేత్తల హృదయం గురించిన హృదయ స్పందనలు తెలుసుకుందాం!

శతపథ బ్రాహ్మణ్యంలో హృదయం యొక్క నిర్వచనం ఇలా ఉంది.

హృ అంటే 'హరణే'
ద అంటే 'దానే'

య అంటే ఇణ్‌గతౌ... ఇది హృదయం. అనగా హరణే– గ్రహించటం. దానే ఇవ్వటం; ఇణ్‌గతౌ– ప్రసరణ. (రక్తం) గ్రహించటం, ఇవ్వటం, ప్రసరణచేయు అవయవాన్నే హృదయం అన్నారు.

హృదయమానికి నిరుక్త శాస్త్రం అర్థం ఇలా చెపుతున్నది.

హరతే ర్దదాతేరయతేర్హృదయ శబ్దంః

సుశ్రుత సంహితలో హృద్రోగాల గురించి


1. కఫ పిత్తావ రుద్దస్తు మారుతో రసమూర్చితః।
హృదిస్థః కురుతే శూలముచ్ఛాసారోధకం పరమ్॥
(సు. సం. ఉత్తరాతంత్రమ్)

2. తస్మహత్తా మహామూలాస్తచ్ఛౌజః పరిరక్షతా।
పరిహార్యా విశేషేణ మనసో దుఃఖహేతవః॥
హృద్యం యత్ స్యాద్యదౌజస్యం స్రోతసాం యత్ ప్రసాదనమ్।
తత్తత్ సేవ్యమ్ ప్రయత్నేన ప్రశమో జ్ఞానమేవచ॥
(చరక సంహిత, సూత్రస్థానం 30/13–14)

1. హృద్రోగాలు, కఫ, పిత్త దోషాల వలన ఏర్పడే పదార్థాలు రక్తనాళాలను అడ్డుకొని, సన్నపరచి, రక్తప్రసరణ నియంత్రించబడి, ఛాతినొప్పి, శ్వాస సంబంధ ఇబ్బందులు కలుగుతాయి.

2. ఓజస్సును కాపాడుకుని, హృదయం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి. అంటే మానవుడు మానసిక ఒత్తిడిని కలగించే పరిస్థితులకు దూరంగా ఉండవలెను. ఆహార, ఔషధాల సేవనంలో నియంత్రణ పాటించి, ఓజస్సును పెంచుకుని, రక్తప్రసరణ వ్యవస్థ సక్రమంగా ఉంచుకొనవలెను. దీనికి ప్రశాంతత, జ్ఞానాలను చాలా జాగ్రత్తగా పెంపొందించుకొనవలెను.

ఇలా ఎన్నో హృదయ సంబంధ వ్యాధులు, శస్త్ర చికిత్సల గురించి చర్చించిన భారత ప్రాచీన వైద్య విజ్ఞానం, హృదయ సంబంధ శస్త్ర చికిత్సలు ఖరీదైనవి గనుక కొంత కాలానికి ప్రజలు వాటిని నియంత్రించుకునే మార్గంలో, తమ జీవన శైలిని మార్చుకుని, పొగ తాగటం, మద్యపానం వంటివి వదిలి, ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం అలవరచుకుంటారు అని, ఆనాడే ఆధునిక కాలానికి అవసరమైన ప్రశాంత జీవన విధానాన్ని సూచించింది.



"బాగా జీర్ణమైన ఆహారం నుంచి వచ్చిన సూక్ష్మశక్తిని" రస మంటారు. ఇదే రక్తంగా మారుతుంది. రక్తం హృదయం నుంచి 24ధమనులలోనూ ప్రవేశిస్తుంది. ఇందులో 10 ధమనులు పైకి – 10 ధమనులు కిందకు తక్కిన 4 ధమనులు సమాంతరంగానూ ఉంటాయి. ఈ రసం శరీరం యొక్క పోషణ, ఎదుగుదల, నిర్వహణ వంటి పనులకు చక్కని ఆధారంగా ఉంటుంది. ఈ క్రియలు కర్త ఎవరో తెలియకుండానే జరుగుతాయి. రక్తం హృదయం నుంచి నరముల ద్వారా శరీరమంతా ప్రవహించి తిరిగి హృదయం చేరుతుంది. కనుక నరములు హృదయం నుంచీ జనించినవి అని చెప్పవచ్చు.

(సుశృత సంహిత, సూత్ర స్థానం, 14 అధ్యాయం, 3 పేరా)

అర్జున వృక్షం హృదయ సంబంధ రోగ నివారణలో చక్కగా పని చేస్తుంది అని 'నిఘంటు రత్నాకర వృంధ' అనే గ్రంథంలో ఉంది.

బృందంగా మరింత సాధించు

కృష్ణుడు బృందనాయకుడు. తన లీలలతో అతడు అనేక నిర్వాహణా పద్ధతులను మనకు నేర్పాడు. కృష్ణుడు ఏ పని చేసినా, తన మిత్రులైన గోపాలురులందర్నీ కలుపుకుపోయేవాడు. గోపబాలురు కూడా వేషభాషలలో కృష్ణుడినే అనుకరిస్తూ ఆనందించేవారు. వారందరూ ఎప్పుడూ ఓ బృందంలా ఉంటూ, గోపికల గృహాలలో దూరి పాలు, పెరుగు, వెన్న దొంగిలించేవారు. ఈ బృందం ఎలా ఎత్తువేసి దొంగలిస్తారో, వాటిని ఎలా తింటారో బృందావనంలోని ప్రతి గోపికకూ తెలుసు. అందుకే వారు కృష్ణుడికి అందనంత ఎత్తులో పదార్థాలను దాచేవారు. కృష్ణుడు ఏనాడూ ఇలాంటి ఎత్తుగడలకు భయపడలేదు. అతడు ఎవ్వరూ లేకుండా చూసి, తన బృందంతో గోపికల ఇళ్లల్లో దూరేవాడు. ఎత్తైన చోట ఉండే పదార్థాలను దోచుకోవడానికి తన బృందాన్ని ఉపయోగించేవాడు. ఒకరి మీద ఒకరెక్కి చివరికి ఉట్టి పట్టి, కావలసింది దోచేవారు. గోపబాలురందరూ ఈ విషయంలో కృష్ణుడికి సహకరించేవారు. ఎందుకంటే దొరికింది పంచడంలో కృష్ణుడు ఎప్పుడూ ఉదారంగా, విశ్వసనీయంగా వ్యవహరించేవాడు.

గ్రహించవలసిన లక్షణం : బృందంగా సాధించడం.

–డా॥హరెక్రిష్ణ చంద్రశేకరన్

శ్రీ భగవాన్ ఉవాచ

యతో యతో నిశ్చరతి మనశ్చంలమస్థిరమ్।
తతస్తతో నియమ్యైతదాత్మనేయవ వశం నయేత్॥

తాత్పర్యం:

సహజంగా నిలకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయాలపై పరిభ్రమించును. అట్టి మనస్సును ఆయా విషయాల నుండి మరల్చి, దానిని నియంత్రించాలి.

నీతి:

కేవలం చదువు విషయంలోనే కాదు, ఏ పనికైనా ఏకాగ్రత అవసరం. ఏకాగ్రత లేకుండా చేసే ఏ పని కూడా పరిపూర్ణం కాదు.

ముఖ్యపదం : లాగడం



బాల మకరందం



రక్షణరంగ పరిరక్షణకు.. 23 నుంచి దేశవ్యాప్త సమ్మె

విజయక్రాంతి, హైదరాబాద్: రక్షణరంగ పరిరక్షణ కోసం 23 నుంచి నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతి స్తున్నామని సీఐటీయూ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం సాయి బాబు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిందని ఆరో పించారు. దీంతో రక్షణశాఖ సివిల్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీగా ఏర్పడిన ఏఐడీఈఎఫ్, బీపీఎంఎస్, ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ సంఘాలు ఈ నెల 23 నుంచి 25 వరకూ దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఆయా సంఘాలు ఇచ్చిన సమ్మెకు సీఐటీయూ మద్దతు ఇస్తున్నదని పేర్కొన్నారు.



తెలంగాణ సర్కార్ పథకాలు
దేశానికే ఆదర్శం..

(మొదటిపేజీ తరువాయి) విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా జోన్ల సంఖ్య, రిజర్వేషన్లను పెంచాం. అని గవర్నర్ నరసింహన్ అన్నారు. ప్రభుత్వ పారదర్శకత వల్ల రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఇప్పటికే కొత్తగా 4వేల పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశాం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఐటీ పరిశ్రమలు హైదరాబాద్కు తరలి వచ్చాయి. అన్నిరకాల పింఛన్లను త్వరలోనే రెండింతలు చేస్తున్నాం. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఐకేపీ మహిళలకు అప్పగిస్తాం. బంగారు తెలంగాణ దిశగా ప్రభుత్వం పునరంకితం అవుతుంద"ని గవర్నర్ చెప్పారు.కేజీ టూ పీజీ ఉచిత విద్యలో భాగంగా గురుకులాలు ప్రారంభించాం. వచ్చే విద్యాసంవత్సరంలో మరో 119 గురుకులాలు ఏర్పాటు చేయనున్నాం.నరసింహన్ ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నాం.అనివివరించారు. డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కోసం వచ్చే బడ్జెట్లో నిధులు మరిన్ని పెంచుతున్నాం. ప్రజల చెంతకే వైద్య సేవల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నాం. ఉచిత వైద్య పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలోనే సూర్యాపేటలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం. గవర్నర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం అనంతరం ఉభయసభలు రేపటికి వాయిదా పడ్డాయి.

తొలగించిన బీసీ కులాలను వెంటనే కలపాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య

విజయక్రాంతి, ముషీరాబాద్: రాష్ట్రంలో బీసీ జాబితా నుండి తొలగించిన 26 కులాలు వెంటనే బీసీ జాబితాలో కలపాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్ లో 26 కుల సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట విరుద్ధంగా బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను వెంటనే బీసీ జాబితాలో కలపకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, కోలా జనార్ధన్, దాసు సురేష్, రమేష్, చందర్, మహేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి నియామకంపై మల్లు రవి హర్షం

విజయక్రాంతి, హైదరాబాద్: సీఎల్పీ నేతగా మల్లు భట్టి విక్రమార్కను అధిష్టానం నియమించడం హర్షణీయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం మూడుసార్లు ఎమ్మెల్యేగా అనుభవం ఉన్న భట్టికి ఇలాంటి అవకాశం ఇవ్వడం అధిష్టానం తీసుకున్న మంచి నిర్ణయమన్నారు. దళితులకు మంచి అవకాశాలు ఇచ్చి సామాజిక న్యాయానికి పెద్ద పీట ఇచ్చి సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడంలో కాంగ్రెస్ ముందుంటుందని మరోసారి నిరూపించుకుందన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

విజయక్రాంతి, రాజేంద్రనగర్: శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసుల అనుక్షణం పనిచేస్తున్నారని సైబారాబాద్ పోలీసు కమిషనర్ విసి.సజ్జనార్ తెలిపారు. ఒక్క సీసీ కెమెరా పదిమంది పోలీసులతో సమానమన్నారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మశాలిపురంలో ఆయన స్థానిక పోలీసులతో కలిసి 132 సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఒకప్పుడు సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల అనేక నేరాలు జరిగేవన్నారు. ఇక సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాక నేరాలు తగ్గుముఖం పట్టడంతో పాటు నేరస్తులను సులభంగా పట్టుకొనే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ అశోక్ ప్రసాద్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సత్తయ్య, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల అప్రెంటిస్‌షిప్ బాధ్యత కళాశాలలదే

విజయక్రాంతి, మహబూబాబాద్: ఐటీఐ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకంలో నమోదైన కంపెనీల్లో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ విద్యాసంస్థలతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐటీఐ చేసిన విద్యార్థులు టెక్నికల్ కోర్సు లు చేసి ఖాళీగా ఉంటున్న సందర్భాలను చూస్తున్నామని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వెనుకబడుతున్నామని అన్నారు. జాతీ య అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ లాంటి పథకాలపై సరైన అవేర్‌నెస్ లేకపోవడమే కారణమన్నారు. జిల్లాలో ఒక ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని, వారిలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులలో ఈ సంవత్సరం ఎంత మందిని అప్రెంటిస్ చేశారని ఆయన ప్రశ్నించారు. పని తీరు మార్చుకోవాలని, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులను గుర్తించి, పవర్ పాయింట్ ప్రొగ్రెస్‌తో మరుసటి సమావేశానికి హాజరు కావాలని హెచ్చరించారు. నాప్స్ కల్పించే సదుపాయాలను వినియోగించుకునేలా విద్యార్థుల లో అవేర్‌నెస్ కల్పించాలని, ప్రభుత్వ కళాశాల ఐటీఐ ప్రిన్సిపాల్ నోడల్ అధికారిగా ఉంటూ తనిఖీలు, సమీక్షలు జరుపాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డేవిడ్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధాకృష్ణ, లేబర్ ఆఫీసర్ రమేష్, ఆర్ అండ్ బీ ఇఇ శంకరయ్య, విద్యుత్ శాఖ ఇఇ గుట్ట, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అప్రెంటిస్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

విజయక్రాంతి, మంచిర్యాల: హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని, ఈ నెల 23వ తేదిన కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా విజయవంతం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల శ్రీకాంత్ కోరారు. శనివారం మంచిర్యాల జిల్లా మార్క్స్ భవన్‌లో నిర్వహించన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్స్ రోజు రోజుకు సమస్యల సుడిగుండంలోకి నెట్టబడుతున్నాయని, హాస్టల్‌లో ఉన్నటువంటి విద్యార్థులకు వారి సమస్యలను క్రమంగా ఈ ప్రభుత్వం మరిచిపోతుందన్నారు. గత సంవత్సరం నుండి హాస్టల్ విద్యార్థులకు సమస్యలు చుట్టు ముడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో 869 ఎస్సీ హాస్టల్స్‌లో చదువుతున్న 86 వేలకు పైగా విద్యార్థులకు మూడు నెలల నుండి కాస్మోటిక్ మెస్, చార్జీలు అందడం లేదని అన్నారు. 755 బిసి హాస్టల్స్ విద్యార్థులకు 67 వేల మంది విద్యార్థులకు 2018 ఆగష్టు నుండి దాదాపు 82 కోట్ల రూపాయాల మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదని, 621 ఎస్టీ హాస్టల్స్‌లోని 1 లక్ష 33 వేల మంది విద్యార్థులకు గత సంవత్సరం మార్చి నుండి కటింగ్ చార్జీలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జె.విజయ్, రమ్య, నవీన్, అమీర్, రాకేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకై పనిచేస్తా

- అందరితో కలిసి సాగుతా
- ప్రభుత్వం హామీలు అమలయ్యేలా చూస్తా
- సీఎల్పీ బాధ్యతలు అప్పగించిన రాహుల్‌కు కృతజ్ఞతలు
- మల్లు భట్టి విక్రమార్క



విజయక్రాంతి, హైదరాబాద్ : సీఎల్పీ లీడర్‌గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి మల్లు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సమిష్టిగా తాను ముందుకెళ్తానని చెప్పారు. అసెంబ్లీలో సీఎల్పీ లీడర్‌గా ప్రజల గొంతుకై పని చేస్తానన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా నిర్మాణాత్మకంగా పని చేస్తామన్నారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమి లేదనన్నారు. నిరుద్యోగల గురించి వాస్తవాలు చెప్పి ఉంటే సంతోషించే వాళ్లమన్నారు.

ముస్లీం రిజర్వేషన్లపై స్పష్టత కావాలి: షబ్బీర్ అలీ

శాసనమండలి సభ్యుడు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రచార సభలో కేసీఆర్ స్పీచ్‌ను గవర్నర్ కాపీ కొట్టారన్నారు. రైతు రుణమాఫీ, పింఛన్, డబుల్ బెడ్ రూమ్‌లు ఎప్పుడిస్తారో గవర్నర్ చెప్పి ఉంటే బాగుండేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, రిటైర్‌మెంట్‌పై స్పష్టతలేదన్నారు. ముస్లీం రిజర్వేషన్లపై గవర్నర్ ప్రసంగంలో మైనార్టీగా ప్రస్తావించారని, దీనిపై స్పష్టత కావాలన్నారు.

విద్యుత్ మిగులుపై అబద్ధాలు: శ్రీధర్‌బాబు

మాజీ మంత్రి, కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమి లేదన్నారు. 2014లో రైతులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినవే గవర్నర్ ప్రస్తావించారన్నారు. విద్యుత్ మిగులుపై గవర్నర్ అబద్ధాలు చదివారన్నారు. గత ప్రభుత్వాలు తప్పు చేసినట్టు అనడం సరికాదన్నారు.

రుణమాఫీపై స్పష్టత లేదు: గండ్ర వెంకటరమణారెడ్డి

శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగంలో రుణమాఫీపై స్పష్టత లేదన్నారు. ఏక కాలంలో చేస్తారో లేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధు పథకంలో ఇంకా చాలా మంది రైతులకు డబ్బులు అందలేదన్నారు. దీనిపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శాసనమండలి సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగంలో అర్ధసత్యాలున్నాయని విమర్శించారు. 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలను మరిన్ని రోజులు పొడిగించాలన్నారు. శాసనసభ్యులు కాంతారావు, సీతక్క, ఆత్రం సక్కులు మాట్లాడుతూ, భట్టికి సీఎల్పీ ఇచ్చినందుకు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డినెన్స్ ద్వారానే..
తక్షణం రామాలయ నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి) బీజేపీ ప్రభుత్వానికి ఇప్పటికే హెచ్చరికలు చేశాయి. అయినా మోదీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆర్‌ఎస్ఎస్ తీవ్ర అసంతృప్తితో ఉంది. దీంతో రామాలయ నిర్మాణం కోసం కేంద్రానికి కొత్త గడువును విధించింది. 2025లోపు అయోధ్యలో రామాలయాన్ని నిర్మించాలని సంఘ్ నేత భయ్యాజీ జోషీ శుక్రవారం మరోసారి డిమాండ్ చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు హాజరైన ఆయన ఈ సందర్భంగా ఓ ర్యాలీలో ప్రసంగించారు. 'ఐదేళ్ల పదవీకాలంలో మోదీ ప్రభుత్వం రామాలయం నిర్మిస్తుందని ప్రజలు చాలా ఆశించారు. అయితే ఇంత వరకు అది కార్యరూపం దాల్చలేదు..' అని ఆయన మండిపడ్డారు. ఈ ఏడాది మరోసారి ఎన్నికల్లో గెలిచినా కూడా మోదీ ప్రభుత్వం ఆలయ నిర్మాణం దిశగా చర్యలు చేపట్టకపోవచ్చని ఎద్దేవా చేశారు. రామాలయ నిర్మాణంతోనే దేశ పురోభివృద్ధి సాధ్యమని భయ్యాజీ జోషీ స్పష్టం చేశారు. 2025లోగా అయోధ్యలో రామాలయాన్ని నిర్మిస్తే దేశాభివృద్ధి మరింతగా పుంజుకుంటుంది..' అని ఆయన అభిప్రాయపడ్డారు. రానున్న 150 ఏళ్లలో దేశానికి ఇది అతిపెద్ద సంపద అవుతుందని భయ్యాజీ జోషీ అభిప్రాయపడ్డారు. అయోధ్య అంశాన్ని సుప్రీం కోర్టు త్వరగా తేల్చాలని ఆయన కోరారు. అప్పుడే హిందువుల మనోభావాలు దెబ్బతినవని, వారి ఆశించిన దానికి తగిన న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

31న కుంభమేళాలో వీహెచ్‌పీ ధర్మ సమ్మేళనం

మరోవైపు రామాలయ నిర్మాణంపై కేంద్రం తక్షణ చర్య కోసం అయోధ్యతో పాటు ఇటీవల ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్మ సదస్సు నిర్వహించిన వీహెచ్‌పీ, కుంభమేళా సందర్భంగా ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు ప్రయాగరాజ్‌లో భారీగా ధర్మ సమ్మేళనం నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. దేశ వ్యాప్తంగా నలు మూలల నుంచి వచ్చే సాధువులు ఇందులో పాల్గొంటారని, ఈ సందర్భంగా రామ మందిరంపై ఓ నిర్ణయం తీసుకుంటామని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు విష్ణు సదాశివ్ స్పష్టం చేశారు.

ఆకట్టుకుంటున్న రామ మందిర నమూనా

కాగా కుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌లో ఏర్పాటు చేసిన రామ మందిర నమూనా ఎంతో ఆకట్టుకుంటోంది. ఈ కుంభమేళాకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్న సాధువులు ఈ రామ మందిర నమూనాన్ని ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎంపీ బండారు దత్తాత్రేయ

విజయక్రాంతి, అంబర్‌పేట్: ప్రధాని మోడి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకుపోవాలని సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక, అంబర్‌పేట్, నల్లకుంట బాగ్‌అంబర్‌పేట్ డివిజన్లలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ఉన్నో పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర బీజేపీ మాజీ అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి, నగర బీజేపీ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ కార్పొరేటర్ ఎన్.సాంబశివ గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్కజగన్, సి.కృష్ణగౌడ్, పి.గోవర్ధన్‌రెడ్డి, అచ్చినిరమేష్, జి.మల్లేష్, ఎన్.దత్తు, ఈ.అజయ్‌కుమార్, నీలకంఠరాజు, రంగంపల్లి రాజు, ఈ.అరవింద్, కెంచ చంద్రశేఖర్, జె.బాలరాజు, ఈ.రఘునందన్, డి.వెంకటేష్, పి.కృష్ణగౌడ్, ఎం.మల్లారెడ్డి, కె.శ్రీహరి, సి.సంగయ్య, టి.వెంకటేష్, డి.శాంతమ్మ, ఎస్.సుజాత, పి.సునంద, ఏ.వాణి, వరలక్ష్మీ, సరోజిని, కనకలక్ష్మీ, కట్టమ్మ, సరళ, లలిత, తులసీ, మహేశ్వరి, ఎండి.షరీఫ్, కృష్ణరావు, ఈ.బాలకృష్ణ, ఎం.లక్ష్మీ, రవిందర్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాచిగూడ డివిజన్‌లో నింబోలిఅడ్డలోని బీజేపీ అభివృద్ధి కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఎంపి బండారు దత్తాత్రేయ, బీజేపీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక కార్యకర్త గెలుపే దిశగా పని చేయాలని అన్నారు. గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బి.సంతోష్‌కుమార్, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్, క్షీర్‌సాగర్, అశోక్‌కుమార్, ఎం.నర్సింగ్‌రావు, భీంరాజ్, భల్వీర్, సోమేష్, ఎస్.ఎస్.రాము, మురళి, ఆర్.సంతోష్, నాగరాజ్, అసీఫ్‌అల్లీ, పంకాజ్, దీపక్, ప్రభాకర్, ఎల్.సత్యనారాయణ, రామదేవి, ప్రతీభ, వరలక్ష్మీ, లవణ్య, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- ఆదివాసీ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి హామీ

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్యలు తీసుకుంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు హామీ ఇచ్చారు. శనివారం శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు సీతక్క, ఆత్రం సక్కు తదితరులు ముఖ్యమంత్రిని కలిసి ఆదీవాసీ సమస్యలను వివరించారు. ఫిబ్రవరిలో ఆదివాసీ సమస్యలపై సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని, ఈ సమావేశంలో అన్ని సమస్యలకు పరిష్కారం కనుగొందామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యేలు సీతక్క, ఆత్రంసక్కు తెలియజేశారు. హరితహారం పేరుతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూములను లాక్కుంటున్నారని వారు ముఖ్యమంత్రికి వివరించారు. మేడారం, సమ్మక్క సారక్క జిల్లాలను ఏర్పాటు చేసినందుకు వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



చెరువులు, కుంటల..
పరిరక్షణకు చర్యలేవి?

- ఫాక్స్ సాగర్ ఎఫ్‌టిఎల్‌లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- భౌరంపేట కత్వ చెరువులో అనుమతులు లేని అక్రమ ఫెన్సింగ్

విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లో అధికారులు, ప్రజాప్రతినిధులు రియాల్టర్లకు అమ్ముడు పోయి కోట్లు కూడబెట్టు కుంటున్నారని స్థానికులు ఆరోపించారు. పాలనపై రోతపుట్టించే విధంగా నడుచుకుంటున్న యంత్రాంగం...ఒకటికాదు రెండుకాదు ఒక్క కుత్బుల్లాపూర్ లోనే, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు,అక్రమ వెంచర్లు, అంటూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోనే వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నా, అధికార యంత్రాంగం నిద్రావస్థలో ఉందని విమర్శలు వస్తున్నాయి.

ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ లో అక్రమ నిర్మాణాలు

చెరువులను కాపాడాలని ఓవైపు తెలంగాణ ప్రభుత్వం చెబుతుంటే అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు వాటిని విస్మరిస్తున్నారు. రియల్టర్లకు వత్తాసు పలుకుతున్న ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే అధికారులు పని చేస్తున్నారు. ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ లో భారీగా అక్రమలు కొనసాగుతున్న సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడన్నట్లు వదిలేస్తున్నారు. వేతనాలు తీసుకోవడానికి మాత్రమే అధికారులు తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్నారనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఫాక్స్ సాగర్ చెరువు అంటే తెలియని వారుండరు.1997 సంవత్సరంలో బ్రిటిషు సైనికుల త్రాగునీటి కోసం ఏర్పాటు చేసిన చెరువు అది కానీ కాలక్రమేణ ఈ ఫాక్స్ సాగర్ లక్షల ఎకరాల వ్యవసాయానికి నీరు అందించిన చరిత్ర ఈ చెరువుకుంది. ఇప్పటికైనా అధికారులు నిద్రను వీడి నాయకుల భజనను వీడి ఫాక్స్ సాగర్ చెరువును పరిరక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

భౌరంపేట కత్వ చెరువులో అనుమతి లేని అక్రమ ఫెన్సింగ్‌లు

కుత్బుల్లాపూర్‌లోని శివారు గ్రామ పంచాయితీలు మున్సిపాలిటిగా మారిన సంబందిత అధికారుల అనుమతులు లేకుండానే వ్యవసాయ భూములలో చెరువు పరివాహక ప్రాంతంలో అక్రమ ఫెన్సింగ్‌లు పెట్టి ప్రభుత్వానికి రావలసిన ఖజానాకు గండి కొడుతున్నారు. ఇటు రెవెన్యూ అధికారులు, అటు మున్సిపాలీటి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎంతటి నిర్మాణలైనా చేపట్టడానికి వెనుకడడం లేదు. అయితే ఈ అక్రమ ఫెన్సింగ్ వెనుక ఓ ప్రజా ప్రతినిధి హస్తం ఉన్నట్లు సమాచారం. అధికారులు ఇలా తనిఖీకి వెళ్ళగానే వెంటనే అధికారులకు బెదిరింపులతో ఫోన్‌లు వస్తున్నాయని కొంత మంది అధికారులు మీడియాతోమొరపెట్టుకుంటున్నారు. మా పేర్లు బయట పెట్టవద్దని చాటుగా చెప్పడంపై అధికారులను, ఆ ప్రజా ప్రతినిధి ఏ రెంజ్‌లో భయపెడుతున్నారో అర్ధంఅవుతోంది.

షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష డిమాండ్

- బోడుప్పల్ మున్సిపల్ అధికారులపై భాదితుడి అరోపణ


విజయక్రాంతి, బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ పరిధి చెంగిచెర్లకు వెళ్లే దారిలో రెకుల షెడ్డు నిర్మాణానికి గాను స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు రూ.లక్ష రుపాయాలు డిమాండ్ చేశారని భాదితుడు అరోపించాడు. బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో ఓ వ్యక్తి తన స్వంత భూమిలో తాత్కాలికంగా రేకుల షెడ్డును నిర్మించుకుంటున్నాడు. ఎలాంటి అనుమతులు లేని కారణంగా బోడుప్పల్



మున్సిపల్ టౌన్ ప్లానింగ్ చైన్‌మేన్ వెంకట్ పలుమార్లు నిర్మాణాన్ని నిలిపిశారు. అయితే సదరు నిర్మాణదారుడు టౌన్ ప్లానింగ్ చైన్‌మేన్ వెంకట్ సంప్రదించగా రూ.లక్ష ఇస్తేనే నిర్మాణం కొనసాగుతుందని లేని పక్షంలో నిర్మాణం నిలిపివేయాలని తేల్చి చెప్పినట్లు భాదితుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భాదితుడు తన వద్ద అన్ని డబ్బులు లేవని రూ.20 వేలు ఇచ్చేందుకు తాను సిద్ధం అని తెలపగా.. దానికి ససేమీరా అన్న అధికారులు శనివారం నాడు జేసీబీ సహాయంతో రేకుల షెడ్డును కూల్చివేశారు. దీంతో భాదితుడు శ్రీనివాస్ రెడ్డి బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం చేరుకుని డబ్బులు ఇవ్వకుంటే ఇలా కూల్చివేస్తారా అంటూ అధికారులపై తీవ్రంగా మండి పడ్డాడు. భాదితుడు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రేకుల షెడ్డు నిర్మాణం విషయంలో అతను ఏలాంటి అనుమతులు పొందలేదని దీనిపై అతని నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు చూపాలని కోరామని టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. కావాలనే నిర్మాణదారుడు అధికారులపై, కార్యాలయం సిబ్బందిపై అరోపణలు చేయాడం విడ్డురంగా ఉందని తెలిపారు. అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా ఉండడంతో వారు ఈవిదమైన అరోపణలు చేస్తున్నారని స్పష్టం చేసారు.

మోదీ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి..

(మొదటిపేజీ తరువాయి) సమష్టి నాయకత్వం ప్రస్తుత తరుణంలో దేశానికి అవసరమని అన్నారు. విపక్షాల ఐక్యతను చూసి మోదీ ప్రభుత్వం బెంబేలెత్తుతోందని, కేంద్ర సర్కార్ ఇక రోజులు లెక్కపెట్టుకోవచ్చని మమత గర్జించారు. మమత మాట్లాడుతూ, చారిత్రక అనివార్యత కారణంగా కోల్‌కతాలో తామంతా సమావేశమయ్యా మని అన్నారు. "విపక్ష నేత ఎవరని మీరంటున్నారు. వేదికపై చాలామంది నేతలు ఉన్నారు. మీకు కనిపించడం లేదా? మీ పార్టీలా కాదు...మాకు చాలా మంది నేతలు ఉన్నారు" అంటూ బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కూటమిలో ప్రతి ఒక్కరూ కింగులేనని అన్నారు. మోదీ ప్రభుత్వంలో 'అచ్చేదిన్' ఎండమావే అయిందన్నారు. మంచిరోజులు ఎక్కడొచ్చాయని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్లో బీజేపీ ఆటలు సాగనీయమని స్పష్టం చేశారు. బీజేపీకి విపక్ష నేతలంటే గౌరవం లేదని, బీజేపీ విభజన రాజకీయాలను దేశ ప్రజలు ఏమాత్రం నమ్మరని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న మతతత్వ విధానాలతోనే ఆ పార్టీ ఓటమి చవిచూడక తప్పదని జోస్యం చెప్పారు. చివరిగా 'బీజేపీ హఠావ్' అంటూ మమత నినాదాలు చేస్తూ కార్యకర్తలతో అనిపించారు.'వందేమాతరం' నినాదంతో ప్రసంగాన్ని ముగించారు.



ఫెడరల్ ఫ్రంట్ ఒక శూన్యం, కేసీఆర్, జగన్‌లు బీజేపీ తానుముక్కలే: చంద్రబాబు

కోల్‌కతాలో ర్యాలీకి తెరాస అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, వైస్సార్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఆంధ్ర ప్రతిపక్ష నాయకులు జగన్ హాజరు కాకపోవడం పై టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కోల్కతా ర్యాలీకి 20కి పైగా పార్టీల నేతలు పాల్గొంటే, భాజపాయేతర పక్షాల్లో కేసీఆర్, జగన్ లు హాజరుకాకపోవడంతో వీరిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటే ఉన్నారన్నది సుస్పష్టమవుతోందని అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అసలు లేదని, అదొక శూన్యం మాత్రమేనని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జగన్, కేసీఆర్ తప్ప అందరూ కోల్కతా వచ్చారన్నారు. కోల్కతా వచ్చిన వాళ్లంతా మోదీ వ్యతిరేకులే అని దీంతో కేసీఆర్, జగన్ ఉన్నది మోదీ వెంటే అనేది సుస్పష్టమవుతోందని పేర్కొన్నారు. మోదీకి మద్దతు కోసమే కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారని, అది భాజపాకు ఏమాత్రం ప్రతిపక్షమే కాదని ఆయన విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంపై తెరాస నేతల ద్వేషాన్ని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని, తెరాసతో అంటకాగుతున్న ప్రతిపక్ష నేత జగన్ వైఖరిని ఎండగట్టాలని చంద్రబాబు పార్టీ నాయకులకు సూచించారు.

దేశ ప్రధానిగా మాయావతి లేదా మమత: అఖిలేష్

లోక్‌సభ ఎన్నికల ముందు సమాజ్వాదీ పార్టీ అధినేత, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "దేశ ప్రధానిగా బీఎస్పీ అధినేత్రి మాయావతి లేదా, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అయితే బాగుంటుంది' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశంలో మాయావతి, మమత బెనర్జీ ఇద్దరూ బలమైన నేతలేననీ, మహాకూటమిని నడిపించగల శక్తి వారిలో ఉందని అన్నారు. ప్రధాని అభ్యర్థి ఎవరన్నది సమస్య కాదని, ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యం బీజేపీని ఓడించడమేనని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికే: యశ్వంత్ సిన్హా

'యునైటెడ్ ఇండియా బ్రిగేడ్' ర్యాలీకి హాజరైన ప్రజలను ఉద్దేశించి బీజేపీ మాజీ నేత యశ్వంత్ సిన్హా ప్రసంగిస్తూ.. 'కేవలం నరేంద్ర మోదీని గద్దె దించేందుకు మేమంతా ఒక్కటి కాలేదు. మోదీ సిద్ధాంతాలకు మాత్రమే మేం వ్యతిరేకం. ఎన్డీయే హయాంలో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. ప్రజా సమస్యలపై చర్చించేందుకు, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే మేమంతా ఏకతాటిపైకి వచ్చాం' అని పేర్కొన్నారు.

మోదీ ఐదేళ్లలో దేశాన్ని విడగొట్టారు: కేజ్రీవాల్

భారతదేశాన్ని విడగొట్టాలని పాకిస్తాన్ 70 ఏళ్లుగా ఎదురుచూస్తోంది. కానీ ప్రధాని మోదీ కేవలం ఐదేళ్లలోనే దేశాన్ని విడగొట్టారు. విద్వేషాలను రెచ్చగొట్టి కుల, మత ప్రాతిపదికన ప్రజలను విడదీశారు. మోదీ అమిత్ షాలను తరిమికొట్టేందుకే సమూహంగా ఏర్పడ్డామన్నారు.

బీజేపీది నియంతృత్వ వైఖరి: కుమారస్వామి

"ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ పాలన సాగుతోంది. ప్రజలంటే గౌరవం లేని, ప్రజల ప్రయోజనాలు పట్టని ప్రభుత్వం కేంద్రంలో ఉంది. బీజేపీది నియంత వైఖరి. ఆ పార్టీ కుట్రలతో పేద రైతులు ఎంతగానో నష్టపోతున్నారు. కర్ణాటకలో రైతు రుణమాఫీని విఫలం చేయాలని కుట్ర చేసింది. ఆ పార్టీ కార్పొరేట్లను ఒకలాగ, రైతులను ఒకలాగా చూస్తోంది' అని కుమారస్వామి దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీని ఓడించడమే విపక్షాల ముందున్న ఏకైక లక్ష్యమని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. మోదీకి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని రెండో స్వాతంత్ర్య సంగ్రామంగా ఆయన వర్ణించారు. బీజేపీ నుంచి దేశాన్నీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తి విపక్ష పార్టీలకే ఉందని పేర్కొన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తలపెట్టిన ర్యాలీకి స్టాలిన్ హాజరై మాట్లాడారు. ప్రధాని స్థానంలో ఉన్న మోదీ అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారని స్టాలిన్ మండిపడ్డారు. విపక్ష పార్టీలో తనకెవ్వరూ శత్రువులు లేరని చెప్పే మోదీ.. పొద్దున లేస్తే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని ధర్నా

విజయక్రాంతి, ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ పట్టణంలో గల 15వ వార్డు ద్వారక నగర్‌లో జియో టవర్ నిర్మాణం చేపట్టారు. నవంబర్ నెలలోనే కాలనీవాసులు ఈ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. పనులను అప్పుడు స్థానిక కౌన్సిలర్ విద్యావతి, చైర్పర్సన్ విద్యావతి, టీఆర్ఎస్ నాయకులు తహశీల్దార్ పోలీస్ అధికారులు సందర్శించి పనులను ఆపివేశారు. తాజాగా శనివారం సెల్‌టవర్ పనులు మళ్లీ మొదలుపెట్టడంతో కాలనీవాసులు రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా టీఆర్ఎస్ నాయకుడు జాకిర్ షరీఫ్ చేరుకోని ఆర్డీవో శివకుమార్‌కు సమస్యను వివరించి పనులను అని వేయించారు. ధర్నా కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ విద్యావతి ఆధ్వర్యంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



విజయక్రాంతి, మెహిదీపట్నం: నగరంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు పారిశుధ్య రక్షణలో పూర్తిగా విఫలం అవుతున్నాయి. ఎక్కడ చూసినా దోమలు, ఈగలు బయోమెడికల్ వ్యర్థాలతో పాటు చెత్త చెదారంతో నిండిపరిసరాలన్ని కంపుకొడుతున్నాయి. నగరంలోని నిలోఫర్, సుల్తాన్‌బజార్ ప్రభుత్వ మెటర్నిటి ఆసుపత్రులలో ఔట్ పేషెంట్ వార్డులలో, ఆసుపత్రి లోపలి వార్డులలో ఎటువంటి పరిశుభ్రత పాటించకపోవడంతో రోగులతో పాటు వారి, సహయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన జబ్బులు తగ్గక పోగా కొత్త వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని రోగులు భయపడుతున్నారు. ప్రభుత్వం ఏటా ఆసుపత్రులలో పారిశుధ్య నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికి ఎటువంటి ఫలితం లేకుండా పోతోంది. ఎటు చూసిన గదుల మూలలలో పాన్ మరకలతో, కంపు కొడుతున్న టాయిలెట్ల దుర్గందం వెదజల్లడం ఆసుపత్రుల ఆవరణలో సర్వసాధారణంగా ఉన్న సమస్యలు. దీంతో పాటు చీటికి మాటికీ పారిశుధ్య సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో పేదలు ఆసుపత్రికి రావాలంటేనే భయపడుతున్నారు. నగరంలో దాదాపు అన్ని ఆసుపత్రుల పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్నప్పటికీ ఆసుపత్రులలో పారిశుధ్య నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఏ ప్రభుత్వాసుపత్రి తీరు చూసినా ఇదే రీతిన ఉందని రోగులు వారి బంధువులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సిబ్బంది చేతివాటం అరికట్టాలని అంటున్నారు. ఓ వైపు డబ్బులు లేకనే ప్రభుత్వాసుపత్రికి వస్తే వీరి తీరు బాధాకరమన్నారు.

కార్మిక క్షేత్రంలో..

భూమి బంగారమాయే!

- చుక్కలనంటిన ధరలు
- కనుమరుగవుతున్న వ్యవసాయ భూములు



విజయక్రాంతి, రామగుండం: సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో భూమి బంగారమైంది. ఉన్నట్టుండి నివేశిత భూముల ధరలు చుక్కలనంటాయి. రామగుండంతో పాటు బొగ్గు గనులు విస్తరించి ఉన్న మంచిర్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, భద్రాద్రి కొత్తగూడెం తదితర ఆరు జిల్లాల్లో ఈ భూముల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

జోరందుకున్న రియల్ ఎస్టేట్: ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నిర్వహించబడుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది పెట్టుబడి దారులు ఇక్కడికి వచ్చి ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు, ప్రతి వారం రూ. లక్షల్లో, కోట్లల్లో ఈ వ్యాపారానికి సంబంధించిన లావాదేవీలు చేతులు మారుతున్నాయి. రామగుండం ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన గజం భూమి కూడా లేకపోగా ఈ సర్కారు భూముల్లో ఎక్కువ శాతం అన్యాక్రాంతానికి గురయ్యాయని ఆరోపణలున్నాయి. ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు అపార్టుమెంట్ల నిర్మాణాల వ్యాపారం కూడా జోరందుకుంది. పారిశ్రామిక ప్రాంతంలోని అనేక చోట్ల ఈ అపార్టుమెంట్ల నిర్మాణాలు అనేకం పూర్తి కాగా, మరి కొన్ని నిర్మాణాలు ఇబ్బడి మబ్బడిగా పెరిగిపోతున్నాయి.

వివాదాస్పదంలో నివేశిత స్థలాలు: ఇక ప్రైవేటు భూముల్లో సగానికి పైగా వివాదాస్పదంలో ఉంటున్నాయి. అమ్మిన భూమినే మరొకరికి అమ్మడం కొన్న భూమినే మరొకరు కొనడం ఈ భాగోతాలు ఇక్కడ విరాజిల్లుతున్నాయి. ఈ వివాదాలకు సంబంధించి అనేక కేసులు ఇక్కడి పోలీసు స్టేషన్లలో కుప్పలు తెప్పలుగా ఉండగా... కోల్ బెల్ట్ ప్రాంతాల్లోని న్యాయస్థానాల్లో సివిల్ వివాదాలు ఎక్కువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. కార్మిక క్షేత్రంలో భూములకు పెరిగిన డిమాండ్‌తో చాలా మంది దళారులు సందట్లో సడేమియ్యాల జేబులు నింపుకుంటున్నారు. ఓ మాఫియా వ్యవస్థను ఇక్కడ నిర్మిస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. తుపాకులను, రౌడీయిజాన్ని మాజీ నక్సల్స్‌ను అడ్డుపెట్టుకొని ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు.

దెబ్బతిన్న గ్రామీణ వ్యవస్థ: బొగ్గు గనులు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో గ్రామీణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటున్నదని కొన్ని పక్షాలు ఆరోపణలు గుప్పిస్తుండగా ఓపెన్ కాస్టులు సామాజిక జీవనాన్ని బొందల గడ్డగా మారుస్తున్నదని విమర్శలున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలకులు సైతం ఈ ఓపెన్ కాస్టుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు పచ్చని పైరులతో, పంటలతో విరాజిల్లగా ఈ వ్యవసాయ భూములన్ని కన్పించక పోగా ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడంతో వ్యవసాయ భూములప్నీ కనుమరుగయ్యాయి.

మున్సిపల్ ఆఫీస్‌కు కరెంట్ కట్

విజయక్రాంతి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ నూతన భవనం కోటి 60 లక్షలతో నిర్మించారు. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. బిల్లులు వస్తాయి కదా అని సదరు కాంట్రాక్టరు పనులను పూర్తి చేశారు. అయితే ప్రతిపాదనలు పంపిన 60 లక్షల రూపాయలు ఇంకా రాకపోవడంతో సదరు కాంట్రాక్టరు క్రిష్ణమోహన్ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో చిర్రెత్తుకొచ్చిన కాంట్రాక్టర్ మున్సిపల్ భవనానికి విద్యుత్ సరఫరా నిలివేశాడు. బిల్లులు చెల్లించడంలో కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని విసుగు చెందిన ఆయన కార్యాలయంలోని కరెంటును కట్ చేశారు. దాంతో కార్యాలయం అంధకారంలో ఉండిపోయింది. మున్సిపల్ కార్యాలయంలో కరెంటు ఒక కాంట్రాక్టరు కట్ చేయడం కామారెడ్డిలో చర్చనీయాంశమైంది. విద్యుత్ బిల్లులు చెల్లించక పోతే అధికారులు కరెంటు కట్ చేయడం చూశాం. కాని బిల్లులు చెల్లించని అధికారుల నిర్లక్షాన్ని నిరసిస్తూ ఓ కాంట్రాక్టర్ కరెంటు కట్ చేయడం వింతగా ఉందని చర్చించుకుంటున్నారు. బిల్లుల చెల్లింపు విషయంపై అధికారుల వాదన మరోలా ఉంది. సదరు కాంట్రాక్టరు టెండర్లు నిర్వహించకుండానే పనులు చేపట్టారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం తెలపడంతో సిడిఎంఏకు నివేదిక పంపామని సిడిఎంఏ నుంచి ఆదేశాలు రాగానే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. విద్యుత్ కనెక్షన్ తొలగించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా!



లొంకకేశారం సర్పంచ్ అభ్యర్థి ఎండీ మంజూర్

విజయక్రాంతి, మంథని: తనను సర్పంచ్‌గా గెలిపిస్తే నూతనంగా గ్రామపంచాయతీగా ఏర్పాటైన లొంకకేశారం చిన్న గ్రామాన్ని అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని లొంకకేశారం సర్పంచ్ అభ్యర్థి ఎండీ మంజూర్ అన్నా రు. శనివారం మంథని నియోజకవర్గం రామగిరి మండలంలోని లొంకకేశారం గ్రామంలో మంజూర్ పెద్ద ఎత్తున యువకులు, మహిళలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. సర్పంచ్‌గా తనకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు.

మెయిన్స్‌లో ఆల్ఫోర్స్ సంచలనం

విజయక్రాంతి, కరీంనగర్: ఐఐటీ మెయిన్ జనవరి 2019 ఫలితాల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతమైన విజయం సాధించినట్లు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి. నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం నాడు ప్రకటించిన ఫలితాల్లో ఎండీ ఫరాజ్ హుస్సేన్ 98.94 శాతం, సీహెచ్ అవినాష్ 98.92 శాతం, పి.శ్రావణి 98.37శాతం సాధించినట్లు తెలిపారు. 95 శాతంకు పైగా 35 మంది కాగా 90 శాతంకు పైగా 79 విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పటిష్ఠ ప్రణాళికతో రెండు సంవత్సరాలు అత్యున్నత కోచింగ్ అందించినందుకు అద్భుత ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఎప్రిల్ 2019లో నిర్వహించే ఐఐటీ–జేఈఈ మెయిన్ పరీక్షలో అత్యధిక సంఖ్యలో ఆల్ఫోర్స్ విద్యార్థులు విజయం సాధించనున్నట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన ఆల్ఫోర్స్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులను తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

విజయక్రాంతి, పెద్దపల్లి: గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి జిల్లాలో మొదటి దశలో 102 పంచాయతీల్లో సోమవారం ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని వాటికి సంబంధించి కూడా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

పనులు పూర్తయితే తాగునీరివ్వండి

విజయక్రాంతి, వనపర్తి: మిషన్ భగీరథ కింద అన్ని పనులు పూర్తి అయిన చోట వెంటనే తాగునీరు సరఫరా చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆమే వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని పలు గ్రామాల తండాలను సందర్శించి మిషన్ భగీరథ పనుల పురోగతిని తనిఖీ చేశారు. ముందుగా మండలంలోని ఒంటి గుట్ట తండాలో మిషన్ భగీరథ కింద చేపట్టిన పైపులైన్ పనులను పరిశీలించారు. అంతే కాక, ఇళ్ల ముందు వేసిన మంచి నీటి కుళాయిల ద్వారా నీటీ ప్రవాహన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడు తూ భగీరథ కింత చేపట్టిన ఓహెచ్ ఎస్ ఆర్, ఇంట్రా పైపులైన్ వంటి పనులు పూర్తి అయిన చోట బల్క్ సరఫరా చేసిన చోట తక్షణమే తాగు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

మండలంలోని భగీరథ కింద అప్పటి వరకు 15 గ్రామాల్లో తాగునీటి పూర్తి సరఫరాకు గాను కేవలం మూడు గ్రామాలలో మాత్రమే పూర్తి స్థాయి తాగు పీటి సరఫరా జరగుతుందన్నారు. వచ్చే వారం లోగా వల్లబాపూర్, వల్లబాపూర్ తండా, సంగినేనిపల్లి, గోపల్‌దిన్నే గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూస్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఎస్‌ఈ జగన్‌మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్ సింగ్, మేఘా రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ ఆజాద్, అసిస్టేంట్ ఇంజనీర్ రామాంజనేయులు, ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల పోటీలో ఎవరు?

విజయక్రాంతి, కరీంనగర్: రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బరిలో నిలపనున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పరిధిలోని పట్టభద్రులు అయిన ప్రతీ ఒక్కరూ ఈ నెల 31వ తేదీలోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో అందరి సమస్యలపై గళం వినిపించే నాయకున్ని బరిలో నిలుపుతున్నట్లు తెలిపారు. శాసనమండలిలో ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పట్ల పోరాటం చేసే వారికే అవకాశం కల్పించాలని కోరారు.

గంజాయి ముఠా అరెస్ట్



విజయక్రాంతి, రామగుండం: సంఘ జీవనంలో పలువురిని మత్తుకు బానిసలుగా చేసి ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి రాకెట్‌ను రామగుండం కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు మహారాష్ట్ర సీలేరు నుంచి గుట్టుగా పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తున్న ముఠాలను పట్టుకున్నారు. గతంలో ఈ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న పలువురిని ఈ కమిషనరేట్‌లోని టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలు పట్టుకోగా.. తాజాగా గంజాయి భాగోతాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు నిందితులు పోలీసులకు చిక్కగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. శనివారం కమిషనరేట్ ప్రాంగణంలో పోలీసు కమిషనర్ వి. సత్యనారాయణ మీడియా సమావేశంలో ఈ రాకెట్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని పోలీసు స్టేషన్ పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని ఈ ప్రాంతంలోకి తరలిస్తున్న పెద్దపల్లి చందపల్లికి చెందిన మంద సతీష్, శాంతినగర్‌కు చెందిన సొంపి విజయక్రిష్ణ, ఓల్డ్ కోర్టు ప్రాంతానికి చెందిన అరికిల్ల శ్యాం, రంగంపల్లికి చెందిన గడ్డం రాజును అరెస్టు చేయగా... వీరినుండి 23బ్యాగుల్లో రూ. 11లక్షల విలువైన 51కిలోల గంజాయిని స్వాదీన పర్చుకున్నారు. అలాగే ఇండిక కారును సీజ్ చేశారు. కాగా, గంజాయిని ఈ ప్రాంతంలోకి తరలిస్తున్న మరో ముఠాను పెద్దపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుకోగా బంగారికుంటకు చెందిన షేఖ్ ఆసీఫ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు శాంతినగర్‌కు చెందిన ఇంతియాజ్ పరారీలో ఉన్నాడు. ఆసీఫ్ నుంచి రూ. 1.3లక్షల విలువైన 6.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రహిత ప్రాంతంగా మారుస్తామని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఈ రాకెట్‌ను ఛేధించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు సాగర్, సరిలాల్, సమ్మయ్య, మహేందర్, ఉపేందర్‌లతో పాటు సిబ్బం ది చంద్రశేఖర్, మహేందర్, శ్రీనివాస్, ప్రకాశ్, సదానందం, మల్లేశ్, కళ్యాణ్, సదయ్య, శేఖర్, సంపత్ కుమార్, శ్యాం, భాస్కర్, ఓంకార్, వెంకటేశ్వర్‌లను సిపి అభినందించారు. ఈ మీడియా సమావేశంలో కమిషనరేట్ అధికారులు ఎన్. అశోక్ కుమార్, యం. రవికుమార్, సంజీవ్, రక్షిత కె. మూర్తి, సిఐలు భాగ్యలక్ష్మి, సుందర్ రావు, నరేందర్ పాల్గొన్నారు.



ప్రొటీన్ల లోపంతో అనారోగ్యం

భారతీయులు తరచుగా అనారోగ్యం పాలవడానికి కారణం శరీరానికి అవసరమైన స్థాయిలో ప్రొటీన్లు తీసుకోకపోవడమేనని ఈట్ లాన్సెట్ కమిషన్ తాజా నివేదికలో పేర్కొంది.

భారత్‌లో వేపుళ్లు, బంగాళాదుంపల వినియోగం ఎక్కువగా ఉంటోందని, ఇది ఏమాత్రం దీర్ఘకాల ఆరోగ్యానికి మంచిది కాదని ఈట్ లాన్సెట్ కమిషన్ నివేదికలో హెచ్చరించింది. భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు తగినట్లుగా భారత ప్రజలు ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని స్పష్టం చేసింది. భారత్ సహా ప్రపంచదేశాలన్నీ ఆహారపు అలవాట్లను మార్చుకుంటే ఏటా 1.1కోట్ల ముందస్తు మరణాలను అరికట్టవచ్చని లాన్సెట్ మెడికల్ మ్యాగజైన్‌లో పేర్కొంది. ఈట్ లాన్సెట్ కమిషన్ పరిశోధనలో భాగంగా 16 దేశాలకు చెందిన 37 మంది శాస్త్రవేత్తలు, ఆరోగ్య నిపుణులు కలిసి మూడేళ్ల పాటు ప్రపంచ ఆహార అలవాట్లను అధ్యయనం చేశారు. మాంసాహారం వినియోగాన్ని తగ్గించి శాకాహారాన్ని తినడం వల్ల ఈ భూగోళాన్ని కాపాడుకోగలమని కమిషన్‌కు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ జాన్ రాక్ స్ట్రామ్ తెలిపారు. అదనపు భూమిని వినియోగించుకోకుండా, జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ, నీటి వాడకాన్ని తగ్గించి, కర్బన ఉద్గారాల విడుదలను అరికట్టేవిధంగా ప్రపంచ జనాభా ఆహార అలవాట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ సమతుల ఆహారం తీసుకుంటేనే పర్యావరణం పరిరక్షణ జరుగుతుందని ఆయన వివరించారు. మాంసాహారం, షుగర్ వినియోగాన్ని సగానికి సగం తగ్గించాల్సిందేనని నివేదికలో పేర్కొన్నారు. పండ్లు, గింజలు, కూరగాయలు తినడాన్ని రెట్టింపు చేయాలన్నారు. భారతీయులు బంగాళ దుంపలను ఎక్కువగా తింటున్నారని, వీటి వాడకాన్ని వీలైనంత తగ్గించాలని సూచించింది. భారత్‌లో అవసరానికంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా బంగాళ దుంపలు తింటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని పేర్కొంది. వీటి బదులుగా పప్పులు, గింజలు, పండ్లు మొదలైన శాకాహార ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోవాలి. చేపలు, మాంసం వంటివి ఎంత మితంగా తింటే అంత మంచిదని లాన్సెట్ కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. భారత్‌లో పప్పులు, కూరగాయలు, పండ్ల సాగు, వినియోగం విస్తృతంగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

సౌదీ–చైనా–పాక్ మైత్రితో కొత్త సవాళ్లు

సౌదీ అరేబియా పాకిస్తాన్‌లోని గ్వాదర్ నౌకా రేవులో పది బిలియన్ల డాలర్ల వ్యయంతో ఆయిల్ రిఫైనరీని ఏర్పాటు చేయబోతున్నట్టు వస్తున్న వార్తలు భారత్ దృష్ట్యా ఆందోళనకరమైనవి. ఎందుకంటే ఇప్పటి వరకూ పాకిస్తాన్, చైనా సహకారంతో నిర్మాణమౌతున్న చైనా– పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌లో ఇప్పుడు సౌదీ అరేబియా కూడా భాగస్వామి అవుతుంది. రానున్న ఫిబ్రవరిలో సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పాకిస్తాన్ పర్యటన సందర్భంగా ఈ మేరకు ఒప్పందపత్రంపై సంతకాలు జరుగుతాయి. ఈ విధంగా సౌదీ, పాకిస్తాన్, చైనాలు భారత్ పై భద్రతాపరమైన పడగ విప్పినట్టయింది.

ఇది ఒక కొత్త పరిణామం. ఇప్పటి వరకూ పాక్–చైనా కూటమి నుంచే మనకు ప్రమాదం ఉండేది. ఇప్పుడు ఈ కూటమికి సౌదీ తోడైంది. ప్రపంచవ్యాప్తంగా సలాఫీ ఇస్లామ్ ప్రచారం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతున్న సౌదీ అరేబియా చేరికతో కొత్త సవాళ్లు ఎదురవడం ఖాయం. ఇప్పటికే చైనా సీ పెక్ పేరిట సుప్రసిద్ధమైన ఆర్థిక కారిడార్‌లో దాదాపు 60 బిలియన్ల డాలర్లను పెట్టుబడిగా పెట్టింది. దీని వలన పాకిస్తాన్‌లో రోడ్లు, రహదార్లు, రేవులు, వాణిజ్య కేంద్రాలు, మౌలిక వసతులతో పాటు రక్షణ పరమైన, వ్యూహాత్మకమైన కూటమి కూడా ఏర్పాటయ్యే ప్రమాదం ఉంది. ఈ కూటమి లక్ష్యం బారతదేశమేనన్నది పసివాడికి కూడా అర్థమౌతుంది. నిజానికి చైనా ఆర్థిక సామ్రాజ్య విస్తరణలో సౌదీ అరేబియా కూడా తోడురావడం, అదీ పాకిస్తాన్ వేదికగా జరగడం చాలా కీలకమైన అంశం. అమెరికాతో క్లిష్టమైన ఆర్థిక యుద్ధంలో ఉన్న చైనాకు అమెరికాకు ఇన్నాళ్లుగా ఆప్త మిత్రులుగా ఉన్న సౌదీ తోడుగా నిలవడం గమనార్హం. అంతే కాక మలేషియా, శ్రీలంక సహా పలు దేశాలు చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తున్న తరుణంలో సౌదీ ఒప్పందం చైనాకు కాసింత ప్రతిష్ఠనిస్తుంది. మలేషియా, చైనా ఆర్థిక విస్తరణ వాదానికి వ్యతిరేకంగా గళం విప్పి పలు ఒప్పందాలను రద్దు చేసుకుంది. శ్రీలంకలోనూ హంబన్ టోటా రేవును చైనా లీజుకు తీసుకున్న నేపథ్యంలో అక్కడి ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఈ నేపథ్యంలో సౌదీ కలిసి రావడం చైనాకు సానుకూల పరిణామం.

ఇక సౌదీ, పాకిస్తాన్‌కు అత్యంత ఆప్త మిత్ర దేశాల్లో ప్రధానమైనది. అమెరికా, సౌదీలు ఇన్నాళ్లూ పాకిస్తాన్‌కు పడగ పట్టి కాపాడుతున్నాయి. అమెరికాకు పాకిస్తాన్ క్రమేపీ దూరమౌతున్న సమయంలో సౌదీ, పాకిస్తాన్, చైనా కూటమి ఏర్పాటు కావడం వ్యూహాత్మకంగా చాలా ప్రముఖమైన పరిణామం. మన దేశం ఇప్పటికే సీ పెక్ విషయంలో పలు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. చైనా తెరముందుకు తెస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌లో అంతర్భాగమైన సీపెక్ మన జమ్మూకశ్మీర్‌లోని అంతర్భాగమైన గిల్గిత్ బల్తిస్తాన్ గుండా వెళ్తోంది. ప్రస్తుతం పాక్ అక్రమ కబ్జాలో ఉన్న ఈ భూమిని అంతర్జాతీయ రహదారిలో అంతర్భాగం చేయడాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది. దీనికి ఇప్పుడు సౌదీ కూడా తోడు కావడం ఆందోళనకరమైన విషయం. సౌదీ అరేబియా సీ పెక్ లోని గ్వాదర్ రేవు వద్దనే రిఫైనరీని నిర్మించాలని తలపెడుతోంది.

నిజానికి అమెరికా చేస్తున్న పొరబాట్ల వల్లే సౌదీ అరేబియా, చైనా వైపు మళ్లుతోందని చెప్పాలి. గతేడాది ట్రంప్ చేసిన ఒక అత్యంత నిర్లక్ష్యపూరిత వ్యాఖ్య వల్లే ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తమ మద్దతు లేకపోతే సౌదీ రాజకుటుంబం రెండు వారాలు కూడా బ్రతకలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో సౌదీ జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గీ ఇస్తాంబుల్‌లోని సౌదీ దౌత్య కార్యాలయంలో హత్యకు గురి కావడం కూడా ఇరు దేశాల మధ్య వైమనస్యానికి నారు, నీరు పోశాయి. ఆ తరువాత అమెరికన్ సెనేట్ యెమెన్ ప్రభుత్వానికి చేస్తున్న సాయాన్ని నిలిపివేయాలని తీర్మానం చేసింది. ఈ మూడు సంఘటనల తరువాత నుంచే సౌదీ అరేబియా కొత్త మిత్రులను అన్వేషించడం ప్రారంభించింది. దీనిని చైనా, పాకిస్తాన్లు పూర్తిగా ఉపయోగించుకున్నాయి. తొలుత సీ పెక్ లో సౌదీ ప్రవేశాన్ని వ్యతిరేకించిన చైనా ఉన్నట్టుండి తన వైఖరిని మార్చుకోవడమే కాక, సౌదీ పాలకులకు ఎర్ర తివాచీ పరిచింది.

అమెరికా తప్పిదం, చైనా ఎత్తుగడలు, పాక్ ప్రయత్నాల ఫలితంగా ఈ కొత్త కూటమి వల్ల భారత్ కు ఎన్నో సమస్యలు తలెత్తనున్నాయి. భారత, సౌదీ సంబంధాలలో చికాకులు పెరుగుతాయి. ముఖ్యంగా గల్ఫ్‌లో ఈ రోజు ఇరాన్, సౌదీల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరాటం ప్రభావం కూడా మనపై ఇప్పటికే ఉంది. దానికి తోడు సౌదీ,పాకిస్తాన్, చైనా మైత్రి వల్ల కొత్త దౌత్య సవాళ్లు భారత్‌కు ఎదురవుతాయి. చమురు ధరలు, వాణిజ్య లావాదేవీలు ప్రభావితం అవుతాయి. అదే విధంగా చైనా ఒత్తిడులు కూడా పెరుగుతాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి ఉన్న పాకిస్తాన్‌కు ఈ రెండు దేశాలు ఆక్సిజన్‌ను అందిస్తాయి. వీటి ఫలితంగా పాకిస్తాన్ మళ్ళీ భారత్‌కు ఉగ్రవాదాన్ని వేగంగా ఎగుమతి చేసే అవకాశాలున్నాయి. అఫ్గనిస్తాన్ నుంచి అమెరికా వైదొలగుతున్న నేపథ్యంలో అక్కడి తాలిబానీ, జెహాదీ ఉగ్రవాద శక్తులు కూడా కశ్మీర్‌పై దృష్టి సారించే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు, దీటుగా తిప్పికొట్టేందుకు భారత్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమయం ఎవరి కోసం ఎదురు చూడని బాణం



3- సమయోచితం

అనుకూలత, చురుకుతనం నీ సంకల్ప, ఆచరణ, సమాప్తులకు సమయోచితంగా ఫలితాలను సాధించడానికి ప్రయోజనకరం అవుతాయి. సమయోచితంగా ఉండు. ఏ సన్నివేశానికైనా, పాఠానికైనా, ఉత్సవానికైనా, నిర్దేశపు కలయికకైనా ఆలస్యం చేయకు. కాలానుగుణంగా ఉండు. కాలానుగుణ విషయాలను సేకరించి, కాలానుగుణంగా ఉండు.

గుర్తుందా! సమయానికి వేసే కుట్టు ఎన్నిటినో కాపాడుతుంది. సమయోచితంగా చేసే ప్రయత్నం వ్యక్తుల, విషయాల మధ్య అడ్డుగోడలను తొలగిస్తుంది. సంబంధాలు తెగిపోయే సమయంలో సమయోచితంగా చేసే ప్రయత్నం 'కేవలం' కలపడమే కాదు, వ్యక్తులను ఏకం చేస్తుంది. సమయం గొప్పసంపద. ధనం కోల్పోతే గట్టి ప్రయత్నంతో, కృషితో తిరిగి సంపాదించుకోవచ్చు. సమయం కోల్పోతే ఎప్పటికీ కోల్పోవడమే. సమయం ఎవరికోసం ఎదురుచూడని బాణం వంటిది. నీదైన వీక్షణంతో సమయంలో ఉండు, సమయానికంటే ముందే ఉండు. సమయాన్ని ఖర్చు చేయకు, సమయమే పెట్టుబడి, సమయం విలువను, ప్రయోజకత్వాన్ని సంతరించుకోకపోతే కేవలం గడచిపోవడమో, వ్యర్థమో అవుతుంది. ప్రతిక్షణాన్ని ప్రయోజనకరంగా మలుచుకోగలిగితే విలువతోకూడిన పెట్టుబడి అవుతుంది. పూర్వసంకల్పాలు, ఊహలు మరింత సమయాన్ని ఇస్తాయి. దక్షతతో వ్యవహరించి సమయాన్ని ఆదా చేయి. సమర్థతతో పనిచేస్తూ ఆ సమయాన్ని అనుభవించు. అర్థంలేని ప్రయోగాలు మానుకొని సమయాన్ని కూడదీసుకో. సమన్వయం సమయానికి సారం. సమన్వయించు, సమయోచితంగా ఉండు. పనిని సంక్షేపించు, సమయాన్ని రూపొందించు. నిర్దిష్టపద్ధతి, నిర్దిష్టసమయం అంటే సమయానికి విలువను అందించటమే, సమయం నుంచీ విలువను సృష్టించడమే. పనిని సమీక్షించు, సమయానికి పూర్తిచేయి, కానీ పనిని విభజించి అధికసమయం సాగదీయకు. అధిక సమయం పనిచేయడం అసమర్థతను తెలియచేస్తుంది.

అందరికంటే ముందు ఉండటానికి ప్రతిక్షణాన్ని కాపాడు. ఎప్పుడూ సమయంలేదని చెప్పకు. నువ్వు ఉన్నావు అంటే సమయం ఉన్నట్టే. సమయం గడుస్తూ ఉంది, సమయాన్ని గమనించు, ప్రతిక్షణాన్నీ అనుభవిస్తూ జీవితంలో ప్రచోదన పొందు. ఇదే సరైన సమయం. దేనినీ వాయిదా వేయకు. భూత, భవిష్యత్కాలాలకు పరుగులు తీయకు, వర్తమానంలో ఉంటూ, భూతకాలంనుంచీ నేర్చుకొని, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండు. జ్ఞానంతో, సమాచారంతో, స్ఫురణతో త్రికాలదర్శివికా! (భూత భవిష్యద్వర్తమానాలు తెలిసిన వ్యక్తి). భూతకాలం జ్ఞానం, వర్తమానం సమాచారం, భవిష్యత్తు స్ఫురణ. భూతభవిష్యద్వర్తమానాల అనుభవగ్రాహ్యంతో త్రికాలదర్శిత్వాన్ని కూడా నెట్టుకుంటూ కాలగమనానుకూలమైన శాశ్వత పరిష్కారాలను వెతుక్కో! సమయానికి ముందుగానూ, సమయానికీ, సమయంతో ఉంటూ, వినియోగిస్తూ, అనుభవిస్తూ సమయ ప్రశస్తతను అనుభూతిలోనికి తెచ్చుకో. అప్పుడే సమయ నిర్వహణ పద్ధతులలో అగ్రగణ్యురాలివి అవుతావు.

ప్రియమైన సుప్! యథార్థ సమయ, జ్ఞాన సంబంధసమయాల తారతమ్యతను తెలుసుకో! యథార్థసమయం గడియార సంబంధమైతే, జ్ఞానసంబంధ సమయం నీ అనుభూతిసమయం. ఒకే కాలపరిమితి గల సమయం కొందరికి సుదీర్ఘంగా, సహించలేనిదిగా ఉంటే, అదే సమయం మరికొందరికి సూక్ష్మంగా ఆహ్లాదంగా ఉంటుంది. ఆనందసమయాలు పరిగెత్తేవైతే, దుఃఖసమయాలు పాకేవి.

గుర్తుంచుకో! సమయం ఒక దొంగ. నీవు నిర్లక్ష్యంగా ఉంటే నీ అవకాశాలను దోచుకుంటుంది. నిజానికి కాలం తన గమనంలో విషయాలను, వ్యక్తులను, అవకాశాలను కలుపుకుపోతూ ఉంటుంది. ముందుచూపుతో సమయానికి ముందుగా ఉండు. తత్పూర్వ, తత్సమయ, తదంతస్సమయ, తదనంతర, తత్పూర్ణ సమయాలలో సమగ్రమైన ఆచరణలతో, చురుకుతనంతో కాలాన్ని జయించు. అనుకూలంగా, చురుకుగా, సమయోచితంగా ఉంటూ నీ జీవితంలో ప్రతిక్షణాన్నీ అనుభవిస్తూ ఆనందంగా ఉండు. అన్ని సమయాలలో ఉంటూ నీ జీవితంలో ప్రతిక్షణాన్నీ అనుభవిస్తూ ఆనందంగా ఉండు. అన్ని సమయాలలో నిన్నెప్పుడూ మా ఆలోచనలోనే ఉంచుకుంటాం, అన్ని సమయాలలో నిన్నెప్పుడూ స్వాగతిస్తూనే ఉంటాం.

తత్పూర్వ సమయం: కార్యాచరణ సమయానికి ముందు
తత్సమయం: కార్యాచరణ సమయమునందు
తదంతస్సమయ: కార్యాచరణ సమయమంతయును
తదనంతర సమయం: కార్యాచరణ సమాప్తి సమయము
తత్పూర్ణ సమయం: కార్య పరిసమాప్తి పిమ్మట

పూర్వగ్రహణంతో సమయోచితంగా ఉండు.

సమయోచితంగా ఉండటానికి సమయోచితమార్గాలు

1. సందర్భాలను కాలపట్టికగా రూపొందించి కాలానుగుణంగా ప్రవర్తించు.
2. ప్రతిరోజూ సమయం జాబితాలను తయారుచేయి.
3. దూరశ్రవణంలో అధిక సమయం మాట్లాడకు, అవసరమైనదానికంటే ఎక్కువ మాట్లాడకు.
4. సమయాన్ని అధికంగా కానీ, అల్పంగా కానీ వినియోగించకు. నిర్దిష్ట సమయావగాహన కలిగి ఉండు.
5. సమయపాలన, సమయ వినియోగం రెండూ ముఖ్యమే.
6. వృత్తికి, కుటుంబానికి, పాఠానికి, విద్యార్థులకు, పిల్లలకు, సెలవులకు, ఆహ్లాదకత్వానికి, విశ్రాంతికి, నీ అధ్యయనానికి నిర్దిష్టకాలపరిమితిని వినియోగించు.
7. నీ ఆత్మ పరిశీలనకీ, ఉత్తేజానికీ కాలాన్ని వినియోగించు.
8. ఇతరుల సమయాన్ని గౌరవించు.
9. దుఃఖసమయాలలో ఓర్పుతోనూ, సంతోషసమయాలలో అత్యుత్సాహంతోనూ కాకుండా సమయాన్ని గౌరవించు.
10. అనుకూలంగా, చురుకుగా, సమయోచితంగా వ్యవహరిస్తూ దుఃఖ సమయాలను కూడా సంతోష సమయాలుగా మలుచుకో!



గట్టు నారాయణ

మిగులు నిధులు నిర్ధారణ కాకుండా అడ్డంకులు

(నిన్నటి పేజీ తరువాయి)

అయితే, అదే రోజు, బ్రహ్మానందరెడ్డి బెంగుళూరుకు బయలు దేరగనే తెలంగాణ ప్రాంతంలో ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో హింసాయుత ఉద్యమం తారాస్థాయికి చేరుకొనడం జరిగింది. జులై 19వ తేదీన ముఖ్యమంత్రి తన మంత్రివర్గాన్ని పునర్మించారు. తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులని తను భావించిన జలగం వెంగళరావు, వి. పురుషోత్తమరెడ్డి, రాజనరసింహలను తెలంగాణ ప్రాంతం నుండి బ్రహ్మానందరెడ్డి తన మంత్రివర్గంలో నియమించారు. వెంగళరావుకు ముఖ్యమైన హోంశాఖ కేటాయించి తన తడాకా చూపించమని కోరారు. బ్రహ్మానందరెడ్డికి నమ్మినబంటుగా ఉంటూ తెలంగాణకు ఎంతటి ద్రోహం చేయడానికైనా సిద్ధంగా ఉన్న మాజీ ప్రత్యేక రాష్ట్రవాది శ్రీ జె.వి. నరసింగరావుకు ఉప ముఖ్యమంత్రి పదవి దొరికింది. అసలు సమస్య మాత్రం యధాతథంగా అపరిష్కృతంగా ఎక్కడ ఉన్నది అక్కడే ఉన్నది.

మంత్రుల, శాసనసభ్యులకు మురిగిన గుడ్లు, టమాటాలతో సత్కారం

తిరిగి ఆగస్టు 14న శాసనసభల వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాడు అసెంబ్లీ భవనాలు జై తెలంగాణ నినాదాలతో దద్దరిల్లిపోయినాయి. ఉభయ శాసనసభల సంయుక్త సమావేశాలను ప్రారంభిస్తూ ప్రసంగించవలసియున్న రాష్ట్ర గవర్నర్ తన ప్రసంగాన్ని చంకన పెట్టుకొని వెనుకదారిన పలాయనం చిత్తగించవలసి వచ్చింది. రాష్ట్ర గవర్నర్‌గా ఉంటున్న బాధ్యతగల వ్యక్తి కేంద్ర పాలకులకు ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులను, ప్రజాభీష్టాన్ని నివేదించనందుకు నిరసనగా ఈ ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు ఆగ్రహావేశులైనారు. అంతకు ముందురోజే శ్రీ పాల్వాయి గోవర్ధన రెడ్డి, జి.వి. సుధాకర్, శ్రీమతి ఈశ్వరీ బాయిని ముందు జాగ్రత్త చర్యగా అరెస్టు చేశారు. అందువల్ల గవర్నర్ సభలోకి రాగానే, ఆయన తన ప్రసంగం ప్రారంభించడానికి ముందే ఈ సభ్యులంతా తమ తమ స్థానాలలో లేచి నిల్చొని, 'జై తెలంగాణ' నినాదాలు చేసి గవర్నర్ ప్రసంగం కొనసాగించకుండా నిరోధించారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీ రాజమల్లు, ప్రజా సమితి ప్రముఖ నాయకులలో ఒకరైన శ్రీ ఐరేని లింగయ్య తెలంగాణాలోని వాస్తవ పరిస్థితిని వివరిస్తూ, గవర్నర్ వైఖరిని ఖండిస్తూ సమాంతరంగా తమ ప్రసంగాలు కొనసాగించారు. తరువాత, కాంగ్రెస్ శాసన సభా పార్టీ సమావేశాలు జరుగుతుండగా అనేక మంది సాహసోపేతులైన విద్యార్థినులు ప్రాణాలకు తెగించి, చుట్టూ దట్టంగా కాపలా ఉన్న సాయుధ పోలీసుల కండ్లు గప్పి అసెంబ్లీ ఆవరణలో ప్రవేశించి అనేక మంది మంత్రుల ముఖాలపై కోడిగుడ్లు, మురిగిపోయిన టమాటోలు విసిరారు.

చుట్టూ ఉన్న సాయుధపోలీసుల కాపలాను ఛేదించుకొని వీర అభిమన్యుడివలె ముందుకు పురోగమించిన యువకుడెవరో ఒకరు ఆనాడు పోలీసు కంట్రోలు రూమ్‌పై ఒక బాంబును విసిరాడు. భయంకరమైన శబ్దంతో అది ప్రేలింది. ఈ శబ్దం విని భయకంపితుడై పరిగెత్తుతున్న వైద్య కళాశాల విద్యార్థి శ్రీ నరసింహను పోలీసులు వెంటాడారు. నాలుగువైపుల నుండి వెనుక పోలీసు జీపులు ముందు అతను సైకిల్ జారి క్రిందపడడం, పోలీసులు తల పగలకొట్టడం ఒకేసారి జరిగాయి. అపస్మారకస్థితిలో ఆస్పత్రిలో చేర్చి అతడే బాంబు విసిరాడని కేసు పెట్టారు. స్థానిక న్యాయమూర్తి ఒకరు జామీనుపై విడుదలకు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పోలీసులు శ్రీ నరసింహను తమ కస్టడీలో ఉంచుకొనేందుకు మరొక బాంబు కేసు బనాయించారు. వారంరోజులు పోలీసు కస్టడీ, ఒకరోజు జ్యుడీషియల్ కస్టడీ అనంతరం అతడు బెయిల్‌పై విడుదలైనాడు.

శాసనసభ వర్షాకాలం సమావేశాలు సుమారు 40 రోజులు కొనసాగినా, శాసనసభలో తాను నిర్వహించే పాత్రను తిలకించేందుకు తమ ఓటరుకు కానీ మరొక అతిథికి కానీ అవకాశం కల్పించేందుకు సభ్యులకు ఉన్న హక్కులకు సభాధ్యక్షుడు సమాధికట్టాడు. సభలను తిలకించేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. ప్రేక్షకుల గ్యాలరీల తాళం తీయలేదు. ఆ 40 రోజులు 'పబ్లిక్ గార్డెన్స్'కు కూడ ఎవరినీ వెళ్ళనీయలేదు.

ఆగస్టు మాసంలోనే తెలంగాణ ప్రజావాణిని లోక్‌సభలో వినిపించేందుకు డాక్టర్ జి.యస్. మేల్కోటే, శ్రీమతి సంగం లక్ష్మిబాయి, జి. వెంకటస్వామి, యం. నారాయణరెడ్డి తదితరులకు అవకాశం దొరికినా, శాసనసభలు ప్రారంభమైన నెలరోజుల వరకు శాసనసభ్యులకు మాత్రం అలాంటి అవకాశం దొరకకుండా ఆంధ్ర పాలకులు అడ్డుపడగలిగారు. సభాపతి శ్రీ బి.వి. సుబ్బారెడ్డి తమకు అండగా ఉండి పక్షపాత ధోరణితో వ్యవహరించడం వల్ల ఎప్పటికప్పుడు ఏదో కుంటిసాకు చూపుతూ ఆగస్టు 14 నుండి సెప్టెంబర్ 23వ తేదీ వరకు తెలంగాణ సమస్యపై శాసన సభలో చర్చ జరుగకుండా పాలకవర్గం నిరోధించగలిగింది. ఆ తర్వాత కూడా నాలుగు రోజులు శాసనసభ ఈ విషయంపై చర్చ జరిపినా వివిధ పార్టీలకు చెందిన కొందరు ఆంధ్ర ప్రాంతం శాసనసభ్యుల అవాస్తవిక అసహాయ వైఖరివల్ల, కొందరు తెలంగాణ సభ్యుల నమ్మక ద్రోహవిధానం వల్ల తెలంగాణ సమస్యకుగానీ, ప్రజలకు గానీ ఏ న్యాయం జరుగలేదు.

భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పురస్కరించుకొని శ్రీ కుమార్ లలిత్ అనునొక ఆడిటర్ జనరల్‌ను తెలంగాణ మిగులు నిధులు నిర్ధారించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. అఖిలపక్ష ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం తన ఆదేశాలు ఇచ్చింది. మిగులు నిధులను నిర్ధారించడానికి వచ్చిన ఈ అధికారిని ఇక్కడకు పంపించారు. మిగులు నిధులను నిర్ధారించడానికి వచ్చిన ఈ అధికారికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలోని ఆంధ్ర అధికారులు తగిన సమాచారాన్ని ఇవ్వలేదు. ఈ అధికారుల కుత్సితపు మనస్తత్వాన్ని వారి సహాయ నిరాకరణను గురించి శ్రీ లలిత్ కూడా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయకపోవడంతో అతను స్థానిక ఎకౌంటెంట్ జనరల్ వద్ద దొరికిన సమాచారంతోనే తన కార్యక్రమాన్ని పూర్తిచేసారు. కానీ, రాష్ట్ర పాలకులకు నిజాయితీ లేకపోవడం వలన తమ మాట నిలుపుకొనే అలవాటు వారికి లేనందున, అతని నివేదికను కూడ ఆంధ్ర అధికారులు వివాదం చేసారు.

విద్యుచ్ఛక్తి, నీటి పారుదల తదితర ప్రాజెక్టులపై 1956–69 సంవత్సరాలలో వెచ్చించిన ధనాన్ని ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల మధ్య కేటాయింపుకు శ్రీకుమార్ లలిత్ పాటించడానికి ప్రభుత్వం ఇచ్చిన సూత్రాలను ప్రాంతీయ సంఘం సవాల్ చేసింది. ఉదాహరణకు ప్రభుత్వం సమకూర్చిన సూత్రం ప్రకారం నాగార్జునసాగర్ ఆనకట్టకు పెట్టిన ఖర్చులో మూడవ వంతు తెలంగాణకు, కుడి కాల్వపై మొత్తం ఖర్చును ఆంధ్ర ప్రాంతానికి ఎడమ కాలువపై మొత్తం ఖర్చును తెలంగాణకు శ్రీ లలిత్ జమకట్టారు.

ఈ పద్ధతి అన్యాయమని ప్రాంతీయ సంఘం వాదన. ఆనకట్టపై పెట్టిన ఖర్చులో మూడింట ఒక వంతు తెలంగాణకు, రెండు వంతులు ఆంధ్రకు ప్రత్యేకించడంలో ప్రాంతీయ సంఘానికి అభ్యంతరం లేదు. కానీ ఎడమ కాలువ వలన నల్లగొండ, ఖమ్మం జిల్లాలలోనే కాక, ఆంధ్ర ప్రాంతానికి చెందిన కృష్ణా, గోదావరి జిల్లాలలో కూడ సేద్యానికి నీరు సమకూరనున్నందున, నీటి వినియోగం లెక్కలోనికి తీసుకొని ఆదామాఫీలో రెండు ప్రాంతాలపై ఖర్చులు కేటాయించాలని ప్రాంతీయ సంఘం వాదన.

(సశేషం)

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

కిరోసిన్ అందక పరేషాన్



పేదలకు కిరోసిన్ కోటా అందక ఇబ్బందులు పడుతున్నారు. చౌకధరల దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేదిశగా ప్రభుత్వం తొలుత బియ్యానికి ఈ–పాస్ విధానం అమలు చేసింది. ఈ నెల నుంచి కిరోసిన్ పంపిణీకి ఆ విధానం వర్తింపజేశారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీవరకు ఈ–పాస్ యంత్రంపై వేలిముద్ర పెడితేనే కార్డుదారులు బియ్యం అందుకుంటారు. కిరోసిన్ పంపిణీ ఆలస్యం కావడంతో కొంతమంది కార్డుదారులకు మాత్రమే డీలర్లు బియ్యంతో పాటు కిరోసిన్‌ను పంపిణీ చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రచార లోపం, కిరోసిన్ కోటా పంపిణీలో ఆలస్యం కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో లక్షల కుటుంబాలకు కిరోసిన్ అందలేదు. కిరోసిన్ ఉన్నా వేలిముద్ర తీసుకునే ఈ–పాస్ యంత్రం పనిచేయకపోవడంతో మిగిలిన కార్డుదారులకు పంచలేక పోయారు. కిరోసిన్ కోసం బాధితులు డీలర్లను ప్రశ్నించగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయితే స్థానికంగా వారూ ఏమి చేయలేరు. రాష్ట్రస్థాయిలో సర్వర్‌ను తిరిగి ఆన్ చేస్తే కార్డుదారుల నుంచి వేలిముద్రలు తీసుకునే అవకాశముంటుంది. లేదంటే వచ్చిన కిరోసిన్‌ను ఈ నెల కోటాకు బదులు మిగులు కోటా కింద వచ్చే నెలలో పంపిణీ చేయాలి. ప్రజలు కిరోసిన్ కోసం నిత్యం చౌకధరల దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని కిరోసిన్ పంపిణీ చేయించాలి.

–రామలక్ష్మి, ఆదిలాబాద్

అభివృద్ధి చేసేవారికే మద్దతిస్తే మేలు



తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 12వేల పైచిలుకు గ్రామ పంచాయతీలకు ఈ నెలలో ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ ప్రథమ పౌరుల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సర్వ సన్నద్ధమయ్యింది. తొలి విడుత పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు జరిగాయి. గ్రామాలలో స్థానిక స్వపరిపాలనకై జరిగే ఎన్నికలలో ఎన్నో ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకుంటాయనటం అక్షర సత్యం. గ్రామాలలో విభిన్న రాజకీయ పార్టీలకు చెందిన వారు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులను కూడ బరిలోకి దింపుతుంటారు. అన్నా తమ్ముడు, అన్నా చెల్లి, తల్లి కొడుకు, అత్త కోడలు కూడ పోటీలో ఉన్న సందర్భాలను మనం చూడవచ్చు. ఈ ఎన్నికలలో డబ్బు ఏరులై పారుతుంది. ఓటర్లను ఆకర్షించడానికి చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఎన్నో హామీలిస్తూ, బ్రతిమిలాడుతూ, భయపెడుతూ, బహుమతులనిస్తూ ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి గ్రామం అభివృద్ధి చెందినప్పుడే యావత్తు రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. కావున గ్రామాలలో ఎన్నికయ్యే సర్పంచులపైనే గ్రామాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

గ్రామ ప్రథమ పౌరుడంటే ఇంటికి పెద్ద దిక్కులాంటి వారే. కుటుంబ సభ్యులు అంటే గ్రామస్థుల నిరంతర క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతుండాలి. కుటుంబంలో చెప్పిన మాట విననివారిని ఎలా గాడిలో పెట్టాలో, ఎలాంటి విద్యనందించాలో అనారోగ్యానికి పాల్పడితే ఎలాంటి చికిత్స చేయించాలో, ఎలాంటి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుని ముందుకెళ్లాలో అలా గ్రామాన్నే తన కుటుంబంగా, గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి నిరంతర అభివృద్ధికి పాటుపడుతూ ఉండాలి. అంతేగానీ ఏదో హోదాకోసమో ఆర్థికపరమైన వ్యాపారంగా భావించి లక్షలలో ఖర్చు పెట్టి గెలిచాను. వడ్డీతో సహా సంపాదించుకోవాలనో ఎన్నికలలో పోటీచేయటం తగదు.

గ్రామస్థులు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా డబ్బుకు ప్రాధాన్యత నివ్వకుండా సేవాదృక్పథం కలిగిన వ్యక్తిని గ్రామాభివృద్ధికి పాటు పడే నాయకున్ని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఏది ఏమైనప్పటికీ వచ్చే నెల నుండి తెలంగాణ రాష్ట్రమంతటా నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కొలువుతీరతారు. గ్రామాలలో ప్రజా ప్రతినిధుల ముందున్న లక్ష్యాలను పరిశీలిస్తే... కొత్త ప్రజాప్రతినిధులు వచ్చిన తర్వాత ఒక మాసంలోనే వేసవికాలం ప్రారంభం కాబోతున్నది. గ్రామ ప్రజలకు పరిశుద్ధమైన మంచినీటిని అందించే బాధ్యత గ్రామ పాలకులపైనే వున్నది. కావున ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా శుద్ధి చేసిన త్రాగునీటిని అందించాల్సిన అవసరం వున్నది. గ్రామంలో అన్నీ సిమెంట్ రోడ్లు ఉండేటట్లు ప్రతి రోడ్డు ప్రక్కన మురికి కాలువలు నిర్మించడం, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి వుండే విధంగా కృషి చేయాలి. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా, గ్రామం శుభ్రతగా ఉండేలా చూసుకోవాలి. సకాలంలో గ్రామ సభలను నిర్వహిస్తూ , ప్రతి ఒక్కరు పాల్గొనేలా ప్రోత్సహిస్తూ ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకుంటూ, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచిస్తూ ముందుకెళ్లాలి. గ్రామంలో నూరు శాతం అక్షరాస్యతకు కృషి చేయడంలో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారుల సలహా, సూచనలతో గ్రామంలోని పాఠశాలలను ప్రోత్సహిస్తూ నాణ్యమైన విద్య అందించాలి. గ్రామంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి, పిల్లలకు పోలియో చుక్కలు, వ్యాధినిరోధక శక్తిని పెంచే టీకాలు ఇప్పించడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. రాష్ట్రం, కేంద్రం గ్రామాభివృద్ధికై ప్రవేశ పెట్టే పథకాలపై అవగాహన కల్పించుకుని గ్రామ ప్రజలకు వివరిస్తూ, వాటి ఫలితాలు గ్రామ ప్రజలకు అందేటట్లు చూడాల్సిన బాధ్యత సర్పంచుల పైనే ఉంది. హరిత హారంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటి వద్ద, అన్నీ వీధులలో రోడ్డుకు ఇరువైపున మొక్కలు నాటుతూ, పరిరక్షిస్తూ పచ్చదనానికి ప్రాముఖ్యతనివ్వాలి. పంచాయతీకి వచ్చే నిధులతో, పంచాయతీకి వచ్చే పన్నులను వసూలు చేసి పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. గ్రామంలోని యువత చెడు మార్గంలో పయనించకుండా చూడాలి. నిరుద్యోగ యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రజా పంపిణీ కార్యక్రమాలను పరిశీలిస్తూ, అందరికీ సరుకులు అందుతున్నాయో లేదో చూసుకుంటూ, ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలి. మహిళా సంఘాలు, పొదుపు సంఘాలను ప్రోత్సహిస్తూ , వారికి సహకరిస్తూ అభివృద్ధి చెందేటట్లు చూడాలి. గ్రామంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం తరుపున వచ్చే సంక్షేమ ఫలాలను అందేటట్లు కృషిచేస్తూ, గ్రామాభివృద్ధికి దోహదపడాలి. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసే వ్యక్తులను తమ ప్రతినిధులుగా ఎన్ను కోవాల్సిన ఆవశ్యకత ప్రతి గ్రామ ఓటర్ల పైన ఉంది.



– డా|| పోలం సైదులు,
9441930361

వైద్య, ఆరోగ్య శాఖకు నియామక బోర్డు

తమిళనాడు రాష్ట్ర తరహాలో వైద్య,ఆరోగ్య శాఖలో నియామకాలన్నింటినీ మెడికల్ బోర్డు ద్వారానే భర్తీ చేయాలన్న ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం కొత్తగా 26 పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 26 పోస్టుల్లో 8 ఔట్ సోర్సింగ్ పద్ధతిన, రెండు పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని, మిగిలిన 16 పోస్టులు రెగ్యులర్ పోస్టుల్లో డిప్యూటేషన్ పద్ధతిలో నియమించుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఆ 16 మందిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారి ఒకరిని డిప్యుటేషన్‌పై మెంబర్ సెక్రటరీగా తీసుకోవాలని, అలాగే జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన వారిని సభ్యుడిగా డిప్యుటేషన్‌పై తీసుకోవాలని జీవోలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి బోర్డు చైర్మన్‌గా వ్యవహరిస్తారని పేర్కొంది.

భారత రాజ్యాంగం

గవర్నర్- సుప్రీంకోర్టు- హైకోర్టు

(1) దేశానికి రాష్ట్రపతి అధినేత అయితే రాష్ట్రానికి గవర్నర్ అధినేత.

(2) రాష్ట్ర గవర్నర్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

(3) వాస్తవానికి రాష్ట్రానికి గవర్నర్ నామమాత్రపు అధికారి. కార్యనిర్వాహక అధికారం అంతా ముఖ్యమంత్రి చేతుల్లో ఉంటుంది.

(4) గవర్నర్‌గా ఎన్నిక కావడానికి కనీసం 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలి.

(5) గవర్నర్, జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది.

(6) శాసనసభ ఆమోదించే బిల్లులు చట్టాలు కావడానికి గవర్నర్ ఆమోద ముద్ర తప్పనిసరి.

(7) శాసనసభ సమావేశాలు ఆరు నెలలకు కనీసం ఒక్కసారైనా జరగాలి.

(8) రాష్ట్ర ప్రభుత్వం జారీచేయు అన్ని శాసనాలు కూడా గవర్నర్ పేరు మీద ఉంటాయి.



(9) గవర్నర్ ముఖ్యమంత్రిని, అతని సూచనల ప్రకారం మంత్రి మండలిని నియమిస్తారు.

(10) హైకోర్టు న్యాయమూర్తులను నియమించడానికి ముందు గవర్నర్ రాష్ట్రపతిని సంప్రదిస్తారు.

(11) బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలో మంత్రి మండలి నిర్మాణంలో ఆదివాసుల కోసం ఒక మంత్రి తప్పనిసరిగా ఉండేలా గవర్నర్ సూచిస్తాడు.

గ్రూప్స్ పరీక్షల కోసం..

(12) రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులకు, చేయు ఖర్చులకు సంబంధించిన బిల్లులను గవర్నర్ ఆమోద ముద్రతో శాసనసభలో ప్రవేశపెట్టాలి.

(13) ఆగంతుక నిధిని గవర్నర్ ఆధీనంలో ఉంచుకుంటాడు.

(14) ప్రతి ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌ను గవర్నర్ అనుమతితో రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి ప్రవేశపెడతాడు.

(15) న్యాయస్థానాలు విధించే శిక్షలను రద్దు చేయటానికి, మార్చటానికి, తగ్గించటానికి గవర్నర్‌కు అధికారము కలదు.

(16) న్యాయస్థానాలకు సంబంధించిన అన్ని పదవులకు గవర్నర్ పేరు మీదనే నియామకాలు జరుగుతాయి.

(17) గవర్నర్ విధులపై పాలనా సంస్కరణల సంఘంను 1969లో నియమించారు.

(18) గవర్నర్‌కు సంబంధించిన విధులు, అతని పాత్రపై రాజమన్నార్ సంఘాన్ని 1971లో నియమించారు.

(19) "గవర్నర్ రాజ్యాంగం ఏర్పరచిన రాష్ట్రాధిపతి. అతను కేంద్ర ప్రభుత్వం ఏజెంటు కాదు" అని గవర్నర్ ఉపసంఘం పేర్కొంటుంది.

(20) కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు పరిష్కరించడానికి నియమించిన కమిషన్ సర్కారియా కమిషన్

(21) 'గవర్నర్‌గా పనిచేయు వ్యక్తి అదే రాష్ట్రానికి చెందిన వాడై ఉండకూడదు' అని సర్కారియా కమిషన్ సూచించింది.

(22) శాసనసభను ఏర్పరచడం, వాయిదా వేయడం, రద్దు చేయడం విషయంలో ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించవలెను.

(23) రాజ్యాంగంలో మూడు ప్రకరణాలు 74(1), 75(1), 78 మాత్రమే దేశ ప్రధాని గురించి ప్రస్తావిస్తున్నాయి.

(24) 74(1) రాజ్యాంగ ప్రకరణను 44వ సవరణ ద్వారా కొంత మార్పు చేశారు. దీని ప్రకారం మంత్రి మండలి సిఫార్సులను రాష్ట్రపతి పునఃపరిశీలన చేయమని తిప్పి పంపవచ్చు.

(25) 39వ రాజ్యాంగ సవరణకు పూర్వం ప్రధాన మంత్రి ఎన్నికకు సంబధించిన వివాదాలను నిర్ణయించడానికి సాధారణ న్యాయస్థానాలకు అధికారముంటుంది.

(26) ప్రధానమంత్రి మంత్రి మండలికి అధ్యక్షుడుగా ఉంటాడు. మంత్రి మండలి నియమించు అన్ని ఉపసంఘాలకు ప్రధాని అధ్యక్షుడుగా ఉంటారు.

(27) ప్రధాన మంత్రి సలహా, సంప్రదింపుల ఆధారంగా రాష్ట్రపతి రాజ్యాంగ అధికారాలను నిర్వహిస్తాడు.

(28) సమాఖ్య రాజ్యాంగంలో అధికారాలు కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య విభజన జరుగుతుంది. అధికారాల నిర్వహణలో ఏమైనా వివాదం ఏర్పడితే సుప్రీంకోర్టు పరిష్కరిస్తుంది.

(29) రాజ్యాంగంలోని 124వ ప్రకరణం ప్రకారం సుప్రీం కోర్టులో మొదట ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు న్యాయమూర్తులు ఉండేవారు.

(30) సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచు అధికారాన్ని పార్లమెంటుకు ఉంటుంది.

(31) ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు.

(32) సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించే అధికారం పార్లమెంటుకు ఉంది.

(33) సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో ఇతర న్యాయమూర్తుల వేతనాలను తగ్గించు అధికారం పార్లమెంటుకు లేదు.

(34) న్యాయమూర్తులందరి వేతనాలను సంఘటిత నిధి నుండి చెల్లిస్తారు.

(35) రాష్ట్రాల మధ్య గానీ లేదా కేంద్రం, రాష్ట్రాల మధ్య గానీ ఏర్పడు వివాదాలను పరిష్కరించు అధికారం సుప్రీం కోర్టుకు 131వ అధికరణ ద్వారా ఆపాదించారు.

(36) సుప్రీం కోర్టు దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం కాబట్టి రాష్ట్ర హైకోర్టు విచారించిన కేసులపై పునర్విచారణ చేయు అధికారం గలదు.

(37) 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 368వ ప్రకరణలో కొత్తగా 4, 5 క్లాజులను చేర్చారు.

(38) 134(ఎ) ప్రకరణం ప్రకారం హైకోర్టు తీర్పు చెప్పిన వెంటనే తీర్పు మీద సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోవడానికి సర్టిఫికేటు ఇవ్వమని హైకోర్టును కోరవచ్చు.

(39) 136వ ప్రకరణ ప్రకారం ఏ ట్రిబ్యునల్ తీర్పులపై నేరుగా సుప్రీం కోర్టు అప్పీలు చేసుకునే అధికారం ఇవ్వవచ్చును.

(40) 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలు రూపొందించే చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించే అధికారం సుప్రీంకోర్టుకు సంక్రమించింది.

(41) 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 139(ఎ) ప్రకరణాన్ని కొత్తగా చేర్చారు. దీని ఆధారంగా సుప్రీం కోర్టు కోసం వచ్చిన వివిదాలతోను హైకోర్టులలో విచారణ కోసం వచ్చిన వివాదాలను శాసనాంశాలు ఒక రకంగా ఉన్నప్పుడు హైకోర్టు వివాదాన్ని ఆటార్నీ జనరల్ ఆధారంగా సుప్రీం కోర్టుకు మార్చవచ్చు.

(42) 139వ ప్రకరణాన్ని 44వ రాజ్యాంగ సవరణ ద్వారా హైకోర్టుల వివాదాలను అటార్నీ జనరల్ అనుమతి లేకుండా కూడా సుప్రీం కోర్టుకు హైకోర్టు మార్చవచ్చు.

(43) సుప్రీం కోర్టు మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తి హెచ్.జె.కానియా.

(44) 7వ రాజ్యాంగ సవరణ ప్రకారం పార్లమెంటు రెండు లేక అంతకన్నా ఎక్కువ రాష్ట్రాలు సమిష్టిగా ఒకే హైకోర్టును ఏర్పాటు చేసుకోవచ్చు.

(45) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు.

(46) రాజ్యాంగంలోని 124వ ప్రకరణ ఆధారంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులను ఏ విధంగా తొలగిస్తారో అదే విధంగా హైకోర్టు న్యాయమూర్తులను కూడా తొలగిస్తారు.

– చేగూరి కుమార్
ఎం.కాం., ఎల్.ఎల్.ఎం, ఎం.ఎ.

తుఫాన్ల వల్ల నష్టాలు

తుఫాను అలజడి కారణంగా వచ్చే బలమైన గాలులు, విస్తారమైన వర్షాలు, వాటివల్ల వచ్చే వరదలు కలిసి భారీ ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలుగజేస్తాయి. 1999లో ఒడిశాలో వచ్చిన సూపర్ సైక్లోన్ కారణంగా 10వేల మందికి పైగా మరణించగా, అంతకంటే ముందు 1977 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన భయంకర తుఫాను కారణంగా 9,941 మంది చనిపోయారు. 34 లక్షల మందికి పైగా నిరాశ్రయులు అయ్యారు. 2013 అక్టోబర్‌లో వచ్చిన ఫైలిన్ తుఫాను కూడా భారీ విధ్వంసం సృష్టించింది.



తుఫాన్లు సృష్టించే విధ్వంసం ప్రధానంగా తుఫాను తీవ్రత, దాని పరిమాణం, అది సంభవించే ప్రాంతంపై ఆధారపడి ఉంటుంది. పెను తుఫాన్లు అడవులను సైతం ధ్వంసం చేస్తాయి. ఇటీవల వచ్చిన ఫైలిన్ తుఫాను వల్ల ఒడిశా రాష్ట్రంలో 26 లక్షలకు పైగా చెట్లు నేలకూలాయి. తీర ప్రాంతంలో ల్యాండు స్కేపుల రూపురేఖలను సైతం మార్చివేస్తాయి. ఇసుక దిన్నెలను తొలగించడం లేదా వాటి రూపురేఖలను మార్చడం ద్వారా తీరం వెంబడి భూ క్షయానికి దారితీస్తాయి. తుఫాన్ల వల్ల వచ్చే భారీ వర్షాల కారణంగా తీరం వెంబడే కాకుండా లోతట్టు ప్రాంతాల్లో సైతం విధ్వంసం జరుగుతుంది. పర్వత ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడటం (భూపాతాలుLandslides), బురద–ప్రవాహాలు (పంక–పాతాలు Mudslides) వంటివి జరుగుతాయి. తుఫాను సంభవించిన సమీప ప్రాంతంలోని గుహల్లో ఆక్సిజన్ 18 ఐసోటోపు గాఢత పెరుగుతుందని కొన్ని అధ్యయనాల్లో తేలింది. తుఫాను సృష్టించిన విధ్వంసం అంత టితోనే ఆగిపోదు. ఆ తర్వాత కూడా కొనసాగుతుంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండటం వల్ల అంటువ్యాధులు వ్యాపిస్తాయి. రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతింటాయి.

ఆంధ్రప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాలు తుఫాన్ల వల్ల అధికంగా నష్టాలకు గురికావడానికి కారణాలు

- బంగాళాఖాతంలో సంభవించే సగం తుఫాన్లు తరచుగా తుఫాను అలజడులతో కూడిన తీవ్ర చక్రవాతాలుగా మారడం.
- తీరం వెంబడి లోతట్టులో ఉండే ప్రాంతాలు అసాధారణ వరదలకు, సముద్రపు నీటి ముంపునకు గురవడం.
- తీరం వెంబడి జనాభా, మౌలిక వసతులు, ఆర్థిక కార్యకలాపాలు అధికంగా కేంద్రీకృతం కావడం.
- వరద సంరక్షణ, సాగునీటిపారుదల వ్యవస్థలు, మురుగునీటి కాలువలు, ఆనకట్టల నిర్వహణ సక్రమంగా లేకపోవడం.
- తీరప్రాంత, డెల్టా నిర్వహణ సమగ్రంగా లేకపోవడం.

భారతదేశంలో తుఫాను హెచ్చరికలు

అల్పపీడనం ఏర్పడి, అది తుఫానుగా మారి, విధ్వంసం సృష్టించడాన్ని కొన్ని గంటలు లేదా కొన్ని రోజుల ముందే పసిగట్టవచ్చు. కృత్రిమ ఉపగ్రహాలు తుఫాన్ల కదలికలను పసిగడతాయి. దాని ఆధారంగా, అవి ప్రభావితం చేయబోయే ప్రాంతాల నుంచి ప్రజలను ముందుగానే ఖాళీ చేయిస్తారు. అయితే తుఫాన్లను నిక్కచ్చిగా అంచనా వేయడం చాలా కష్టం. కచ్చితమైన హెచ్చరికలను కొద్ది గంటలు ముందుగా మాత్రమే ఇవ్వడం సాధ్యమవుతుంది.

ప్రపంచంలో అత్యుత్తమ తుఫాను హెచ్చరిక వ్యవస్థలు కలిగిన దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. భారతదేశంలో తుఫాన్ల రాకను అంచనా వేసి, హెచ్చరికలను జారీ చేసే బాధ్యతను భారత వాతావరణ శాఖ నిర్వర్తిస్తుంది. ఇన్‌శాట్ ఉపగ్రహాలతో పాటు 10 సైక్లోన్ డిటెక్షన్ రాడార్ల సహాయంతో చక్రవాతాల రాకను, అవి ప్రయాణించే మార్గాన్ని పసిగడతారు. కోల్కతా, చెన్నై, ముంబైలలోని ఏరియా సైక్లోన్ హెచ్చరికల కేంద్రాలు, విశాఖపట్టణం, భువనేశ్వర్, అహ్మదాబాద్లలో ఉన్న తుఫాను హెచ్చరికల కేంద్రాల ద్వారా తుఫాను హెచ్చరికలను జారీ చేస్తారు. తుఫాను హెచ్చరికల ప్రక్రియను పుణెలోని డీడీజీఎం వాతావరణ కేంద్రం, న్యూఢిల్లీలోని నార్తరన్ హెమిస్పెరిక్ ఎనాలసిస్ సెంటర్(హౌట్టజ్చిట Hemispheric Analysis Centre)లు సమన్వయపరుస్తాయి. అనంతరం తుఫాను హెచ్చరికలను ప్రజలకు శాటిలైట్ ఆధారిత విపత్తు హెచ్చరికల వ్యవస్థ, రేడియో, టెలివిజన్, టెలిఫోన్, ఫ్యాక్స్, హై ప్రయారిటీ టెలిగ్రాములు, బహిరంగ ప్రకటనలు, పత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేసి అప్రమత్తం చేస్తారు.

తుఫాను ఉపశమన చర్యలు

7516 కిలోమీటర్ల భారతదేశ తీరరేఖలో 5700 (71%) కిలోమీటర్ల భూభాగం తుఫాను అలజడులు, తుఫాన్లు, సునామీల ముప్పును కలిగి ఉంది. భారతదేశంలో ఏటా వచ్చే తుఫాన్ల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరుగుతోంది. జీవనోపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తీవ్ర నష్టం జరుగుతోంది. మౌలిక వసతులు ధ్వంసమవుతున్నాయి. తద్వారా అప్పటివరకు సాధించిన అభివృద్ధి తిరోగమన మార్గం పడుతోంది. దీని నివారణకు కొన్ని ఉపశమన చర్యలు చేపట్టాలి. ఇవి రెండు రకాలు: 1. నిర్మాణాత్మక ఉపశమన చర్యలు, 2. నిర్మాణేతర ఉపశమన చర్యలు.

తీర ప్రాంతాల్లో బహుళార్థ సాధకతుఫాను షెల్టర్లను నిర్మించడం, తీరరేఖ వెంబడి శాస్త్రీయ పద్ధతిలో మడ అడవులను పెంచడం, వృక్షాలను నాటడం వంటి చర్యలు చేపట్టాలి. అడవులు బలమైన గాలులు, ఆకస్మిక వరదలను అడ్డుకునే కవచంలాగా పని చేస్తాయి. వీటితోపాటు భవనాలను బలమైన గాలులను తట్టుకునే విధంగా దృఢంగా నిర్మించడంతో పాటు ఎత్తయిన దిన్నెలు లేదా మట్టి దిబ్బలపై నిర్మించాలి. ఆయా ప్రాంతాలకు సంబంధించిన వైపరీత్యాల మ్యాపులను తయారుచేసి, ప్రజలకు అవగాహన కల్పించాలి. తుఫాను ముప్పు ఉన్న ప్రాంతాల్లో సంక్లిష్టమైన నిర్మాణాలు, కార్యకలాపాలు చాలా తక్కువగా ఉండే విధంగా ప్రభుత్వాలు జాగ్రత్తపడాలి. వరదలు సంభవించే మైదాన ప్రాంతాల్లో ఉండే భూ వినియోగాన్ని క్రమబద్ధీకరించే విధానాలను, భవన నిర్మాణ కోడ్లను రూపొందించి అమలు చేయాలి.

ఈ చర్యల్లో భాగంగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేందుకు జాతీయ తుఫాను ముప్పు ఉపశమన ప్రాజెక్టు (National Cyclone Risk Mitigation Project)ను 200910లో ప్రారంభించింది. 5 ఏళ్లపాటు అమల్లో ఈ ప్రాజెక్టును ఆంధ్ర ప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు.

తుఫాను నష్టాల తగ్గింపులో విపత్తు నిర్వహణ ప్రభావం

తుఫాన్ల తీవ్రత పెరుగుతున్నప్పటికీ, ఇటీవల కాలంలో వాటి వల్ల సంభవించే ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతోంది. 1970లో పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్లలో వచ్చిన భోలా తుఫాను తాకిడికి రెండు ప్రాంతాల్లో కలిపి 5 లక్షల మంది మరణించారు. అలాగే 1999 ఒడిషా సూపర్ సైక్లోన్ కారణంగా 10,000 మంది మరణించగా, 1977లో చెన్నై, కేరళ, ఆంధ్రప్రదేశ్లలో వచ్చిన తుఫాను ధాటికి 14,204 మంది చనిపోవడం జరిగింది. ప్రాణ నష్టంతో గణనీయంగా పంటలు దెబ్బతినడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు విధ్వంసం కావడం జరిగింది. అయితే 2004లో వచ్చిన సునామీ అనంతరం విపత్తు నిర్వహణపై భారతదేశంలో కూడా అప్రమత్తత ప్రారంభమైంది. తత్ఫలితంగానే 2005లో విపత్తు నిర్వహణ చట్టం రూపుదాల్చడం, అందులో భాగంగా జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థలు ఏర్పాటు కావడం, వాటిని జిల్లా, గ్రామ స్థాయి వరకు వికేంద్రీకరించడం, పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం, పంచవర్ష ప్రణాళికలో, ఆర్థిక సంఘాల నిధుల కేటాయింపుల్లో విపత్తు నిర్వహణకు స్థానం కల్పించడం తదితర చర్యలు కారణంగా విపత్తు నిర్వహణ ప్రాధాన్యత సంతరించుకుంది. భారతదేశంలో విపత్తుల కారణంగా జీడీపీలో 2 నుంచి 2.25% వరకు నష్టం జరుగుతున్నట్టు ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. కాబట్టి విపత్తు నిర్వహణకు భారతదేశం పెద్ద పీట వేస్తోంది. తత్ఫలితంగా విపత్తుల నివారణతోపాటు విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై కూడా ప్రభుత్వాలు దృష్టి సారించాయి. దేశంలో 10 చోట్ల జాతీయ విపత్తు స్పందన దళాల(ఎన్డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేయడం జరిగింది. 2007 నవంబర్‌లో 100 కోట్లతో జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (National Disaster Response Fund (NDRF))ని కేంద్రం నెలకొల్పింది. 13వ ఆర్థిక సంఘం రాష్ట్ర విపత్తు స్పందన నిధి (State Disaster Response Fund (SDRF)), జాతీయ విపత్తు స్పందన నిధుల కోసం పథకాలను సిఫారసు చేసింది. ఈ చర్యల ఫలితంగా విపత్తుల వల్ల సంభవించే నష్టాలు గణనీయంగా తగ్గాయి. ప్రధానంగా ప్రాణ నష్టం భారీగా తగ్గింది. 1999లో వచ్చిన ఒడిశా సూపర్ సైక్లోన్ ధాటికి 10వేల మందికి పైగా మరణించగా, 2013 అక్టోబర్‌లో వచ్చిన ఫైలిన్ పెను తుఫానులో మరణించిన వారు 44 మంది మాత్రమే. ఇందుకు సాంకేతిక విప్లవం కూడా చాలా వరకు దోహం చేసిందని చెప్పొచ్చు. తక్కువ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాతావరణ రేడియోలు, హామ్ రేడియోలు, సెరైన్లు, లౌడుస్పీకర్లు, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్‌లు లేదా ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక వెబ్‌సైట్ల ద్వారా అందే సందేశాలు ప్రజలను చాలా వేగవంతంగా అప్రమత్తం చేసి, ప్రాణనష్టాన్ని తగ్గించడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. గూగుల్ సెర్చ్ ఇంజన్ కామన్ అలర్ట్ ప్రోటోకాల్(Common Alert Protocol (CAP) ఆధారిత అలర్టలను ప్రారంభించింది. ట్విట్టర్ సామాజిక వెబ్‌సైట్ ట్విట్టర్ అలర్ట్ పేరుతో ఒక యాప్‌ను ఆవిష్కరించింది. ఇలా బహుముఖాలుగా విపత్తు నిర్వహణకు ప్రాధాన్యం పెరగడంతో ప్రాణ నష్టం గణనీయంగా తగ్గుతున్నప్పటికీ, పంట నష్టం, ఆస్తి నష్టం, పశుసంపద నష్టం, పర్యావరణానికి జరిగే నష్టాలను కుదించలేకపోతున్నారు. దీనికి సైతం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అడవులను పెంచడం, భూతాపాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టడం, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యల ద్వారా విపత్తులను కుదించి, వాటివల్ల సంభవించే నష్టాలను కూడా నివారించవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు

సీఐఎస్ఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్స్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పురుషులతో పాటు మహిళలూ వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు: హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్). **ఖాళీలు:** 429 (వీటిలో సీఐఎస్ఎఫ్ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు 64 పోస్టులు కేటాయించారు). **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **వయసు:** 2019, ఫిబ్రవరి 20 నాటికి 18–25 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** హైట్ బార్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** రూ. 100. **ఆన్‌లైన్ దరఖాస్తు :** జనవరి 21 నుంచి ఫిబ్రవరి 20 వరకు. **వెబ్‌సైట్:** www.cisfrectt.in

ఆర్మీ- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 46వ కోర్సు ద్వారా షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 55 (పురుషులు 50, మహిళలు 5). **అర్హత:** కనీసం 50% మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి. **వయసు:** 2019, జూలై 1 నాటికి 19–25 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** స్టేజ్ 1, 2 పరీక్షలు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో. **చివరితేదీ:** ఫిబ్రవరి 7, 2019.

వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

అప్రెంటిస్‌షిప్

ఇండియన్ ఆయిల్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) 2019–20 సంవత్సరానికి గాను సదరన్ రీజియన్‌లో అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. టెక్నికల్/ నాన్ టెక్నికల్ ట్రేడ్ అండ్ టెక్నీషియన్ అప్రెంటీస్

ఖాళీలు: 420

ఆన్‌లైన్ దరఖాస్తు: జనవరి 18 నుంచి ఫిబ్రవరి 10 వరకు

గమనిక: అర్హత, వయసు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలకు ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్: https://iocl.com

పోటీ పరీక్షల కోసం..

బయాలజీ ప్రశ్నలు

1) క్రింది వానిని జతపర్చుము

ఎముకలు వుండే ప్రదేశాలు	ఎముకల సంఖ్య
i) కపాలం	అ)22
ii) చెవి	ఆ)04
iii) వెన్నుముక	ఇ)06
iv) భుజ వలయం	ఈ)26

1) అ–i,ఆ–ii,ఇ–iii,ఈ–iv 2) అ–ii,ఆ–i,ఇ–iv,ఈ–iii
3) అ–i,ఆ–iii,ఇ–iv,ఈ–ii 4)అ–iv,ఆ–iii,ఇ–ii,ఈ–i

మానవునిలోని ఎముకల సంఖ్య 206. మానవుని తల భాగంలో మొత్తం 29 ఎముకలు ఉంటాయి. కపాలంలో 8, ముఖంలో 14, చెవిలో 6 (3+3) నాలుక క్రింద 1 ఉంటాయి. వెన్నుముకలో 26 చిన్న పిల్లల్లో 33 ఎముకలు ఉంటాయి.

2) క్రింది వానిని జత పరచుము

కీలు	వుండే ప్రదేశం
1) బంతి గిన్నె కీలు	i) మోచేయి, మోకాలు
2) మడత బందు కీలు	ii) భుజం
3) జారేడు కీలు	iii) వెన్నుముక, మణికట్టు
4) బొంగరపు కీలు	iv) మెడ

1) 1–i,2–ii,3–iii,4–iv 2) 1–ii,2–i,3–iii,4–iv
3) 1–ii,2–iii,3–iv,4–i 4) 1–iii,2–ii,3–i,4–iv

రెండు లేదా ఎక్కువ ఎముకల లిగమెంట్ అనే పట్టీల సహాయంతో అతికే ప్రదేశాన్ని కీలు అంటారు. భరత నాట్యం, కూచిపూడి నాట్యకారులు ఎక్కువగా బొంగరపు కీలు ఉపయోగించెదరు. కీళ్ళ అధ్యాయన్ని Artrhrology అంటారు.

3) క్రింది వానిలో సరైనవి ఏవి

i) కండరాల అధ్యయనాన్ని మయాలజీ అంటారు
ii) మానవునిలోని మొత్తం కండరాల సంఖ్య– 506
iii) కండరాలలో అతి చిన్న కండరం– స్టేపీడియాస్

1) i మాత్రమే 2) ii, iii మాత్రమే
3) i, iii మాత్రమే 4) ఏది కాదు

మానవునిలోని కండరాల సంఖ్య మొత్తం 639. కండరాలు సంకోచ సడలికలు చెంది ఎముకలను కదలిస్తాయి. అతి బలమైన కండరం మాసెటర్. కండర సంకోచానికి ఉపయోగపడే మూలకాలు K, Ca.

4) అరేఖిత కండరాలకు ఉదాహరణ ఏది

1) చేతి 2) కాలి కండరాలు 3) వ్రేళ్ళు 4) మూత్రాశయం


నియంత్రించలేని కండరాలు అరేఖిత కండరాలు. ఇవి ప్రేగు, జీర్ణాశయం, మూత్రాశయం మొదలైనవి. చేతి, కాలి కండరాలు నియంత్రిత కండరాలు.

5) జతపర్చుము

వ్యాధులు	లక్షణం
1) అస్టియో ఆర్థరైటిస్	అ) కీళ్ళ మధ్య సైనోవియాల్ ద్రవం అరిగి కీళ్ళ నొప్పి కలగడం
2) రికెట్స్	ఆ) చిన్న పిల్లల్లో డి విటమిన్ లోపం వల్ల ఎముకలు వంగడం
3) గౌట్	ఇ) కీళ్లలో యూరిక్ ఆమ్లస్ఫటికాలు పేరుకొని కీళ్ళ నొప్పి కలగడం
4) అస్టియో మలేషియా	ఈ) పెద్ద వారిలో డి విటమిన్ లోపంవల్ల ఎముకలు మెత్తగా మారడం

1) అ–i,ఆ–iii,ఇ–iv,ఈ–ii 2) అ–i,ఆ–ii,ఇ–iii,ఈ–iv
3) అ–ii,ఆ–i,ఇ–iii,ఈ–iv 4) అ–iii,ఆ–ii,ఇ–iv,ఈ–i

కీళ్ళ మధ్య వున్న మృదులాస్థి నశించడం, సైనోవియాల్ ద్రవం తగ్గడం వలన అస్టియో అర్థరైటిస్ వ్యాధి కలుగును.అదేవిధంగా రక్తంలో కీళ్లలో యూరిక్ ఆమ్ల స్ఫటికాలు పేరుకొని పోవడం వలన కలిగే కీళ్ళ నొప్పి గౌట్. దీని వలన వాపు, జ్వరం వంటి లక్షణాలు కనబడును. అస్టియో మలేసియా పెద్ద వారిలో D విటమిన్ లోపం వలన ఎముకలలో ca, p బయటికి రావడం వలన ఎముకలు పెళుసుగా మరుతాయి.



6) కండరాల లక్షణాలకు సంబంధించి సరి అయినవి క్రింది వానిలో ఏవి

i) టిటాని అనగా పారాథార్మోన్ తక్కువ స్రావం వల్ల కండరాలు ఎల్లపుడు సంకోచం చెందడం
ii) కండర గ్లాని అనగా ఎల్లపుడూ పనిచేయడం వల్ల వానికి సరి అయిన ఆక్సిజన్ అందక అవాయు శ్వాస జరుపుకొని లాక్టిక్ ఆమ్లం ఏర్పర్చును

i) i మాత్రమే 2) ii మాత్రమే 3) i, ii 4) ఏవీ కావు

కండరాలలో 3 ముఖ్య లక్షణాలు ఉండును. అవి 1)టిటాని, 2) కండర గ్లాని, 3) రిగర్ మోర్టిస్. టిటాని పారాతార్మోన్ తక్కువ స్రవించడం, అదేవిధంగా కండర గ్లాని లాక్టిక్ ఆమ్లం ఏర్పరచడం వలన కండరాలు అలసట చెందుతాయి.

7. క్రింది వానిలో సరి అయినవి ఏవి

i) శంఖు కణాలు వుత్పత్తి చేసే పదార్థం రోడాప్సిన్. ఇవి చీకటిలో చూడాడానికి తోడ్పడును.
ii) దండ కణాలు కాంతి ఉత్పత్తి చేసే పదార్థం ఇడాప్సిన్. ఇవి కాంతి సమక్షంలో చూడడానికి తోడ్పడును

1) i మాత్రమే 2) ii మాత్రమే 3) i, ii 4) ఏవీ కావు

దండ కణాలు ఉత్పత్తి చేసే పదార్థం రోడాప్సిన్. ఇవి చీకటిలో చూడడానికి తోడ్పడును. ఇవి రంగులను గుర్తించలేవు. గబ్బిలం, పిల్లి లాంటి జంతువులు వీటికి ఉదాహరణ. కాంతి సమక్షంలో చూడడానికి ఉపయోగపడే కణాలు శంకు కణాలు. కనురెప్పలు వుండని జంతువులు పాములు, చేపలు వీటికి ఉదాహరణ.

8) కళ్ళు గురించి తెలిపే అధ్యాయం ఏది

1) ఆప్టిక్స్ 2) అన్తలజీ 3) ఆప్తలజీ 4)ఆప్తాల్మాలజీ

కళ్ళ గురించి తెలిపే అధ్యాయం ఆప్తాల్మాలజీ. కనుగుడ్లు కదల్చడానికి తోడ్పడే కండరాల సంఖ్య 6. కను చూపుకు కారణం, ప్రతి బింబం ఏర్పడే పొర రెటీనా. ప్రతిబింబం ఏర్పడడానికి పట్టే కాలం 0.1 సెకన్లు. కన్ను గుర్తించే రంగుల సంఖ్య 16.

9) క్రింది వానిలో సరి అయినవి ఏవి

i) మయోపియా: రెటీనాకు ముందు ప్రతిబింబం ఏర్పడితే దగ్గరి వస్తువులు మాత్రమే చూడగలం
ii) హైపర్ మేట్రోపియా: రెటీనాకు వెనుక ప్రతిబింబం ఏర్పడితే దూరపు వస్తువులను మాత్రమే చూడగలం
iii) ట్రాకోమా: దుమ్ము, ధూళి వివిధ రకాల జీవుల వల్ల కళ్ళు ఎర్రగా మారడం

1) i,iii 2) i,ii 3)i,ii,iii 4) ii,iii

మయోపియ నివారణకు పుటాకార కటకం వాడాలి. హైపర్ మెట్రోఫియాకు కుంభాకార కటకం ఉపయోగించాలి. గ్లుకోమా అనగా నిద్రలేక పోవడం వల్ల కంటిలోని ద్రవంపై ఒత్తిడి కలిగి నీరు కారడం.

10) i) మానవులోని అతి పెద్ద అవయవ వ్యవస్థ. దీని బరువు సుమారు 4000 గ్రాములు.

ii) బాహ్య చర్మం మెలినిన్ అనే వర్ణక పదార్థం ఉండును. కెరిటిన్ అనే ప్రోటీన్ ఉండును.
iii) స్వేదగ్రంథులు లేని జీవులకు ఉదాహరణ కుక్క, ఏనుగు.

పై వాటిలో సరి అయినవి ఏవి.

1) i మాత్రమే 2) i,ii 3) i,ii,iii 4) i,iii మాత్రమే

చర్మం అధ్యయనం తెలిపేది డెర్మటాలజీ. చర్మంలో దళసరి భాగం పాదం. పలుచని భాగం కనురెప్ప. సెబేషియాస్ గ్రంథులు సెబం అనే పదార్థాన్ని స్రవించి రోమాలను శుభ్రపర్చును. శరీరంలో భాగాలకు రక్షణగా చర్మం పనిచేయును. ఉష్ణోగ్రతను క్రమ రూపంలో ఉంచును.

11) క్రింది వానిని జతపరచుము

వ్యాధి	కారణం
i) గజ్జి	అ) మైక్రో స్పోరియం అనే ఫంగస్ ద్వార కలుగును
ii) తామర	ఆ) సార్కోప్టిస్ అనే కీటకం ద్వారా కలుగును
iii) పెల్లాగ్రా	ఇ) కలుషిత ఆహారం, నీరు, విష వాయువులు పీల్చడం వల్ల కలగడం
iv) ఎగ్జిమా	ఈ) విటమిన్ బి3 లోపం వల్ల కలుగును

1) అ–i,ఆ–ii,ఇ–iii,ఈ–iv 2) అ–ii,ఆ–i,ఇ–iv,ఈ–iii
3) అ–iii,ఆ–ii,ఇ–i,ఈ–iv 4)అ–iv,ఆ–iii,ఇ–ii,ఈ–i

12) క్రింది వానిలో సరి అయినవి ఏవి

i) వ్యాధి గురించి అధ్యయనాన్ని తెలియజేసే శాస్త్రం – పాథాలజీ
ii) అంటువ్యాధుల అధ్యయనాన్ని తెలియజేసే శాస్త్రం – ఎపిడెమియాలజీ
iii) గాయాల అధ్యయనాన్ని తెలియజేసే శాస్త్రం – ఇమ్యునాలజీ

1) i,ii 2) ii,iii 3) i,iii 4) i,ii,iii

శరీరంలో జరిగే జీవ క్రియలకు తాత్కాలిక అవరోధం ఏర్పడడాన్ని వ్యాధి అంటారు. గాయాల అధ్యయనంను తెలిపే శాస్త్రం ట్రేమాలాజీ. ఇమ్యునాలజీ అనేది వ్యాధి నిరోధక శక్తి అధ్యయనంను చేయును.

13) ప్రపంచంలో మొదటిసారిగా కనుగొన్న వ్యాక్సిన్ ఏది

1) పోలియో 2) క్షయ 3) తట్టు 4) మశూచి

క్రియ రహిత సూక్ష్మజీవులు కల మందులనే వ్యాక్సిన్ అంటారు. ప్రపంచంలో మొదటిసారిగా కనుగొన్న వ్యాక్సిన్ మశూచి వ్యాక్సిన్. దీనిని కనుగొన్నది ఎడ్వర్డ్ జెన్నర్. కావున ఇతడిని ఫాదర్ అఫ్ వ్యాక్సినేషన్ అంటారు.

14) క్రింది వానిని జతపరచుము

వ్యాధి	ఉదా:
i) ఎండమిక్	అ) తట్టు, కలరా
ii) ఎపడమిక్	ఆ) మలేరియా
iii) పాండమిక్	ఇ) ఎబోలా
iv) డెఫిషియన్సీ	ఈ) క్యాషేయోర్కర్

1) అ–i,ఆ–ii,ఇ–iii,ఈ–iv 2) అ–iv,ఆ–iii,ఇ–ii,ఈ–i
3) అ–ii,ఆ–i,ఇ–iii,ఈ–iv 4) అ–iii,ఆ–ii,ఇ–iv,ఈ–i

ఎండమిక్ వ్యాధి ఒక నిర్దిష్ట సమూహపు ప్రజలలో వ్యాప్తి చెందే వ్యాధి. దీనికి ఉదాహరణ మలేరియా, ఎపడమిక్ వ్యాధి. నిర్దిష్ట సమయంలో అత్యధిక ప్రజలు వ్యాధి బారిన పడడం. ఉదాహరణకు కలరా, తట్టు, పాండమిక్ వ్యాధి. దేశం మొత్తం విస్తరించే వ్యాధి. ఉదాహరణకు ఎబోలా. డెఫిషియన్సీ వ్యాధి పోషక పదార్థాల లోపం వల్ల కలిగే వ్యాధి

15) క్రింది వానిలో బాక్టీరియా ద్వారా లభించని అంటీబయాటిక్ ఏది

1) క్లోరోమైసిన్ 2) సల్ఫా 3) టెట్రా సైక్లిన్ 4) పెన్సిలిన్

పెన్సిలిన్ అనే అంటీబయాటిక్ లభించే జీవి శిలీంద్రం. దీని ఉపయోగం న్యుమోనియా, గనేరియా, సోర్ త్రోట్ వంటి వ్యాధులను నయం చేయవచ్చు. యాంటీ బయాటిక్స్‌ని ప్రతిపాదించింది వాక్స్‌మన్. ఇవి బాక్టీరియా, లైకెన్స్ నుండి లభించును.

సమాధానాలు: (1) 3, (2) 2, (3) 3, (4) 4, (5) 2, (6) 3, (7) 4, (8) 4, (9) 3, (10) 3, (11) 3, (12) 1, (13) 4, (14) 3, (15) 4

ట్రెండ్

ధోతి ప్యాంట్లు.. కొత్త క్రేజ్





రోజులు ఏలా మారుతున్నాయో దానికి తగ్గట్టు ఫ్యాషన్ పోకడలు కూడా రోజురోజుకూ మారిపోతున్నాయి. నిన్న చూసిన మోడల్ ఈ రోజు ఉండదు.. ఈరోజు చూసిన మోడల్ రేపు ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఈ ఫ్యాషన్ రంగంలో రోజుకో రకం వస్తూనే ఉంటుంది. ముఖ్యంగా డ్రెస్సింగ్.. యూత్ ని ఆకట్టుకోవడానికి ఎన్నో రకాల మోడల్స్ వస్తున్నాయి. ఇప్పటి వరకూ జీన్స్ ప్యాంట్లు వాటిలోనే వేరే మోడల్స్ వచ్చాయి.. అయితే ఇప్పుడు వాటికి చెక్ పెట్టి వాటితో పోటీపడే ధోతి ప్యాంట్లు వచ్చేశాయి. రకరకాల డిజైన్లలో ఈ ధోతి ప్యాంట్లు మార్కెట్లోహడావుడి చేస్తున్నాయి. సెలబ్రిటీల దగ్గర నుండి కాలేజ్ గాళ్స్ వరకూ వీటికి అందరూ ఇష్టపడుతున్నారు. మీరూ ఒకసారి ట్రైచేయండి.. ఫ్యాషన్ పోకడను అనుసరించండి..

ఫ్యాషన ప్రపంచంలో సల్వార్ కమీజ్ డ్రస్లు ఎవర్‌గ్రీన్ ఎందుకంటే సందర్భానికి తగ్గట్టుగా బోలెడు డిజైన్స్, మోడల్స్లో ఉంటాయి కాబట్టి. సల్వార్లో పటియాలా, చుడిదార్, స్ట్రెయిట్ ట్రౌజర్స్, క్యాప్రి ప్యాంట్స్, ధోతి సల్వార్ వంటి మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. అందుకనే సల్వార్ కమీజ్ ఏళ్ల తరబడి ఉన్నప్పటికీ ఫ్యాషన్ ప్రపంచంలో ఎదురులేకుండా స్థిరమైన స్థానంలో ఉంది.

సల్వార్ కమీజ్ ఒక్కోసారి ఒక్కోరకం డిజైనతో కొత్త అందాలతో వస్తుంటుంది. ఆ కోవలోనే ఈ మధ్య ధోతి ప్యాంట్ల క్రేజ్ కనిపిస్తోంది. ఫ్యాషన్ డిజైనర్లు వీటిని స్టైలిష్ లుక్‌తో తయారుచేస్తున్నారు. కాటన్ సిల్క్, షిఫాన్, క్రేప్, జార్జెట్, చందేరి సిల్క్, పాలీ సిల్క్, బెనారస్ ఫ్యాబ్రిక్‌ల పైన ప్రింటింగ్, డైయింగ్, ఎంబ్రాయిడరీని అద్ది వీటిని అందంగా తయారుచేస్తున్నారు. ధోతి ప్యాంట్ల మీదకి సరిపడేలా షర్ట్ డిజైన్లు కూడా ఉంటున్నాయి. వాటికి రంగురంగుల లేసులతో, స్ట్రిప్స్ వర్క్స్‌ అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. వెరైటీ డిజైన్లతో ఉండే ధోతీ ప్యాంట్ సల్వార్ సెట్ వేసుకుంటే స్టైలిష్ లుక్ సొంతం చేసుకోవడమే కాకుండా సౌకర్యంగానూ ఉంటున్నాయి. వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వీటిని వేసుకోవచ్చు. ధోతీ సల్వార్ సెట్‌తో ఎలిగెంట్ లుక్ రావడం ఖాయం. రోజూ ఒకే స్టైలా... అని వాపోకుండా ఇలాంటివి వేసుకుంటే రొటీన్‌కి భిన్నంగా ఉంటుంది. మోడ్రన్ డిజైనింగ్ టెక్నిక్స్‌తో పలు మోడలస్సలో లభిస్తున్న వీటిపై విమీరు కూడా ఒక లుక్ వేయండి.



- విజయా రెడ్డి





పాదరక్షలకు పూలు తోడైతే...



మారిన ఫాషన్ ప్రపంచంలో పువ్వులు అమ్మాయిల జడలలో కన్నా.. బట్టల మీద, బ్యాగ్స్ మీద, వారు వాడే వస్తువుల మీద కనిపిస్తున్నాయి ఈ రోజులలో. వాటికి చెప్పులు కూడా తోడైతే... ఎలా వుంటుందో చూడండి. రంగురంగుల పువ్వులు... రకరకాల మోడల్స్.. వేసుకునే డ్రెస్ బట్టి ఎంచుకునే అవకాశం. ఇంకేంటి అమ్మాయిలూ...పూల అందాన్ని పాదలకూ అద్దండి.



మ్యాచింగ్‌తో స్టైలిష్ లుక్

చాల మంది డ్రెస్ కి మ్యాచింగ్ జ్యూవెలరి మాత్రమే వేస్తుంటారు కాని డ్రెస్ తగ్గట్టు మ్యాచింగ్ సాండిల్స్, మ్యాచింగ్ హ్యాండ్ బాగ్ వేసి చూడండి. అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. అందరి దృష్టిని ఆకర్షిస్తారు. మల్టి కలర్ లో ఉండేవి ట్రెండీ లుక్‌తో ఉండేవి పార్టీ వేర్ ఇలా కొన్ని కలెక్షన్స్ తో మీ వార్డ్ రోబ్ ని నింపండి పార్టీస్ లో స్పెషల్ గా మెరవండి.









ఆహా

బామ్మ చిట్కాలు

- కొబ్బరిముక్కను పెరుగులో వేస్తే తొందరగా పెరుగు పాడవదు.
- పప్పు తొందరగా ఉడకాలంటే ఉడికేటపుడు డాల్డా లేదా నూనె గానీ వేయాలి.
- పచ్చి కొబ్బరి చాలా కాలం నిల్వ ఉండాలంటే పచ్చి కొబ్బరి లోపల నిమ్మరసం పూసుకోవాలి.
- క్యాబేజి తినేటపుడు వాసన రాకుండా, వండేటప్పుడు కొద్దిగా అల్లం వేసుకోవాలి.
- వంటలు రుచిగా అవ్వడానికి కారంతో పాటు చిటికెడు ఉసిరిక పొడి వేసుకోవాలి.
- దొండకాయ త్వరగా ఉడకాలంటే, కొద్దిగా వంట సోడాని కలుపుకోవాలి.
- వంకాయ ముక్కలు నల్లబడకుండా ఉండాలంటే స్పూను పాలు వేయాలి.
- మినపప్పు త్వరగా నానాలంటే ఆ నీళ్లలో ఇనుపవస్తువు ఏదైనా వెయ్యి.
- వడియాల పిండిలో కొంచెం నిమ్మరసం వేస్తే తెల్లగా వస్తాయి.
- వేపుడుకూరలు దించేముందు కొంచెం శనగపిండి పైన చల్లి కలిపి దించితే మంచి రుచిగా ఉంటాయి.
- కూరగాయ ముక్కల్ని పసుపు కలిపిన నీటిలో ఉంచితే ఏమైనా క్రిములు ఉంటే అవి పైకి తేలిపోతాయి.
- పుదీనా పచ్చడి చేసేటప్పుడు కొద్దిగా పెరుగు కలిపితే రంగూ, రుచీ బాగుంటాయి.

వహ్వా.. ఏమి రసం



రసం అనేది చాలా కుటుంబాలలో రోజువారీగా తయారుచేసే సాంప్రదాయ దక్షిణ భారతీయ ఆహారంగా చెప్పవచ్చు. రసం ఒక స్పైసీ ఇంకా పుల్లని సూప్. వేడి అన్నంలో కలుపుకొని తింటారు. సాధారణంగా అనారోగ్యంతో ఉన్న పిల్లలు, పెద్ద వారికి రసంతో భోజనం పెడతారు. ఈ రెసిపీలో పప్పుధాన్యాలు ఏమి ఉండవు. ఏది ఏమైనా రసం చిక్కదనం కోసం ఉడికించిన కందిపప్పును కలప వచ్చు. నిమ్మరసం, మిరియాలు రసం,ఉలవలు రసం వంటి అనేక రకాల రసాలను తయారుచేయ వచ్చు. రసం చాలా సులభంగా తయారుచేసే ఆరోగ్యకరమైన రుచికరమైన దక్షిణ భారతీయ వంటకం.

ఉసిరి రసం



కావలసినవి

ఉడికించిన కందిపప్పుఅరకప్పు, ఉసిరికాయలు(పెద్దవి)ఐదు, మిరియాలు, జీలకర్ర పొడి ఒక్కొక్క టీస్పూను, పచ్చిమిరపకాయలునాలుగు (నిలువుగా రెండుముక్కలుగా చీరాలి), కరివేపాకు తగినంత, ఇంగువ చిటికెడు, అల్లంవెల్లుల్లి పేస్టు టీస్పూను, కొత్తిమీర టేబుల్‌స్పూను, ఆవాలుపావుస్పూను, నూనెటీస్పూను, పసుపుపొడిఅర టీస్పూను.

తయారీ

ఉసిరికాయల్లోంచి గింజలు తీసేయాలి. కాయల్ని చిన్న ముక్కలుగా తరిగి వాటిలో ముప్పావు కప్పు నీళ్లు పోసి మిక్సర్‌లో వేసి పేస్టులా చేయాలి. అందులోంచి రసాన్ని (జ్యూసును) తీసి ఒక గిన్నెలో పోయాలి. తర్వాత ఉడికిన పప్పు, ఉసిరి జ్యూసు, జీలకర్ర, మిరియాల పొడులతోపాటు పసుపు పొడి కూడా ఒక గిన్నెలో వేసి ఆ మిశ్రమాన్ని కలపాలి. తర్వాత ఒక ప్యాన్ తీసుకుని అందులో కొద్దిగా నూనె వేసి ఆవాలు వేసి వేగనివ్వాలి. కరివేపాకు, తరిగిపెట్టుకున్న పచ్చిమిరపకాయలు, అల్లంవెల్లుల్లి పేస్టు, ఇంగువలను కూడా అందులో వేసి చక్కని సువాసన వచ్చేదాకా వేగించాలి. అందులో పప్పు నీళ్లు పోసి ఉడకనివ్వాలి. రసం కాసేపు ఉడికిన తర్వాత స్టవ్ మీద నుంచి దించి, సన్నగా తరిగిపెట్టుకున్న కొత్తిమీరను చల్లి అన్నంలో వేడిగా కలుపుకుతింటే ఎంతో రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా మంచిది.

చెన్నై రసం

కావలసినవి

చింతపండు ఓ మాదిరి ఉసిరికాయంత సైజులో, టొమాటో (మరీ పెద్దది, మరీ చిన్నది కాకుండా మీడియం సైజు) ఒకటి, మిరియాలు, జీలకర్ర ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున, వెల్లుల్లి రెబ్బలు నాలుగు, పసుపు చిటికెడు, నూనె రెండు టీస్పూన్లు, ఆవాలు ఒక టీస్పూన్, కరివేపాకు ఒక రెమ్మ, కొత్తిమీర కొద్దిగా, ఉప్పు రుచికి సరిపడా.

తయారీ విధానం

చింతపండుని అర కప్పు నీళ్లలో నానబెట్టాలి. అందులోనే చిటికెడు పసుపు, కొంచెం ఉప్పు వేయాలి.

తరువాత చింతపండు రసం పిండి పక్కన పెట్టాలి. టొమాటోలను నలిపి చింతపండు రసంలో కలపాలి.

మిరియాలు, జీలకర్ర, వెల్లుల్లి, ఒక ఎండుమిర్చిని మిక్సీ జార్లో వేసి మెత్తటి పొడిలా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి చిటపటమంటున్నప్పుడు రెండు ఎండుమిర్చి, కరివేపాకులు వేయాలి.

ఇందులో తయారుచేసుకున్న చింతపండు రసాన్ని, మిక్సీ పట్టిన పొడి, ఉప్పు వేసి వేడిచేయాలి.

ఉడుకుపట్టి నురగలా రావడం మొదలవ్వగానే స్టవ్ ఆపేయాలి. అంతకంటే ఎక్కువగా ఉడికిస్తే చేదెక్కుతుంది. కొత్తిమీర తరుగుతో అలంకరిస్తే రుచికరమైన రసం సిద్ధం.





ఆకాకరకాయ రసం

కావలసిన పదార్థాలు

బుడ్డకాకర ఆకులు గుప్పెడు, చింతపండు రసం ఒక లీటర్, ఎండు మిర్చి కొన్ని, మిరియాలు, జీలకర్ర, ఉప్పు సరిపడినంత, ఇంగువ చిటికెడు, వెల్లుల్లి రెబ్బలు ఎనిమిది, ఆవాలు, నూనె తాలింపునకు.

తయారీ విధానం

బుడ్డకాకర ఆకుల్ని శుభ్రంగా కడిగి చింతపండు రసంలో వేయాలి. ఒక టీస్పూన్ ఉప్పు వేసి చింతపండు పచ్చి వాసనపోయే వరకు ఉడికించాలి. ఎండుమిర్చిలు మిక్సీ జార్లో వేసి మెత్తగా పట్టి రసంలో కలపాలి. తరువాత మిరియాలు, జీలకర్ర, ఇంగువ, వెల్లుల్లి రెబ్బలు వేయాలి. రసం ఉడుకు పట్టగానే స్టవ్ ఆపేయాలి. ఆవాలతో తాలింపు వేయాలి. ఈ రసం తాగినప్పుడల్లా ఒక్కో గ్లాసు చొప్పున తీసుకుంటే ఫలితం ఉంటుంది.



మన గుండె ఆరోగ్యం మన చేతుల్లోనే

హెల్త్

ఇలా చేస్తే మీ గుండె పది కాలాలపాటు పదిలం

శరీరంలో ముఖ్యమైన అవయవం గుండె అని అందరికీ తెలిసిన విషయమే. మనిషి మనుగడకు గుండె ఆధారం. శరీరంలో గుండె ఆరోగ్యం.. వివిధ అవయవాల పని తీరుపై ప్రభావం చూపుతుంది. శరీరానికంతటికి రక్త సరఫరాతో పాటు అనేక రకాల విధులను మానవ హృదయం నిర్వర్తిస్తుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉండి, గుండె సమస్యల నుండి ఉపశమనానికి, రక్షణ చాలా అవసరం. ఆ మార్గాలను తెలుసుకోవడం ఎందుకు అంటే మీరు గుండె జబ్బుల బారిన పడకుండా ఉండడానికి. మీరు ఎల్లపుడూ వత్తిడికి గురవుతుంటే దాని వల్ల కోరోనరీ ధమనులకు చికాకు కలిగించి, రక్తం గడ్డకట్టడానికి దారి తీస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల గోడలకు కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. అలా కొవ్వు ఎక్కువైతే రక్తనాళాలు సన్నగా మారుతాయి. దీనివల్ల గుండెకు రక్త సరఫరా తగ్గిపోతుంది. రక్తసరఫరా తగ్గడమే కాకుండా గుండె కండరాలకు పోషకాలు, ఆక్సిజన్ కూడా అందవు. దీని వల్ల గుండె కండరం చచ్చుబడిపోతుంది. దీన్నే గుండె పోటు లేదా హార్ట్ ఎటాక్ అంటారు.





కరోనరీ ఆర్టరీ డిసీజ్ వల్ల సాధారణంగా గుండె సంబంధిత వ్యాధులు, హార్ట్ ఎటాక్ సమస్యలు వస్తాయి. 50శాతం హార్ట్ ఎటాక్స్ అనుకోకుండా వచ్చేవే. ఎలాంటి వార్నింగ్ సంకేతం ఇవ్వకుండా వస్తాయి. గుండెలోని ఒక భాగానికి రక్తం సరఫరా కాకుండా బ్లాక్ అయినప్పుడు హార్ట్ ఎటాక్ వస్తుంది. గుండెపోటు కలగడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని ముందుగానే పసిగట్టి వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదా డాక్టర్ ని సంప్రదించడం ద్వారా ముప్పు నుంచి బయటపడవచ్చు.

హార్ట్ ఎటాక్ కలిగే ముందు బహిర్గతమయ్యే లక్షణాలివి.

లక్షణాలు

తీవ్రమైన అలసటకు గురవుతారు. గొంతు, మెడ లేదా దవడలో అసౌర్యంగా అనిపిస్తుంది. డోకులు, వాంతులు లేదా పూర్తి జీర్ణాశయ సమస్యలు కలగవచ్చు. గుండెమంటగా ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురి అవుతారు. మాట్లాడటంలో తడబడతారు. మైకము లేదా తల తిరిగినట్లు అనిపిస్తుంది. నిద్రలేమి వల్ల గుండె జబ్బులు రావచ్చు.



హార్ట్ ఎటాక్ రాకుండా ముందుగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అరికట్టవచ్చు. కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్ల వల్ల హార్ట్ ఎటాక్ రిస్క్ కి దూరంగా ఉండవచ్చు, ఆహారంలో, జీవనశైలిలో కొన్ని మార్పులు చోటు చేసుకోవడం వల్ల ప్రాణాంతకమైన హార్ట్ ఎటాక్ రాకుండా తమను తాము కాపాడుకునే వీలుంది. గుండెపోటు రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలివి.

జాగ్రత్తలు

ఆహారం కార్బోహైడ్రేట్ తక్కువ, ప్రోటీన్, నూనె తక్కువగా ఉండేలా చూసుకోవాలి. రోజువారీ వ్యాయామం తప్పనిసరి. వారంలో కనీసం ఐదు రోజుల పాటు రోజూ అరగంట నడకను అలవర్చుకోండి. ఎక్కువ సమయం కూర్చోవడాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి. ధూమపానం వదిలేయాలి. బరువును నియంత్రించాలి. రక్తపోటు మరియు చక్కెరను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తినడం అలవాటు చేసుకోవాలి. 30 ఏళ్ల వయస్సు, ఆ పైన ఉన్నట్లయితే ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి. పది పదిహేను నిమిషాల పాటు నిశ్శబ్దంగా, మీ శ్వాస మీద దృష్టి పెట్టి సమయాన్ని వెచ్చించండి. మీ జీవితంలో ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. . ప్రతిరోజూ రెండు కప్పుల పండ్లు, రెండున్నర లేదా మూడు కప్పుల కూరగాయలు తీసుకోవాలి. ఒక కప్పు సుమారు ఒక పెద్ద కప్పు మొక్కజొన్న, ఒక చిన్న యాపిల్ లేదా ఒక పెద్ద ఆరంజ్ తో సమానం మరియు రోజుకో అరటి పండు, వల్ల గుండె ధమనులు గట్టిపడటం తగ్గుతుంది. తద్వారా గుండె జబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోయే ముప్పు తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు.



కుర్ర జాగృతి
నర్స్ ఎడ్యుకేటర్, కాంటినెంటల్ హాస్పిటల్స్



సాధారణ కాన్పు (ప్రసవం)



వైద్యపరమైన జోక్యం లేకుండా జరిగే ప్రక్రియ సహజ ప్రసవం. సాధారణంగా 37 నుంచి 42 వారాల గర్భధారణ మధ్య సాధారణ ప్రసవం ప్రారంభమవుతుంది. సాధారణ ప్రసవానికి కొన్ని ప్రమాణాలివి. బిడ్డ తల భాగం తల్లి జనన స్థలం వైపు ఉండాలి. బిడ్డ పరిపక్వం కలిగి ఉండాలి. బిడ్డ జననం జనన స్థలం నుండి రావాలి. ఒక సహేతుకమైన సమయం లోపల బిడ్డ జననం, ఆకస్మికంగా తల్లి, బిడ్డలకు ఎలాంటి సమస్యలు ఉండకూడదు. పొద్దు లేదా నెలలు (టర్మ్) నిండిన తర్వాత ఈ ప్రమాణాలు కలిగి ఉంటే తల్లికి సుఖ ప్రసవం, సహజంగా, సాధారణంగా జరుగుతుంది. ఇలాంటి కాన్పు వల్ల ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుంది. తొందరగా కోలుకుంటారు. తల్లికి, బిడ్డకు ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉంటాయి. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి రొమ్ము పట్టవచ్చు. తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఎక్కువగా ఉంటుంది.

ప్రసవ దశలు నాలుగు

1. **మొదటి దశ** – గర్భాశయ ముఖ ద్వారం విప్పారటం, పది సెంటిమీటర్ల వరకు గర్భాశయ సంకోచాలు చురుకుగా క్రమ పద్ధతిలో వస్తుంటాయి. ఈ దశను క్రియాశీల దశ అంటారు.
2. **రెండవ దశ** – శిశువు జననం – ఈ దశ పది సెంటిమీటర్ల ముఖ ద్వారం విప్పారడటం నుండి శిశువు జన్మించే వరకు మొదటి కాన్పు తల్లికి ఒక గంట, మలి కాన్పు తల్లి అయితే అర్ధ గంట సమయం పడుతుంది.
3. **మూడవ దశ** – మాయా ప్రసవం – ఈ దశలో శిశువు జననం నుండి మాయ ప్రసవం వరకు జరిగే దశ. ఈ దశలో తొలిసారి గర్భవతి అయినా లేదా మలిసారి గర్భవతి అయినా సమయం 10 నుంచి 20 నిమిషాల్లో ప్రక్రియ జరుగుతుంది.
4. **నాలుగవ దశ** – శిశువు పుట్టినప్పటి నుండి ఆరు వారాల పాటు విస్తరించబడిన కాలం

(ఇంకా ఉంది.)



సల్వేర్ సుజాత
సంయుక్త కార్యదర్శి, సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా (సోమి), అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సోమాజీగూడ.



'లైవ్‌లో తెలుగు పాటలే పాడతాను'


కె.జె.ఏసుదాస్

లెజండరీ సింగర్ కె.జె.ఏసుదాస్ చాలా కాలం తర్వాత హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. జనవరి 20న హైదరాబాద్– శిల్పకళావేదికలో ఈ కాన్సర్ట్ జరగనుంది. ఈ సంగీత విభావరిలో ఏసుదాస్, విజయ్ ఏసుదాస్, కల్పన పాల్గొంటారు. కె.జె.ఏసుదాస్ మాట్లాడుతూ నేను క్రిష్టియన్ ఫ్యామిలీలో పుట్టినా సంస్కృతంలోని అక్షరాలను నేర్చుకోమని అమ్మ చెప్పారు. అది ఆమె నాకు అందించిన ఆశీర్వాదం. మరో ఆశీర్వాదం ఏమిటంటే.. నేను ఐదేళ్ళ వయసులో ఉన్నప్పుడు చదువు గురించి ఎలాంటి బెంగా పెట్టుకోవద్దు. నార్మల్‌గా చదువుకుంటే చాలు. కానీ, కర్నాటిక్ క్లాసికల్ మ్యూజిక్‌ని బాగా నేర్చుకోమని చెప్పారు. నా పాటలు వినేవారు, సంగీత ప్రియుల ప్రార్థనల వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. అంతకుమించి మరేం లేదు. నేను దాదాపు 10 సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేస్తున్నాను. మధ్యలో కొన్ని క్లాసికల్ పై దృష్టి సారించినా లైవ్ మ్యూజిక్ మాత్రం చాలా కాలం తర్వాత చేస్తున్నాను. నా బ్రదర్ అలేఖ్య హోమ్స్ శ్రీనాథ్ నన్ను లైవ్ మ్యూజిక్ చెయ్యమని చెప్పారు. హైదరాబాద్‌లో మళ్లీ ఈ కాన్సర్ట్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది. ఈ కాన్సర్ట్‌లో ప్రధానంగా తెలుగు పాటలు పాడతాము. అలాగే కొన్ని తమిళ్, హిందీ, మలయాళం పాటలు ఉంటాయి. మా నాన్నగారు చనిపోయేవరకు కూడా ఒక్కసారి కూడా నేను బాగా పాడుతున్నానని చెప్పలేదు. మన పిల్లల్ని మనమే అప్రిషియేట్ చెయ్యకూడదు. వాళ్ళకు వాళ్ళు ఎదగాలని అన్నారు.

మజ్ను.. అక్కినేని బ్రాండ్

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్పి పతాకంపై తొలిప్రేమ ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రాన్ని రిపబ్లిక్ డే కానుకగా జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమా టీజర్, పోస్టర్లకు చక్కని స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ ముఖ్య అతిధిగా 'మిస్టర్ మజ్ను' ట్రైలర్ రిలీజైంది. ఈ ప్రచార చిత్రానికి అద్భుత స్పందన వచ్చింది. అక్కినేని బ్రాండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని ట్రైలర్ చెబుతోంది. ఈ చిత్రంలో అఖిల్– నిధి రొమాన్స్ అక్కినేని అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. థమన్ సంగీతం, పాటలు, రీరికార్డింగ్ ఈ చిత్రాన్ని మరో లెవల్‌కి తీసుకెళ్లాయన్న ప్రశంసలు దక్కాయి. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: థమన్, పాటలు: శ్రీమణి, కెమెరా: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, కళ: అవినాష్ కొల్లా, డ్యాన్స్: శేఖర్, నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, కథ– కథనం– దర్శకత్వం: వెంకీ అట్లూరి.



అందరివాడు..

అఖిల్ తన టీమ్‌తో కలిసి ఎంతో జోవియల్‌గా చిత్రీకరణలో పాల్గొన్నారని చెబుతుంటారు. వ్యక్తిగత సిబ్బందితో అతడు ఎంతో సన్నిహితంగా ఉంటారు. ఇటీవలే తన సిబ్బందిలో మోసెస్ అనే యువకుని వివాహానికి అఖిల్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తూ.గో జిల్లా కడియంలో ఈ వివాహం జరిగింది.





ఎఫ్ 2 దర్శకుడితో..

పటాస్, రాజా ది గ్రేట్, సుప్రీం లాంటి బ్లాక్ బస్టర్లను తెరకెక్కించిన అనీల్ రావిపూడి తాజాగా ఋఎఫ్ 2ఋ చిత్రంతో మరో బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేష్, వరుణ్ తేజ్ లకు అదిరిపోయే బ్లాక్ బస్టర్ ని అందించాడు రావిపూడి. అందుకే ప్రస్తుతం ఈ నవతరం దర్శకుడిపై స్టార్ హీరోల్లోనూ ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అనీల్ రావిపూడి తదుపరి ప్రాజెక్టులపై టాలీవుడ్ లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే తనవద్ద బాలయ్య, మహేష్ కోసం స్క్రిప్టులు ఉన్నాయని అనీల్ రావిపూడి తెలిపారు. ఆ ఇద్దరికీ సీరియస్ గానే స్క్రిప్టులు ప్రిపేర్ చేస్తున్నాడు. అందులో మహేష్ కి ఓ అద్భుతమైన కథను వినిపించబోతున్నాడట. ప్రస్తుతం ఈ స్క్రిప్టు ప్రిపేరవుతోందని తెలుస్తోంది. మార్చి 4న శివరాత్రి కానుక మహర్షి కొత్త టీజర్ విడుదలవుతుంది. మహేష్ 25వ సినిమా మహర్షి తర్వాత 26వ సినిమా సుకుమార్ దర్శకత్వంలో ఉంటుంది. సుక్కూ స్క్రిప్టు రెడీ చేసి వినిపించేందుకు రెడీగా ఉన్నాడు. అటుపై 27వ సినిమా అనీల్ రావిపూడితో ఉంటుందా లేదా? అన్నది స్క్రిప్టు డిసైడ్ చేస్తుంది. ఇప్పటికి ఎఫ్ 2 సక్సెస్ ని అనీల్ రావిపూడి పూర్తిగా ఎంజాయ్ చేస్తున్నాడు.



నవ్వు విలువేంటో తెలిసింది!

విక్టరీ వెంకటేష్ తమన్నా, వరుణ్ తేజ్ మెహరీన్ నాయకానాయికలుగా దిల్‌రాజ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్ రావిపూడి దర్శకత్వంలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించిన చిత్రం ఎఫ్ 2. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అనేది ఉపశీర్షిక. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్ లో దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ –" ఈ సంక్రాంతికి ఎస్.వి.సి బ్యానర్‌లో మంచి సినిమా చేసే అవకాశం ఇచ్చిన దిల్‌రాజుకి, శిరీష్‌కి, లక్ష్మణ్‌కి థాంక్స్. స్క్రిప్ట్ దశ నుండి నాకు సపోర్ట్ చేసిన నా టీంకు థాంక్స్. తమ్మిరాజు ఎడిటింగ్‌లో ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. సమీర్ రెడ్డిగారు సినిమాను అద్భుతంగా, అందంగా చూపించారు. ఆర్ట్ డైరెక్టర్ ఎ.ఎస్.ప్రకాష్, ఫైట్ మాస్టర్ వెంకట్‌కి థాంక్స్. నటీనటుల విషయానికి వస్తే ప్రకాష్‌రాజ్‌కి, రాజేంద్రప్రసాద్‌కి, ప్రగతి, ఝాన్సీ, అన్నపూర్ణమ్మ ఇలా అందరూ లైఫ్ పెట్టి పనిచేశారు. తమన్నా, మెహరీన్లకు నా స్పెషల్ థాంక్స్. మంచి ట్యూన్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ ఇచ్చిన దేవిశ్రీ ప్రసాద్‌కి థాంక్స్. వెంకీ, వరుణ్ కామెడీ హైలైట్. తనతో మరచిపోలేని ప్రయాణం. ఇంకా మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాను. ఎన్నాళ్లు నుండి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో ఈ సినిమా సక్సెస్ చూస్తుంటే అర్థమవుతుంది. నాపై నమ్మకంతో సినిమా చేసినందుకు వెంకటేష్‌కి థాంక్స్. కామెడీ చేయడంలో వెంకటేష్‌కి మనం చెప్పేదేముండదు. ఆయనొక లైబ్రరీ. అందులో ఏరుకోవడమే. ఈ సినిమా కోసం ఆయన చాలా కష్టపడ్డారు. ప్రతి ఒక్కరి జీవితంలో నవ్వుకున్న ప్రాముఖ్యత ఏంటో అందరికీ తెలుసు. నవ్వును మేం ఇచ్చినందుకు మీరు నవ్వుతూ కలెక్షన్ల వర్షం కురిపించినందుకు థాంక్స్. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల్లో 30, 40 శాతం మాత్రమే నవ్వించాం. ఈ సినిమాలో వంద శాతం నవ్వించే ప్రయత్నం చేశాం. ఆ నవ్వు విలువేంటో ఈ సంక్రాంతికి తెలిసింది. నా లైఫ్లో ఈ సంక్రాంతి నవ్వుల సంక్రాంతి. జీవితాంతం గుర్తుండిపోయే సంక్రాంతి" అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ–"మా సినిమాకు ఎఫ్ 2 అనే టైటిల్ ని ప్రకటించి వీ 2 (వెంకటేష్, వరుణ్‌తేజ్)గా ఇద్దరు హీరోలు జాయిన్ అయ్యారు. సినిమా ఈ2(ఎంటర్టైన్మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్) అని మెసేజ్‌లు పెట్టారు. చివరకు బీ 2 (బొమ్మ బ్లాక్‌బస్టర్) అనేశారు. మా బ్యానర్లో ఇది 31వ సినిమా. ఇంత మంచి ఎంటర్టైన్మెంట్ మూవీ చేసిన అనీల్‌కు థాంక్స్. మా టీం అందరం ఎంజాయ్ చేస్తున్నాం. వెంకటేష్, వరుణ్ అద్భుతంగా చేశారు. అనీల్కు స్క్రిప్ట్ ప్రారంభం నుండి సపోర్ట్ చేస్తున్న సాయి, నారాయణ సహా అందరికీ థాంక్స్. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశ నుండి హిట్ అనే చెబుతూ వచ్చారు. సినిమా వెనుకాల చాలా మంది ఉన్నారు.నటీనటులు, టెక్నీషియన్లకు థాంక్స్. తొలి నుంచి సినిమా హిట్ అవుతుందనే అనుకున్నాం కానీ.. ఇంత పెద్ద హిట్ అవుతుందని అనుకోలేదు. కొంచెం నవ్విస్తే చాలు.. బ్రహ్మరథం పడతారని ప్రేక్షకులు నిరూపించారు. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో వెంకటేష్ 50 కోట్ల క్లబ్‌లో జాయిన్ అయ్యారు. ఫిదాతో వరుణ్ 50 కోట్ల క్లబ్‌లో జాయిన్ అయ్యారు. ఇద్దరికీ కలిపి ఈ సినిమా 50 కోట్ల సినిమా అయ్యింది. అనీల్ మూడు సక్సెస్ సినిమాలు చేశాడు. కానీ ఈ సినిమా సక్సెస్ కిక్ తనకు మరోలా ఉంది. ఇన్ని సినిమాల్లో మాకు ఎక్కువ లాభాలను తెచ్చి పెట్టిన సినిమా ఇదే అన్నారు. విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ –" హిట్, సూపర్‌హిట్ అనుకుంటే.. ప్రేక్షకులు సూపర్ డూపర్ హిట్ చేసేశారు. మనస్ఫూర్తిగా ప్రేక్షకుల కళ్లలో ఆనందం చూసినప్పుడు.. పదేళ్ల తర్వాత థియేటర్కు వెళ్లి అక్కడ ఆడియెన్స్ రెస్పాన్స్ చూసినప్పుడు.. నాకు మాత్రం కళ్లలో కన్నీళ్లు వచ్చేశాయి. మేం అందరం కష్టపడి పనిచేసినప్పుడు .. ప్రేక్షకులు బాగా ఆదరించినప్పుడు ఆ ఆనందమే వేరు. నాకు గణేష్, ప్రేమించుకుందాం రా, బొబ్బిలిరాజా, నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి ఇలా చాలా సినిమాలను నాకు సక్సెస్ చేశారు. చాలా ఏళ్ల తర్వాత ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. మీరు మళ్లీ ఎంటర్టైన్మెంట్ సినిమా చేయాలి. ఆడియెన్స్ మిమ్మల్ని అలా చూడాలనుకుంటున్నారని చెప్పినప్పుడు ఆనందమేసి అటెంప్ట్ చేశాను" అన్నారు.

నీడతోనే యుద్ధం చేస్తే?



మనిషి శత్రువుతో యుద్ధం చేస్తే గెలుస్తాడు.. కానీ తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే.. ఎలా ఉంటుందో ఆలోచించండి.. అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుడు ఎలా బయటపడ్డాడు. ఎలా సక్సెస్ అయ్యాడు అనేది తెలుసుకోవాలంటే 'నిను వీడని నీడను నేనే' సినిమా చూడాల్సిందే అంటున్నారు యువ కథానాయకుడు సందీప్ కిషన్. ఈ హీరో నటిస్తోన్న ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని కథాంశంతో రాబోతున్న చిత్రమిది. దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ "ఒక కొత్త పాయింట్ తీసుకుని ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్ కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని డిఫరెంట్ పాయింట్‌తో, హై టెక్నికల్ వేల్యూస్‌తో సినిమాను రూపొందిస్తున్నాం. సందీప్ కిషన్ తొలిసారి నటిస్తోన్న హారర్ చిత్రమిది. మనిషి శత్రువుతో యుద్ధం చేస్తాడు కానీ.. మనిషి తన నీడతోనే యుద్ధం చేయాల్సిన పరిస్థితి వస్తే ఎలా ఎదుర్కొన్నాడనేదే పాయింట్. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. హీరో హీరోయిన్ ల పై కొన్ని కీలక సన్నివేశాలు ఒక ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరించనున్నారు దీంతో సినిమా పూర్తవుతుంది" అన్నారు. నిర్మాత దయా పన్నెం మాట్లాడుతూ "తుది షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఫిబ్రవరిలో సినిమా రిలీజ్ చేస్తాం" అన్నారు.



సిస్టర్స్ టాప్ సీక్రెట్ లీక్



ప్రియాంక చోప్రా– పరిణీతి చోప్రా సిస్టర్స్ అన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రియాంక చోప్రా విదేశీ ప్రేమికుడు నిక్ జోనాస్ ని పెళ్లాడి అమెరికాలో స్థిరపడుతోంది. ఈ పెళ్లి ఆద్యంతం పారి (పరిణీతి) హంగామా గురించి తెలిసిందే. బావ నిక్ జోనాస్‌ని ఈ భామ బాగానే ఏడిపించింది. ఇక అందచందాల్లోనూ పారి అక్కతో పోటీపడుతోంది. ఇక ఈ సిస్టర్స్ ఇంత అందాన్ని ఎలా మెయింటెయిన్ చేయగలరు? అంటూ ఇటీవలే పీసీ మాతృమూర్తి మధు చోప్రాకు ఓ ప్రశ్న ఎదురైందిట. ప్రియాంక చోప్రా తనని తాను మిస్ యూనివర్సల్, గ్లోబల్ స్టార్‌గా ఆవిష్కరించుకునేందుకు అందం, ఆరోగ్య ం పరంగా ఎంతో జాగ్రత్త తీసుకుంది. అందుకు కారణం వయసు 30 దాటినా ఇప్పటికీ చిన్ననాటి నుంచి ఉన్న కొన్ని అలవాట్లను కొనసాగిస్తోంది. నిరంతర వ్యాయామం, యోగాతో పాటు ఆహారం ఎంతో ముఖ్యం. ఇందులో పప్పు దినుసులతో పాటు, బాదం, నట్స్ వంటివి తినడం మితాహారం కారణమని.. సిస్టర్స్‌కి సంబంధించిన టాప్ సీక్రెట్ లీక్ చేశారు. ఆందం, ఆరోగ్యాన్ని కాపాడే పుష్కలమైన లక్షణాలు బాదాం పప్పులో ఉన్నాయి. సుగర్ వ్యాధుల్ని, గుండె జబ్బుల్ని నివారించే గుణాలు ఆల్మ ండ్స్ బాదంలో ఉన్నాయి...పీసీ వాటిని విరివిగా తీసుకుంటుంది. ఈ అలవాటు చిన్నప్పటి నుంచి నాకు కూడా ఉంది. దానిని పీసీ – పరిణీతి అనుసరిస్తారని మధు చోప్రా తెలిపారు. పరిణీతి ప్రస్తుతం అక్షయ్ కుమార్ సరసన కేసరి అనే చిత్రంలో నటిస్తోంది. సందీప్ ఔర్ పింకీ ఫరార్, జబారియా జోడి వంటి చిత్రల్లోనూ నాయికగా నటిస్తోంది. ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లో ఏ కిడ్ లైక్ జేక్ చిత్రంలో నటిస్తోంది. తాజాగా అక్కచెల్లెళ్లు ఇద్దరూ కలిసి దిగిన ఓ ఫోటోని పరిణీతి స్వయంగా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.

మహాలక్ష్మి చిలిపితనం

మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా ప్రస్తుతం క్వీన్ రీమేక్ 'దటీజ్ మహాలక్ష్మి'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఫస్ట్ లుక్ ఇప్పటికే ఆకట్టుకుంది. ఈ చిత్రంలో తమన్నా పదహారణాల తెలుగమ్మాయి పాత్రలో నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని యూనిట్ చెబుతోంది. అమాయకంగా ఉండే ఓ అమ్మాయి.. జీవితంలో ఎదురైన కొన్ని సంఘటనల వల్ల ఎలా శక్తివంతమైన మహిళగా మారుతుంది? అనేదే ఈ సినిమా కథాంశం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర పనులు సాగుతున్నాయి. త్వరలోనే అన్నిపనులు పూర్తి చేసి రిలీజ్ చేయనున్నారు. మైఖెల్ ట్యాబ్యురియస్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. టైజాన్ సినిమాను సమర్పిస్తున్నారు. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్ పై మను కుమరన్ ప్రొడక్షన్ నిర్మిస్తోంది.

ఎస్వీఆర్ నాకు స్ఫూర్తి


- సీనియర్ నరేష్

విలక్షణత.. వైవిధ్యం.. కొత్త కాన్సెప్టులు నెగ్గుకొస్తాయని ధీమాగా చెప్పే నటుడు సీనియర్ నరేష్. నవ్యపంథా స్క్రిప్టుల్ని.. నవతరం దర్శకులను ఎంకరేజ్ చేస్తూ.. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారాయన. సహాయనటుడిగా వైవిధ్యమైన పాత్రలను పోషిస్తూ నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న ఆయన పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ముచ్చటించారు.

నా ప్రాధాన్యతలివే..

కెరీర్‌లో జయాపయాలు కామన్. నాటి ఎన్టీఆర్ నుండి నేటి హీరోలు ఎవరికైనా గెలుపోటములు ఎదురవుతుంటాయి. ఐదారేళ్ల క్రితం మంచి హిట్ రాదా? అని అనుకున్న రోజులున్నాయి. అయితే నాలుగైదేళ్లుగా దృశ్యం సినిమా నుండి వరుసగా మంచి సినిమాలు వస్తున్నాయి. మంచి సినిమాలు, పాత్రలకు ప్రాధాన్యం ఇచ్చి సినిమాలు చేస్తున్నాను. సక్సెస్ రేట్ పెరుగుతోంది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వచ్చినప్పుడు ఎస్.వి.రంగరావుగారిని దృష్టిలో పెట్టుకున్నాను. ఓ తెలుగు నటుడు ఏ పాత్ర అయినా చేయగలడు.. అన్న ధీమా వచ్చింది. ఒకే జోనర్‌కి పరిమితం కాకుండా అన్నీ సినిమాలు చేయాలనుకున్నాను. నాకు వచ్చిన పాత్రలన్నీ అలా విభిన్నమైనవే వచ్చాయి. గత ఏడాది తెలుగు సినిమాకు వచ్చిన 10– 12 హిట్ చిత్రాల్లో 8 చిత్రాల్లో నేను నటించాను. మంచి పాత్రలు చేశాను. నాపై దర్శకులు, నిర్మాతలు పెట్టుకున్న నమ్మకం అది. శతమానం భవతి, రంగస్థలం, మహానటి, దేవదాస్, తొలిప్రేమ ఇలా మంచి మంచి సినిమాల్లో మంచి పాత్రల్లో నటించాను. సమ్మోహనం నాకు చాలా మంచి పేరు తెచ్చింది. అలాగే అరవింద సమేత వంటి సీరియస్ చిత్రంలో కామెడీ పార్ట్ నా పాత్రనే నడిపించింది. శైలజారెడ్డి అల్లుడులో మంచి పాత్ర చేశాను. 2018 నటుడిగా నా కెరీర్‌లో ఉత్తమమైనది. త్రివిక్రమ్, సుకుమార్ వంటి దర్శకులతో పాటు వెంకీ అట్లూరి, వెంకీ కుడుముల, నాగాశ్విన్ .. వంటి యువ దర్శకులు కూడా నాకు మంచి ప్రాధాన్యమున్న పాత్రలను ఇచ్చారు.

వివాదాలు వద్దే వద్దు

47 ఏళ్ల నటుడిగా ఎంతో అనుభవం వచ్చింది. క్రమశిక్షణతో పాటు, ఎటువంటి వివాదాల జోలికి వెళ్లకపోవడం అనేవి నటుడిగా నా సక్సెస్‌కు కారణమని భావిస్తున్నాను. పారితోషికం, ఇతర అంశాల కంటే మంచి సినిమా, మంచి పాత్ర పోషించడం.. వచ్చిన అవకాశానికి పూర్తి న్యాయం చేయడం, చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉండడం నా విధి..

వెబ్ సిరీస్‌లకు ఓకే

కెరీర్‌లో నెలకు 29రోజులు పనిచేసిన రోజులున్నాయి. సినిమా, టీవీతో పాటు, వెబ్ సిరీస్‌లో కూడా నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. మంచి వెబ్ సిరీస్ ఎంచుకుని అందులో నటిస్తాను. ఇకపై కొంచెం సెలక్టివ్‌గా మంచి పాత్రలను ఎంచుకుంటున్నాను. ఈ ఏడాది కూడా మంచి పాత్రలతోనే స్టార్ట్ అయ్యింది. మల్లి జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ హీరోగా చేస్తున్న సినిమాలో నటిస్తున్నాను. అలాగే ఫణిరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. వీటితో పాటు మరో ఆరు సినిమాలు మాటల్లో ఉన్నాయి.

2019 కలిసొస్తుంది

ఒకప్పుడు మనం ఇతర భాషల రీమేక్ల కోసం వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఇతర భాషల వాళ్లు మన రీమేక్‌ల కోసం వస్తున్నారు. ఇది తెలుగు సినిమాకు పెద్ద వరం. ఎందుకంటే కొత్త ఆలోచనలున్న కొత్త తరం దర్శకులు చాలా మంది ఇండస్ట్రీలోకి వస్తున్నారు. 2019 కూడా తెలుగు ఇండస్ట్రీకి చాలా బాగుంటుంది.



గేమర్ సస్పెన్స్.. థ్రిల్

బి.జి.వేంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం గేమర్. శ్రనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ–" ట్రైలర్ అద్భుతంగా ఉంది. తడకల రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ఈ సినిమా తీశారు. మంచి డాన్సులు, వినోదం, సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్ అన్నింటితో ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా చేశాడు రాజేష్. ఇలాంటి చిన్న సినిమాల దర్శకనిర్మాతలను ప్రోత్సహించే భాధ్యత ప్రభుత్వం పైనా, సమాజం పైనా ఉంది. ఎందుకంటే వీళ్ళందరికి థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శకనిర్మాతలను ఎంకరేజ్ చేయాలి. తద్వారా గ్రామాల్లో ఉన్న టాలెంట్ కు అవకాశాలు దక్కుతాయి. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది అనిపిస్తోంది. నాయకానాయికలు శ్రనిత్ రాజ్, కల్యాణికి దర్శకనిర్మాత రాజేష్ కు శుభాకాంక్షలు" అన్నారు. దర్శకనిర్మాత రాజేష్ మాట్లాడుతూ "సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయిన ఈ సినిమాను ఫిబ్రవరి 1న విడుదల చేస్తున్నాం" అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అనిరుద్, నరేందర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ రాణికి అరుదైన గౌరవం



స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీభాయ్ బయోపిక్ 'మణికర్ణిక' ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీలో రిలీజవుతున్న సంగతి తెలిసిందే. రిలీజ్‌కి వారం ముందే దేశ ప్రథమపౌరుడు రామ్ నాథ్ కోవింద్ ఏరికోరి ఓ ప్రత్యేక షోని వీక్షించడం విశేషం. డిల్లీ రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన స్పెషల్ షోలో రాష్ట్రపతి రామ్ నాథ్, భాజపా సీనియర్ నాయకుడు ఎల్.కె.అద్వానీ, క్వీన్ కంగన, మణికర్ణిక రచయిత విజయేంద్ర ప్రసాద్, ప్రసూన్ జోషి తదితరులు ఉన్నారు. ప్రివ్యూ అనంతరం కంగనను, మణికర్ణిక చిత్రబృందాన్ని రామ్ నాథ్ స్వయంగా సన్మానించారు. ఇది అరుదైన అవకాశం. కంగనకు మాత్రమే ఆ అదృష్టం దక్కడాన్ని ప్రశంసించాల్సిందే. మణికర్ణిక ట్రైలర్ ఇప్పటికే అంతర్జాలంలో దూసుకెళుతోంది. ట్రైలర్ నచ్చింది. సినిమాలో కంటెంట్ అంతే ఇంట్రెస్టింగ్ గా ఉంటుందని అంచనా వేస్తున్నారు. మణికర్ణిక వారియర్ క్వీన్ ఎమోషనల్ లైఫ్ జర్నీ కాబట్టి తెలుసుకోవాలన్న ఆసక్తి యువతరంలో ఉంది. అందుకే సినిమాలు చూసే టైమ్ లేకపోయినా.. రాష్ట్రపతి అంతటి వారు స్వయంగా పిలిపించుకుని మరీ ఈ షోని వీక్షించడం విశేషం.

కొబ్బరితో కంటిచూపు మెరుగు..

పచ్చికొబ్బరిని తిన్నా, చట్నీ చేసినా చాలా రుచిగా ఉంటుంది. శరీరానికి శక్తిని అందిస్తుంది. దీనిలోని పోషకాలు అవయవాలు చురుగ్గా పనిచేసేలా చేస్తాయి. కొబ్బరిలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. ఇది కొవ్వును కరిగించి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. కొబ్బరిలో విటమిన్ ఎ, బి, సి, నియాసిన్, క్యాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఐరన్ వంటి ఖనిజాలు అధిక మోతాదులో లభిస్తాయి.

కొబ్బరిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని అందులో కొద్దిగా పటిక బెల్లం, చక్కెర, నానబెట్టిన పెసరపప్పు వేసి తీసుకుంటే చాలా రుచిగా ఉంటుంది. ఈ మిశ్రమం కంటి చూపుకు చాలా మంచిది. రోజూ కొబ్బరి తీసుకోకపోయిన కనీసం వారంలో రెండు లేదా మూడుసార్లు సేవిస్తే ఫలితం ఉంటుంది.

తరచు కొబ్బరి తీసుకుంటే మలబద్ధకం, థైరాయిడ్ సమస్యలు దరిచేరవు. కొబ్బరి శరీరంలోని నీటిశాతాన్ని కోల్పోకుండా చేస్తుంది. శరీరానికి హాని చేసే చెడు కొలెస్ట్రాల్‌న్ని తగ్గిస్తుంది. కొబ్బరిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతాయి. దెబ్బతిన్న కణాలను వృద్ధి చేయడంలో కొబ్బరిది కీలకపాత్ర.



చేతులెత్తితే చిరాకే..!

ప్రస్తుతం అటు మహిళల్లో కానీ, అబ్బాయిల్లో కానీ నిత్యం తలెత్తే సమస్య బాహుమూలాల్లో అతిగా పెరిగే అవాంఛిత రోమాలు. దీని వల్ల నలుగురిలో నానా ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారు కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

ట్రెండీ స్లీవ్ లెస్ డ్రెసెస్‌ని ధరించాలనుకున్నప్పుడు అండర్ ఆర్మ్ హెయిర్‌తో ఇబ్బందిగా అనిపిస్తుంది. ఏ కాలంలో అయినా స్లీవ్‌లెస్‌లు ధరించాలనుకునే వారికి అండర్ ఆర్మ్స్‌లో హెయిర్ చికాకు కలిగిస్తుంది. అండర్ ఆర్మ్స్‌లో అన్ వాంటెడ్ హెయిర్ గ్రోత్ లేనప్పుడు ట్రెండీ డ్రెస్‌లను నిశ్చింతగా వేసుకోవచ్చు. అండర్ ఆర్మ్స్‌లో అన్ వాంటెడ్ హెయిర్‌తో ఇబ్బందిపడుతున్నట్టయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా హెయిర్ నుంచి ఉపశమనం పొందుతారు. అండర్ ఆర్మ్స్ నీట్‌గా ఉండడం చేత శరీర దుర్వాసన కూడా తగ్గుముఖం పడుతుంది. అయితే, అండర్ ఆర్మ్స్ వద్ద హెయిర్‌ను తొలగించేందుకు మీరు ఖరీదైన ప్రోడక్ట్స్‌ను వాడనవసరం లేదు. అలాగనీ స్పాను సందర్శించనవసరం లేదు. ఈ రెండూ మీ పర్సు ఖాళీ చేసే అవకాశం ఉంది. ఒకవేళ మార్కెట్‌లో లభ్యమయ్యే హెయిర్ రిమూవల్ క్రీమ్‌ను కొనాలనుకున్నా లేదా పార్లర్‌లో హెయిర్‌ను వ్యాక్సింగ్ చేయించుకోవాలనుకున్నా వాటికి ఎంతో కొంత డబ్బును ఖర్చు చేయాలి. డబ్బును ఖర్చు చేసే బదులు, సులభంగా ఇంటివద్దే ఈ సమస్యకు పరిష్కార మార్గాన్ని ఎంచుకోవచ్చు. స్పా ట్రీట్మెంట్స్‌తో పాటు మార్కెట్‌లో లభ్యమయ్యే ట్రీట్‌మెంట్స్ కేవలం హెయిర్ రిమూవల్‌కి మాత్రమే తోడ్పడతాయి. అంతే కానీ, హెయిర్ గ్రోత్‌ను అరికట్టవు. అదే సహజ పద్ధతులతో ఈ హెయిర్ గ్రోత్‌ను అరికట్టవచ్చు.

అండర్ ఆర్మ్స్ శుభ్రంగా...

పసుపును హెయిర్ రిమూవర్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు. ఎందుకంటే, ఇది యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కలిగి ఉండటంతో పాటు అన్ వాంటెడ్ హెయిర్‌ను తొలగించి ఆ ప్రదేశాలలో హెయిర్ గ్రోత్‌ను అరికడుతుంది. పసుపును పేస్ట్‌లా మార్చుకుని హెయిర్ రిమూవర్‌కి వాడాలి. స్కిన్‌కి పసుపు పేస్ట్‌ని అప్లై చేయగానే ఇది తేలికపాటి గ్లూలా పనిచేస్తుంది. దీన్ని అప్లై హెయిర్ కూడా మూలాల నుంచి తొలగిపోతుంది. ఈ పద్ధతిని తరచూ పాటిస్తే హెయిర్ వెంట్రుకలు మెత్తబడి క్రమంగా రాలిపోతాయి.

హెయిర్‌ని తీసేందుకు పసుపు వినియోగం..

పసుపు, పాలు ప్యాక్

కావలసిన పదార్థాలు: 3 టీస్పూన్ల పసుపు, ఒక టీస్పూన్ పాలు.

వాడే విధానం:

- మూడు టీస్పూన్ల సేంద్రీయ పసుపు పొడిని ఒక టీస్పూన్ పాలతో కలిపి చిక్కటి పేస్ట్‌ను తయారు చేయాలి.
- ఈ పేస్ట్‌ను హెయిర్ గ్రోత్ ఉండే ప్రదేశంలో పూయాలి. హెయిర్ గ్రోత్ డైరెక్షన్‌లోనే ఈ పేస్ట్‌ను అప్లై చేయాలి.
- ఇరవై నిమిషాల పాటు లేదా ఈ పేస్ట్ ఆరేవరకు ఉంచాలి.
- తరువాత, శుభ్రమైన పొడిబట్టను తీసుకుని హెయిర్‌ను స్క్రబ్ చేసుకుంటూ హెయిర్ గ్రోత్‌కు అపోజిట్ డైరెక్షన్ లోంచి హెయిర్‌ను, సున్నితంగా తొలగించుకోవచ్చు.
- ఈ టర్మరిక్ పేస్ట్‌ను తరచూ వాడటం వలన హెయిర్ గ్రోత్ ఆగిపోతుంది. మళ్ళీ హెయిర్ పెరగడానికి చాలా సమయం పడుతుంది. అందువలన, ఈ పేస్ట్‌ను క్రమం తప్పకుండా వాడటం వల్ల హెయిర్ గ్రోతింగ్ ఆగిపోతుంది.

పసుపు, పాలు, శనగపిండి ప్యాక్:

కావలసిన పదార్థాలు:

అర కప్పు చల్లటి పాలు, అర కప్పు శనగపిండి, రెండు టేబుల్ స్పూన్ల పసుపు, ఒక టేబుల్ స్పూన్ ఉప్పు.

వాడే విధానం:

- ఈ పదార్థాలన్నింటినీ పాత్రలో తీసుకుని పేస్ట్‌లా తయారుచేసుకోవాలి.
- దీనిని ఎక్కువగా వెంట్రుకలు ఉన్న చోట ప్రభా అప్లై చేసుకోవాలి.
- ఇరవై నిమిషాల పాటు అలాగే ఉంచాలి.
- గోరువెచ్చటి నీటితో రిన్స్ చేయాలి. ఆ తరువాత శుభ్రమైన టవల్‌తో తుడిచేయాలి.

ఫలితానికి సమయం...

ఈ రెసిపీ సింపుల్ అలాగే సురక్షితమైనది కూడా. ఇది హెయిర్‌ను శాశ్వతంగా తొలగించేందుకు తోడ్పడుతుంది. అలాగే ఆపేందుకు కూడా తోడ్పడుతుంది. అందుకు దీనిని కనీసం పది సార్లు క్రమం తప్పకుండా వాడాలి. అప్పుడే ఫలితాన్ని చూపించడం ప్రారంభిస్తుంది. ఆ తరువాత ఈ ప్యాక్‌ను ఉపయోగించే ఫ్రీక్వెన్సీను తగ్గించుకోవచ్చు. పసుపు ఫైన్ హెయిర్‌ను సులభంగా తొలగించగలదు. అదే సమయంలో దట్టమైన హెయిర్‌ను తొలగిస్తుంది. దట్టమైన హెయిర్‌ను తొలగించేందుకు శనగపిండిలో పసుపును కలిపి ప్యాక్ ను తయారుచేసుకోవాలి. ఓట్స్, పాలు వంటి వాటిని కూడా కలపవచ్చు. పసుపుతో ఇతర మరకలు ఏవైనా ఏర్పడినా భయపడక్కర్లేదు. అవే తొలగిపోతాయి.

పసుపు వలన ఏర్పడిన ఎల్లో స్టైయిన్స్‌ను తీసేసేందుకు పాలలో దూదిని ముంచి ఆ ప్లేస్‌లో రుద్దాలి.

హెయిర్ రిమూవింగ్‌లో పాటించాల్సిన జాగ్రత్తలు..



ఆర్మ్స్ శరీరంలోని సున్నితమైన భాగం. అందువలన, హెయిర్ రిమూవల్ మెథడ్‌లో సరైనా దానిని ఎంచుకోవాలి.

- ఈ ప్యాక్‌ను వాడే ముందు స్కిన్ పై 24 గంటల ముందుగా ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలి. చర్మానికి ఈ ప్యాక్ సరిపడుతుందో లేదో తెలుసుకోవాలి.
- ప్రభావిత ప్రాంతాన్ని నీటితో శుభ్రపరచుకొని ఆరబెట్టి ప్రాసెస్‌ను ప్రారంభించాలి.
- హెయిర్ రిమూవల్ తరువాత చర్మం ఎర్రబడటం, బొబ్బలు వంటివి గమనిస్తే ఐస్ క్యూబ్స్‌ను వాడొచ్చు.
- స్కిన్‌తో ఇబ్బందిని తగ్గించుకునేందుకు హెయిర్ రిమూవల్ తరువాత వదులైన కాటన్ వస్త్రాలను ధరించాలి.
- ఎండలో ఎక్కువసేపు ఉన్నట్టయితే కనీసం 24 గంటల బ్రేక్ తీసుకున్న తరువాత హెయిర్ రిమూవల్ ప్రాసెస్‌ను స్టార్ట్ చేయాలి. లేదంటే, స్కిన్ ఇరిటేషన్‌కు గురవవచ్చు.
- స్కిన్ ఇరిటేషన్‌కు గురయిన చోట హెయిర్‌ను రిమూవ్ చేయడానికి ప్రయత్నించవద్దు.

మాటే మంత్రం..




కోరికలు మితంగా ఉంటే..
బాధలూ తక్కువగానే ఉంటాయి.

చలిగింతల్లోనూ ఫ్యాషనే...



సంక్రాంతి సంబరంలో ఎంత మురిసినా... ఆ సంతోషంలో చలిని కూడా ఆస్వాదించాల్సిందే మరి. ప్రకృతి దాని పని అది చేస్తూనే ఉంటుంది. పగలంతా వేడిగా ఉన్నా, సాయంత్రం అయ్యేసరికి చలికి ఒళ్లంతా బిగుసుకుపోతుంది. ఉదయం ఏడు గంటల దాకా ఇదే తంతు. ఇలాంటి చలికి వేడినిచ్చే స్వెట్టర్స్ తప్పకుండా ఉండాల్సిందే! ఫ్యాషన్ ఎప్పటి వరకు అనేది అంతుచిక్కని ప్రశ్న. అలాగే ఈ స్వెట్టర్స్‌లోనూ ట్రెండ్స్ మొదలయ్యాయి. మునుపులా డల్ కలర్స్ కాకుండా, బ్రైట్ కలర్స్, వెరైటీ కాలర్స్, డిఫరెంట్ బటన్స్‌తో అబ్బాయిల స్టైల్‌కు తగ్గట్టుగా ఆన్‌లైన్‌లలో, మార్కెట్లలో హంగామా చేస్తున్నాయి. ఫ్యాషన్ అనేది అమ్మాయిలకే కాదండోయ్ అబ్బాయిలకూ ఉంటుందని ఈ డిజైనింగ్ స్వెటర్స్ చూస్తే మీకే అర్థమవుతుంది. డిజైన్‌ను బట్టి, వస్త్ర నాణ్యతను బట్టి ధర కేటాయిస్తున్నారు డిజైనర్లు. మరి ఇంకెందుకు ఇప్పటికైనా ఈ కొత్తరకం పోకడను అనుసరించి, కొత్తగా కనిపించండి.







తెలుగువాణ్ణి తిండిలో కొట్టగలరా ?

షేర్ చేసుకుందాం..!



మినపట్టు
పెసరట్టు
రవ్వట్టు
పేపర్ దోసె
మసాల దోసె
ఉల్లి దోసె
కొబ్బరి అట్టు
గోధుమ అట్టు
అటుకుల అట్టు
సగ్గుబియ్యం అట్టు
బియ్యపు పిండి అట్లు
పుల్లట్టు
ఊతప్పం
పులి బొంగరం
ఉప్మా అట్టు
రాగి దోసె
చీజ్ పాలక్ దోసె
ఇడ్లీ
మసాల ఇడ్లీ
రవ్వ ఇడ్లీ
ఆవిరి కుడుము
సాంబారు ఇడ్లి
బొంబాయి రవ్వ ఉప్మా
గోధుమ రవ్వ ఉప్మా
సేమ్యా ఉప్మా
టమోటా బాత్
ఇడ్లీ ఉప్మా
బియ్యపు రవ్వ ఉప్మా
నూకలుప్మా
మరమరాల ఉప్మా
కొబ్బరి ఉప్మా
ఉప్పిడి పిండి
పూరి
చపాతి
వడ
సాంబారు వడ
పప్పు పొంగలి
కంచి పులిహోర
నిమ్మ పులిహోర
కొబ్బరి అన్నం
పుదీనా పులావ్
బిర్యాని
దధ్యోదనం
చక్రపొంగలి
కట్టుపొంగలి
వెజ్ ఫ్రైడ్ రైస్
జీరా రైస్
పులగం
ఉల్లిపాయ చట్నీ
ఎండుమిరపకాయ చట్నీ
కొబ్బరి చట్నీ
మినప చట్నీ
వేరుశనగపప్పు చట్నీ
శనగపప్పు చట్నీ
శనగపిండి చట్నీ (బొంబాయిచట్నీ)
శనగపప్పు పొడి
ధనియాల పొడి
కొబ్బరి పొడి
వెల్లుల్లిపాయ కారప్పొడి
కరివేపాకు పొడి
కందిపొడి
మునగాకు చట్నీ
గుమ్మడి చట్నీ
అటుకుల పులిహార
చింతపండు పులిహార
నిమ్మకాయ పులిహార
మామిడికాయ పులిహార
రవ్వ పులిహార
సేమ్యా పులిహార
ఆలు పరోట
చపాతి
పరోట
పుల్కా
పూరి
రుమాల్ రోటీ
కాలీఫ్లవర్ పరోటాలు
పాలక్ పన్నీర్
కొత్తరకం పూరీలు
ముద్దపప్పు
దోసకాయ పప్పు
బీరకాయ పప్పు
టమోటా పప్పు
మామిడి కాయ పప్పు
తోటకూర పప్పు
గుమ్మడి పప్పు
చింత చిగురు పప్పు
కంది పచ్చడి
కొబ్బరి పచ్చడి
క్యాబేజి పచ్చడి
క్యారెట్ పచ్చడి
దొండకాయ పచ్చడి
దోసకాయ పచ్చడి
బీరకాయ తొక్కు పచ్చడి
బెండకాయ పచ్చడి
మామిడికాయ పచ్చడి
వంకాయ పచ్చడి
వెలక్కాయ పచ్చడి
టమోటా పచ్చడి
మెంతికూర పచ్చడి
పొట్లకాయ పెరుగు పచ్చడి
బీరకాయ పచ్చడి
సాంబారు
సాంబారు పొడి
పులుసు (తీపి)
పొట్ల కాయ పులుసు
సొరకాయ పులుసు
మజ్జిగ పులుసు
పప్పు పులుసు
ఉల్లిపాయ పకోడి
క్యాబేజి పకోడి
గోధుమ పిండి పకోడి
పాలక్ పకోడి (పాలకూర పకోడి)
బియ్యపు పిండి పకోడి
మసాల పకోడి
మెత్తటి పకోడి
బ్రెడ్ పకోడి
పల్లీ పకోడీలు
సేమ్యా పకోడి
కాలీఫ్లవర్ పకోడి
ఆలూ పకోడి
ఖాండ్వీ
అటుకుల పోణీ
అప్పడం బజ్జి
అరిటికాయ బజ్జి
ఉల్లిపాయ బజ్జి
టమటా బజ్జి
బంగాళదుంప బజ్జి
బీరకాయ బజ్జి
బ్రెడ్ బజ్జి
మిరపకాయ బజ్జి
వంకాయ బజ్జి
క్యాప్సికమ్ బజ్జి
కొర్ర బజ్జీ
గుమ్మడికాయ బజ్జీలు
దోసకాయ బజ్జి
గుంట పునుగులు
పునుగులు
మైసూర్ బోండ
సాగో బోండాస్ (సగ్గుబియ్యం పునుగులు)
మసాల గారె
నేతి గారె
పప్పు వడ
మసాల వడ
వెజిటబుల్ వడ
పెసర గారెలు
మినపచెక్క వడలు
సగ్గుబియ్యం బోండా
బఠాణీ బోండా
పచ్చి బఠానీ బోండాలు
మామిడి అల్లం పచ్చడి (అల్లంపచ్చడి)
ఉసిరి ఆవకాయ
ఉసిరికాయ పచ్చడి
కాకరకాయ పచ్చడి
కొత్తిమీర పచ్చడి
గోంగూర పచ్చడి
చింతకాయ పచ్చడి
టమోటా పచ్చడి
దబ్బకాయ ఊరగాయ
పండు మిరపకాయల పచ్చడి
మామిడికాయ ఆవకాయ
మామిడికాయ తురుంపచ్చడి
మామిడికాయ (మాగాయ)
ముక్కల పచ్చడి
మునక్కాయ ఆవకాయ
పెసర ఆవకాయ
కాలీఫ్లవర్ పచ్చడి
చిలగడదుంపల పచ్చడి
క్యాబేజీ ఊరగాయ
వంకాయ పచ్చడి
నిమ్మకాయ ఊరగాయ
వెల్లుల్లి పచ్చడి
కాజాలు
బూంది
చక్రాలు
కారప్పూస
చెగోడి
చెక్కలు
తపాళ చెక్కలు
పెసర చెక్కలు
చెక్క పకోడి
పెరుగు చక్రాలు
సగ్గుబియ్యం చక్రాలు
శనగపప్పు చక్రాలు
వాంపూస
గవ్వలు
ఆలూ చిప్స్
బనానా చిప్స్
మసాల బీన్స్
కారం చెక్కలు
అలూతో చక్రాలు
కొబ్బరి చెక్కలు
జొన్న మురుకులు
మైదా కారా (మైదాచిప్స్)
వెన్న ఉండలు
పన్నీర్ చట్ పట్
సోయా సమోస, సమోస
చిలకడ దుంప చిప్స్
కాకరకాయ చిప్స్
జంతికలు
గుమ్మడి వరుగు (చిప్స్)
అరిసెలు
బూరెలు
కొబ్బరి బూరెలు
పచ్చి బూరెలు
తైదు
బూరెలు
మైదాపిండితో
పాల బూరెలు
సజ్జ బూరెలు
గోధుమ బూరెలు
చలిమిడి
కొబ్బరి పూర్ణాలు
గోధుమ పిండితో పూర్ణాలు
పూతరేకులు
జొన్న బూరెలు
బూంది లడ్డు
రవ్వ లడ్డు
తొక్కుడు లడ్డు
మినప ముద్దలు
సున్నుండలు
బాదుషా
మడత కాజా
తీపి కాజాలు
మైసుర్ పాకు
జాంగ్రి
పూస మిఠాయి
కోవా
కజ్జి కాయలు
తీపి గవ్వలు
జీడిపప్పు పాకం
శనగపప్పు పాకం
వేరుశనగపప్పు ముద్దలు
మరమరాల ముద్దలు
డ్రైఫ్రూట్స్ హల్వా
నువ్వుల లడ్డు (చిమ్మిరిముద్ద)
కోవా కజ్జికాయ
మిల్క్ మైసూర్ పాక్
కాజు క్యారెట్
బటర్ బర్ఫీ
కిస్మిస్ కలాకండ్
బూంది మిఠాయి
పాపిడి
చాంద్ బిస్కట్స్
ఖర్జూరం స్వీట్
సేమ్యాతో అరిసెలు
కొబ్బరి ఖర్జూరం
బాదంపాకము
బాంబే హల్వా

వీటిల్లో మీకు ఇష్టమైనది చేసుకొని తినండి.. చేయించుకొని తినండి.. చేసుకున్నవాళ్ళింటికెళ్ళి కూర్చోండి.. వాళ్ళు పెడితే తినండి.. లేకపోతే అడగండి. హోటల్లో కొనుక్కొని తినండి. అంతే గానీ తినడం మాత్రం మానకండి.

సేకరణ: మీ స్నేహితుడు
వాట్సాప్ అభిమాని

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)			
హైదరాబాద్	410	విజయవాడ	425
ముంబయి	460	ఢిల్లీ	440
చెన్నై	450	బెంగళూరు	435



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.			
హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	115	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135



సెన్సెక్స్ +12.53
36,386



నిఫ్టీ +1.75
10,906

రూపాయి
₹71.17
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,591
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ టౌన్ హాల్ సమావేశం



విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కత్రియ హోటల్స్ & టవర్స్‌లో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ ఆల్వే అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్ మరియు విజయవాడ సర్కిల్ ఆఫీస్ సిబ్బంది వారితోపాటు జంట నగరాలలోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని బ్యాంక్ ED జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సర్కిల్ ప్రధాన CO అరుణ్ కుమార్ అగర్వాల్ సభ్యులందరిని ఆహ్వానించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బిజినెస్ ప్రొఫైల్ ముఖ్యాంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన బ్రాంచ్ మేనేజర్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేసారు.

పీఎన్‌బీ డైరెక్టర్లను తొలగించిన కేంద్రం



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నీరవ్ మోదీ రూ.13వేల కోట్లకు మోసం చేసిన కేసులో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంక్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంజీవ్ శరణ్, కె.వీర బ్రహ్మాజీరావుపై విధుల నుంచి తొలగించింది. ఈ చర్యను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వాగతించింది. ఆ సంఘ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ "మేము కేంద్ర ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నాం. అత్యున్నత నిర్వహణ బృందానికి తెలియకుండా ఇంత భారీ స్థాయిలో మోసం జరగడానికి అవకాశం లేదు. ప్రభుత్వం కూడా వారి వాదనలు విన్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకొంది" అని పేర్కొన్నారు.

ఇదే తొలిసారి..

నేషనల్ బ్యాంక్స్ స్కీం 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి. 2018 జులైలో శరణ్, బ్రహ్మాజీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో పేర్కొంది. వారి వివరణలు పరిశీలించాక బ్యాంక్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని వారిని తొలగించింది.

టాప్ 50 బిజినెస్ దేశాల్లో ఇండియా

- ఎన్నడూ లేనంతగా భారత్ వ్యాపారానికి సిద్ధంగా ఉంది
- గుజరాత్ గ్లోబల్ సదస్సులో ప్రధాని మోడీ



గాంధీనగర్: వ్యాపారం చేయడానికి అత్యంత అనువైన 50 దేశాల జాబితాలో వచ్చే ఏడాదికి భారత్‌ను చేర్చాలనే లక్ష్యంతో ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సులో ప్రసంగించారు. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన వ్యాపారానికి అనువైన దేశాల జాబితాలో ప్రస్తుతం భారత్ 77వ స్థానంలో ఉందని మోదీ తెలిపారు. ఈ జాబితాలో భారత్ 75స్థానాలను ఎగబాకిందని, వచ్చే ఏడాదికి టాప్ 50లో ఉంటుందని వెల్లడించారు. ఇందుకోసం తమ బృందం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు.వ్యాపారంలో భారత్ లక్ష్యాలను చేరుకోనివ్వకుండా ఆపుతున్న అడ్డుగోడలను తొలగించడంపై తాను దృష్టి పెట్టినట్లు మోదీ ఈ సదస్సులో వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేనంతగా భారత్ ఇప్పుడు వ్యాపారానికి సిద్ధంగా ఉందని అన్నారు. జీఎస్టీ అమలుతో పాటు ఆన్‌లైన్ చెల్లింపులు వ్యాపార వృద్ధికి సహకరిస్తున్నాయన్నారు. తమ ప్రభుత్వం భారత దేశాన్ని, దాని ఆర్థిక స్థితిని బలోపేతం చేసేందుకు ఎన్నో నిర్మాణాత్మక సంస్కరణలు, కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. గత నాలుగేళ్లలో 263 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి వ్యాపార, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

జీఎస్‌టీ ఎగవేతదారులపై అధికారుల కొరడా

- రూ. 3 కోట్లు స్వాధీనం
- హైదరాబాద్‌లో పలు చోట్ల తనిఖీలు



విజయక్రాంతి, హైదరాబాద్: నగరంలో జీఎస్‌టీ ఎగతదారులపై జీఎస్‌టీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఇవేకాకుండా ఇతర అనేక రంగాలలో పన్ను ఎగవేతదారులపై కూడా నిఘా పెట్టారు. షెల్ కంపెనీల ద్వారా లబ్ధిపొందుతున్న వ్యాపారులపై పంజా విసిరారు. ఈ క్రమంలో శనివారం రూ. 500 కోట్లు టర్నోవర్ ఉన్న ఓ ఐరన్ అండ్ స్టీల్ వ్యాపార సంస్థ యజమాని ఇంటితో పాటు కంపెనీల్లో కూడా తనిఖీలు నిర్వహించారు.

సుమారు మూడు డొల్ల కంపెనీల ద్వారా రూ. 40 కోట్లు మేరకు ఇన్‌వాయిసెస్‌లు జారీ చేసినట్లు గుర్తించిన అధికారులు ఈ దాడు లు చేశారు. ఈ క్రమంలో శంకరంపేట, నాచారం డివిజన్ల పరిధిలోని యూనిట్లలో భారీ అక్రమాలు బయటపడ్డాయి. నకిలీ ఇన్వెస్టర్ వల్ల ప్రభుత్వానికి దాదాపు రూ. 4 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు. అధికారులు సదరు సంస్థ యజమానిని అరెస్ట్ చేసి సుమారు రూ. 3 కోట్లు రికవరీ చేసినట్లు వారు తెలిపారు. వారం రోజుల్లోగా మిగతా కోటి రూపాయలు చెల్లించే విధంగా యజమాని నుంచి పూచీకత్తు తీసుకున్నామని ఒక అధికారి పేర్కొన్నారు.

దిగొచ్చిన బంగారం..రూ.60 తగ్గిన పసిడి



ఢిల్లీ: బంగారం ధర వరుసగా రెండో రోజూ తగ్గింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గడంతో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.60 తగ్గి రూ.33,160కి చేరుకుంది. స్థానిక పరిస్థితుల ప్రభావంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ట్రెండ్ బలహీనంగా ఉండడమే ధర తగ్గుదలకు కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, వెండి కూడా బంగారం బాటలోనే నడిచింది. కిలోకు రూ.280 తగ్గి రూ.40,100 వద్ద నమోదైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గడమే వెండి ధర క్షీణతకు కారణమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. అలాగే, అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 0.77 శాతం క్షీణించి 1,282.55 డాలర్లకు పడిపోగా, వెండి ధర ఔన్స్‌కు 1.26 శాతం క్షీణించి 15.41 డాలర్లకు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 60 తగ్గి రూ.33,160 వద్ద నమోదు కాగా, 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 33,010గా నమోదైంది. ఇక, సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ.25,500 వద్ద స్థిరంగా ఉంది.

త్రైమాసిక ఫలితాలను విడుదల చేసిన హెచ్‌డీఎఫ్‌సీ



- రూ.5,585.85కోట్ల నికర లాభం

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శనివారం 2018 అక్టోబరు– డిసెంబరు త్రైమాసిక ఫలితాలను విడుదల చేసింది. ఏడాదికేడాదికి పోలిస్తే సంస్థ నికర లాభం 20.31 శాతం పెరిగిందని తెలిపింది. గత త్రైమాసికంలో సంస్థ నికర లాభం రూ.5, 585.85కోట్లు వచ్చినట్లు వెల్లడించింది. అంతకుముందు ఇదే త్రైమాసికంలో రూ.4,642.60కోట్ల లాభం వచ్చినట్లు తెలిపింది. ఈసారి నికర వడ్డీ ఆదాయం పెరగడంతో సంస్థ లాభపడినట్లు పేర్కొంది.కంపెనీ నికర వడ్డీ ఆదాయం గత త్రైమాసికంలో 21.9శాతం పెరిగి రూ.12,576.75కోట్లుగా నమోదైందని హెచ్‌డీఎఫ్‌సీ వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం రూ.10,314.3కోట్లుగా నమోదైనట్లు తెలిపింది. ఇతర ఆదాయం డిసెంబరు త్రైమాసికంలో 27.2 శాతం పెరిగి రూ.4,921కోట్లుగా ఉందని వెల్లడించింది.

స్పోర్ట్స

హైదీని చూసి నేర్చుకో.. మ్యాక్స్‌వెల్ పై నెటిజెన్‌ల కామెంట్స్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ధోనీ 87 పరుగులతో టీమిండియాకు విజయం అందించాడు. మూడో వన్డేలో ధోనీ ఇచ్చిన క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ చేజార్చడంతో సోషల్‌మీడియాలో తనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్‌బాష్ లీగ్‌ల్ బ్రిస్బేన్ హీట్, సిడ్నీ థండర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో సిడ్నీ జట్టు చివరి బంతికి ఐదు పరుగులు సా ధించాల్సి ఉండగా జొనాసెన్ బౌలింగ్‌లో నికోలా కారే బంతిని బలంగా బాదింది. అయితే అందరూ దాన్ని సిక్స్ అనుకున్నారు. కానీ బ్రిస్బేన్ జట్టుకు చెందిన హైదీ బిర్కెట్ మెరుపు వేగంతో దూసుకెళ్లి క్యాచ్ అందుకోవడంతో బ్రిస్బేన్ జట్టును విజయం వరించింది. అయితే హైదీ పట్టిన క్యాచ్‌ను చూసి తన దగ్గర టిప్స్ నేర్చుకోమని మ్యాక్స్‌వెల్‌పై నెటిజెన్లు ట్వీట్ చేస్తున్నారు.

నా సందేహాలను ధోనీ నివృత్తి చేశాడు: కేదార్ జాదవ్



మెల్బోర్న్: ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ధోనీకి పూర్తి సహకారం అందిస్తూ, మరోవైపు 61 పరుగులు చేసి టీమిండియా విజయంలో కేదార్ జాదవ్ తన వంతు పాత్ర పోషించాడు. తాజాగా, జాదవ్ మాట్లాడుతూ.. ఆసీస్‌పై టెస్టు, వన్డే సిరీస్‌లు గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నాడు. ప్రపంచ కప్‌కు ముందు ఈ విజయం ఆటగాళ్లలో ఉత్సాహం నింపుతుందన్నాడు. చారిత్రక విజయం లో తాను భాగమైనందుకు చెప్పనంత ఆనందంగా ఉందన్న జాదవ్.. ధోనీతో కలిసి చివరి వరకు క్రీజులో ఉండడం సంతోషంగా ఉందన్నాడు. ఆస్ట్రేలియాలో ఇదే తన తొలి మ్యాచ్ కావడంతో క్రీజులో ఎక్కువ సేపు ఉండాలని ముందే నిర్ణయించుకున్నట్టు చెప్పాడు. మరో ఎండ్‌లో ధోనీ ఉండడం తనకు కలిసి వచ్చిందన్నాడు. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు తనకొచ్చిన సందేహాలను ధోనీని అడిగి నివృత్తి చేసుకున్నట్టు చెప్పాడు. క్రీజులో ధోనీ ఉంటే నాన్ స్ట్రయిక్‌లో ఉన్నవారికి కొంతంత బలం వస్తుందని జాదవ్ చెప్పుకొచ్చాడు.

రాహుల్, పాండ్యలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- న్యూజిలాండ్ సీరీస్‌కు అనుమతించాలి
- సీఓఏకు లేఖ రాసిన బీసీసీఐ ప్రెసిడెంట్



ముంబై: టీమిండియా యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై నిషేధం ఎత్తేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా సుప్రీం కోర్టు నియమిత పరిపాలకుల కమిటీ (సీఓఏ)ని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సీఓఏకు లేఖ రాశారు. పాండ్య, రాహుల్ వివాదంపై ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేక జనరల్ సమావేశం జరపలేమని స్పష్టం చేశారు. 'పాండ్యా, రాహుల్ లు తప్పు చేశారు. ఇప్పటికే వారిపై నిషేధం విధించి ఆస్ట్రేలియా పర్యటన నుంచి అర్థాంతరంగా రప్పించాం. ఇద్దరు ఆటగాళ్లు వారి వ్యాఖ్యల పట్ల బేషరతు క్షమాపణలు చెప్పారు. కావున విచారణ పూర్తేయ్యే వరకు వారిపై నిషేధం ఎత్తేసి జట్టులోకి తీసుకోవాలి. అలాగే న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో ఆడించాలి' అని సీకే ఖన్నా లేఖలో కోరారు.బీసీసీఐ నియమావళి ప్రకారం ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డు నియమించిన అంబుడ్స్‌మన్‌కే ఉంది. ఇద్దరు క్రికెటర్లపై విచారణ అనంతరం బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి కూడా తన నివేదికను అంబుడ్స్మ న్‌కే ఇవ్వాలి. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్మ న్‌ను నియమించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించి ంది. అంబుడ్స్‌మన్‌ను నియమించే అధికారం కేవలం బోర్డుకే ఉందని...అది ఎన్నికలు నిర్వహించి కార్యవర్గం ఏర్పడిన తర్వాత మాత్రమే సాధ్యమని బీసీసీఐ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వాదించడంతో ఈ కేసును వాయిదా వేసింది.

వారం రోజుల తర్వాత వాదనలు వింటామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఆటగాళ్లపై సస్పెన్షన్ కొనసాగించడం సరైందరి కాదని ఖన్నా అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఓఏ, బీసీసీఐ ఆఫీస్ బేరర్స్‌కు సైతం విజ్ఞప్తి చేశారు.

పాండ్యా, రాహుల్ లు మాట్లాడింది ముమ్మాటికి తప్పేనని, కానీ వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ప్రపంచకప్ ముందు ఇద్దరి ఆటగాళ్ల ప్రాక్టీస్ అవసరమని, ఈ యువ ఆటగాళ్ల తప్పును క్షమించి ఓ అవకాశం ఇద్దామని కోరారు.

శ్రీశాంత్‌కు తొలిసారి క్షమాపణలు చెప్పిన హర్భజన్ సింగ్



ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌లో హర్భజన్ సింగ్.. పేసర్ శ్రీశాంత్‌కు చెంప దెబ్బ కొట్టిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ముంబై ఇండియన్స్ తరపున ఆడిన హర్భజన్ వికెట్ తీసిన శ్రీశాంత్.. ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. దీంతో వెంటనే హర్భజన్ అతన్ని చెంప దెబ్బకొట్టాడు. దీంతో ఈ ఘటన వివాదాస్పదమైంది.

ఈ ఘటనలో కొందరు శ్రీశాంత్‌కు మద్దతివ్వగా.. మరికొందరు హర్భజన్‌ను సపోర్ట్ చేశారు. ఇటీవలే ఈ ఘటనలో హర్భజన్ సింగ్ శ్రీశాంత్‌ను క్షమాపణ కోరినట్టు వచ్చిన కథనాలను హర్భజన్ ఖండించాడు. తాను ఎప్పుడు ఈ విషయంలో క్షమాపణ చెప్పలేదని భజ్జీ తెలిపాడు. కానీ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హర్భజన్ శ్రీశాంత్‌కు క్షమాపణ చెప్పాడు. తన జీవితంలో ఏదైన ఘటనని మార్చే అవకాశం ఉంటే.. ఏది మారుస్తారని అడిగిన ప్రశ్నకు.. "ఈ విషయాన్ని నేను కచ్చితంగా చెప్పాలి. శ్రీశాంత్‌కు నాకు మధ్య జరిగిన ఘటన గురించి ఇప్పటికీ చాలా చర్చ జరుగుతోంది. ఒకవేళ నేను గతానికి వెళ్లి.. నేను చేసిన తప్పు ఏదైనా సరిదిద్దుకోవాలంటే.. కచ్చితంగా ఆ రోజు ఆ పని చేయకుండా ఉంటాను. అది నా తప్పే.. అందుకు నేను క్షమాపణ చెబుతున్నా. ఆ ఘటన జరిగి ఉండకూడదు. అతను చాలా మంచి ఆటగాడు. శ్రీశాంత్‌కు, అతని భార్యకు, పిల్లలకు నా అభినందనలు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారనుకుంటున్నా. శ్రీ.. ఒకవేళ ఒకరే సంతానం అయితే.. రెండో దాని కోసం ట్రై చేయి" అని సమాధానం ఇచ్చాడు హర్భజన్.

ఢిల్లీని గెలిపించిన సాక్షి మాలిక్



పంచకుల: రియో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన సాక్షి మాలిక్ ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో ఢిల్లీ సుల్తాన్ జట్టును గెలిపించింది. ఈ విజయంతో లీగ్‌లో ఢిల్లీ తొలి విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం యూపీ దంగల్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఢిల్లీజట్టు 4–3 తేడాతో విజయం సాధించింది. తొలుత జరిగిన పురుషుల 57 కిలోల విభాగంలో ఢిల్లీ రెజ్లర్ పంకజ్ ప్రత్యర్థిని చిత్తుచేసి జట్టుకు శుభారంభాన్ని అందించాడు. ఆతర్వాత జరిగిన మహిళల 57 కిలోల విభాగంలో మ్యాచ్‌లో యూపీ రెజ్లర్ సరిత విజయం సాధించి స్కోరును సమం చేసింది. అనంతరం గేర్ మార్చిన ఢిల్లీ రెజ్లర్లు ఖేతిక్ సబ్లోవ్ 74 కిలోల బౌట్లో, పింకీ 53 కిలోల విభాగంలో నెగ్గడంతో ఆ జట్టు 31తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో జరిగిన 86 కిలోల బౌట్లో యూపీ రెజ్లర్లు మిషితురి, 125 కిలోల సూపర్ వెయిట్లో జార్జి సకండ్లిజ్ విజయం సాధించి 33తో రెండోసారి స్కోరును సమం చేశారు. ఇక, నిర్ణయాత్మక ఆఖరి 62 కిలోల బౌట్లో బరిలోకి దిగిన సాక్షి అద్భుతంగా పోరాడి నవజ్యోత్ కౌర్ను మట్టికరిపించి ఢిల్లీని విజయతీరాలకు చేర్చింది.

మలేషియా టోర్నీలో సైనా నెహ్వాల్ ఓటమి



కౌలాలంపూర్: మలేషియా మాస్టర్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో సైనా నెహ్వాల్ ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారిన్ చేతిలో 16–21, 13–21 తేడాతో ఓడిపోయింది. 28 ఏళ్ల భారత క్రీడాకారిణి 2017లో బ్యాడ్మింటన్ టైటిల్ గెలవగా, 2011లో రన్నరప్‌గా నిలిచింది. సుమారు గంట 40 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ మారిన్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. తొలిగేమ్‌లో 9–9 పాయింట్లతో సమంగా ఉన్న సైనా.. ఆ తరువాత మారిన్ ధాటికి వెనుకపడింది. ఒకానొక దశలో 9–13తో వెనుకంజలో ఉన్న సైనా నెహ్వాల్ వెంటనే పుంజుకుని 14–14తో స్కోరును సమం చేసింది. అనవసర తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకుని16–21 తేడాతో తొలిగేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లోనూ మారిన్ తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో సైనాకు ఓటమి తప్పలేదు. గతంలో సైనా, కరోలినా మారిన్‌తో 10 సార్లు తలపడగా.. ఇద్దరు చెరో ఐదుసార్లు విజయం సాధించారు. మలేషియా టోర్నీ విజయంతో మారిన్ 6–5తో లీడ్‌లో ఉంది. మ్యాచ్ అనంతరం సైనా మాట్లాడుతూ మారిన్‌కు అభినందనలు తెలపుతూ ట్వీట్ చేసింది.'ఈ మ్యాచ్లో లక్ష్యాన్ని అందుకోలేకపోయానని తెలిపింది. అద్భుతంగా ఆడిన మారిన్‌కు అభినందనలు చెబుతూ వచ్చే వారం జరుగనున్న ఇండోనేషియా ఓపెన్‌లో రాణిస్తానని సైనా ధీమా వ్యక్తం చేసింది.

ఫెదరర్‌ను కలిసిన కోహ్లీ, అనుష్క



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా పై వన్డే, టెస్టుల్లో విజయం సాధించిన తర్వాత విరాట్ కోహ్లీ, అనుష్కశర్మ సంబరాల్లో మునిగిపోయారు. అందులో భాగంగా విరాట్, అనుష్కలు ఇద్దరూ ఆస్ట్రేలియా ఓపెన్ మ్యాచ్‌లను వీక్షించేందుకు వెళ్లారు. జకోవిచ్, సెరీనా మ్యాచ్‌లను వీక్షించారు. అనంతరం రోజర్ ఫెదరర్‌తో కలిసి కోహ్లీ, అనుష్కలు దిగిన ఫోటోలను కోహ్లీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈసందర్భంగా కోహ్లీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఇది అద్భుతమైన రోజు, ఆస్ట్రేలియా వేసవికి మంచి ముగింపు పలికాం. ఎప్పటికీ గుర్తుంచుకుంటాం అని కోహ్లీ తన ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.